77 ఖాళీలు.. రేసులో 359మంది

- నేడు అబుదాబి వేదికగా ఐపిఎల్ సీజన్-2026 మినీ వేలం

8

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 133 | విజయవాడ, మంగళవారం 16 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 16 December 2025 | Rs

సిటీ

హాయ్‌ల్యాండ్‌లో గ్రూప్-1 మూల్యాంకనం

హైకోర్టుకు రిటైర్డు జడ్జి కమిటీ నివేదిక - తిరిగి విచారణ చేస్తామన్న బెంచ్

అమరావతి: గ్రూప్-1 మెయిన్ పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలపై ఏర్పాటైన రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ కెజి శంకర్ ఆధ్వర్యాన స్వతంత్ర కమిటీ నివేదిక హైకోర్టుకు అందింది. జస్టిస్ శంకర్, బార్ కౌన్సిల్ మాజీ ఛైర్మన్ గంటా రామారావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్‌తో కమిటీని హైకోర్టు గతంలో ఏర్పాటుచేసింది. హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరిగిందో లేదో తేల్చేందుకు ఈ స్వతంత్ర కమిటీ వేసింది. ఓఎంఆర్ షీట్లపై మార్కులను నమోదు చేశారని, హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరిగిందని కమిటీ నివేదికలో పేర్కొంది. నివేదిక ప్రతులను ఇరుపక్షాల న్యాయవాదులు ఇవ్వాలని రిజిస్ట్రీకి జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ ఎ హరిహరనాథ శర్మతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఇప్పటికే ఈ వ్యవహారంపై వాదనలు పూర్తి చేసి తీర్పును రిజర్వు చేసిన బెంచ్, కమిటీ నివేదిక అందుకోవడంతో మళ్లీ విచారణ చేస్తామని ప్రకటించింది. తిరిగి విచారణ చేయాలని, ఉత్తీర్ణులై ఉద్యోగాలు సాధించిన కొందరు అభ్యర్థుల అనుబంధ పిటిషన్‌ను అనుమతించింది. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

మరింత అగాధంలోకి..

- డాలర్ @ రూ.90.74
- నెలరోజుల్లో 80 పైసల పతనం
- ఆసియాలోనే అత్యంత పేలవ కరెన్సీగా నమోదు

న్యూఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి పతనం శరవేగంగా కొనసాగుతోంది. తాజాగా మరింత అగాధంలోకి పడిపోయింది. సోమవారం నాటి గణాంకాల ప్రకారం డాలర్‌తో మారకం విలువ ఒకేరోజు 25పైసలు పతనమైంది. ఒక డాలర్‌కు 90.74 రూపాయలకు పడిపోయింది. రూపాయి విలువ పతనంలో ఇదో రికార్డు. భారతదేశ చరిత్రలో ఇంత కనిష్ట విలువతో రూపాయి ఎప్పుడూ లేదు. తాజా పతనంతో ఆసియాలోనే అత్యంత పేలవ కరెన్సీగా రూపాయి నమోదైంది. ప్రపంచ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ కొంతకాలంగా క్షీణిస్తున్న సంగతి తెలిసిందే. దీనిని సరిదిద్దడానికి చర్యలు చేపట్టాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆ దిశలో స్పందించడం లేదు. పైగా మన దేశం నుండి జరిగే ఎగుమతులకు రూపాయి పతనం ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అదే సమయంలో పెద్దఎత్తున చేసుకుంటున్న చమురు దిగుమతులు తద్వారా పెరుగుతున్న ఆహార దినుసులు దేశంలో ప్రజల కొనుగోలు శక్తి నానాటికీ తగ్గిస్తున్న విషయాన్ని మరుగుపరుస్తున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో మెరుగుదల లేకపోవడంతో రూపాయి పతనం ప్రభావం సామాన్యులపై నేరుగా పడుతోంది.

అమెరికా - భారత్ మధ్య వాణిజ్య చర్చలు కొలిక్కిరాకపోవడం, విదేశీ పెట్టుబడిదారుల భారీ ఉపసంహరణలు, వాణిజ్యలోటు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌కు డిమాండ్ పెరగడం వంటివి కూడా రూపాయి పతనానికి కారణాలుగా చెబుతున్నారు.

రికార్డు కనిష్టానికి..

ఉదయం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌లో డాలర్‌తో రూపాయి 90.53 వద్ద తెరుచుకుంది. ఇంట్రాడేలో 31 పైసలు పతనమై ఏకంగా 90.80 కనిష్టాన్ని చవిచూసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 0.3 శాతం లేదా 25 పైసలు కోల్పోయి రూ.90.74కి క్షీణించింది. ఇది డిసెంబర్ 12న నమోదైన గత రికార్డు కనిష్టం రూ.90.55ను దాటడం గమనార్హం. నెలరోజుల్లో రూపాయి విలువ దాదాపుగా 80 పైసలు పతనమైంది. నవంబర్ 15వ తేదిన డాలర్‌కు 89.90 రూపాయలుగా నమోదుకాగా, నవంబర్ 25న 90.10గా, డిసెంబర్10న 90.53గా డిసెంబర్ 15న 90.74 రూపాయలుగా భారత కరెన్సీ విలువ పడిపోయింది,. ఈ ఏడాది ఇప్పటి వరకు రూపాయి.. డాలర్‌తో పోలిస్తే దాదాపు ఆరు శాతం క్షీణించింది. ఆసియా కరెన్సీల్లో అత్యంత దారుణ ప్రదర్శన కనబర్చిన కరెన్సీగా రూపాయి ఉండటం గమనార్హం.

డాలర్ సూచీ ఈనెలలో ఇప్పటి వరకు 1.1 శాతం పడిపోయినా.. రూపాయి మాత్రం ఈ ప్రయోజనాన్ని పొందలేకపోయింది. అమెరికా.. భారత్‌పై విధించిన 50 శాతం వరకు ఉన్న భారీ టారిఫ్‌లు ఎగుమతులను దెబ్బతీయడం, విదేశీ పెట్టుబడిదారులకు భారత మార్కెట్ ఆకర్షణ తగ్గడమే ఇందుకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెప్తున్నారు.

నెల రోజుల్లో రికార్డు పతనం



నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకు

విదేశీ పెట్టుబడిదారుల భారీ విక్రయాలు

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు విదేశీ పెట్టుబడిదారులు 18 బిలియన్ డాలర్లకు పైగా విలువైన భారత షేర్లను విక్రయించారు. ఒక్క డిసెంబర్‌లోనే 500 మిలియన్ డాలర్లకు పైగా విలువ గల బాండ్లను అమ్మారు. నవంబర్‌లో సరుకుల వాణిజ్య లోటు 32 బిలియన్ డాలర్లుగా అంచనా ఉంది. అయితే ఇది అక్టోబర్‌లో నమోదైన 41 బిలియన్ డాలర్లతో పోలిస్తే కొంత తగ్గే అవకాశం కనిపిస్తోంది.

వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి

భారత ప్రధాన ఆర్థిక సలహాదారు చేసిన వ్యాఖ్యలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేశాయని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. అమెరికా వాణిజ్య ఒప్పందం మార్చి నాటికి మాత్రమే సాధ్యమవుతుందని ఆయన చెప్పడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన పెరిగింది. ఇక ఇదే సమయంలో భారత్ - యూరోపియన్ యూనియన్ (ఇయు) వాణిజ్య ఒప్పందం కూడా ఈ ఏడాది చివరి నాటికి పూర్తయ్యే అవకాశాలు లేవని బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ శుక్రవారం నివేదించింది.

"వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవడంతో విదేశీ నిధుల ఉపసంహరణలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. ఇది రూపాయిపై ఒత్తిడిని పెంచుతోంది" అని ఫిన్‌రెక్స్ ట్రెజరీ అడ్వైజర్స్ ట్రెజరీ హెడ్ అనిల్ భన్సాలీ పేర్కొన్నారు. రూపాయికి తదుపరి రూ.90.80కి పడిపోవచ్చన్నారు. అది దాటితే రూ.91 నుంచి రూ.92 దిశగా వెళ్లే అవకాశం ఉందన్నారు. ఈనెల 5 నాటికి భారత విదేశీ మారక నిల్వలు 687.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇది సెప్టెంబర్ ప్రారంభంలో నమోదైన ఈ ఏడాది గరిష్ఠ స్థాయి 703 బిలియన్ డాలర్ల కంటే తక్కువ కావటం గమనార్హం.



కేంద్ర రైల్వే, సమాచార, ప్రసార, ఐటి శాఖల మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిసిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్

విద్యా ప్రమాణాల పెంపునకు కేంద్రం సహకరించాలి

- స్టార్స్ ప్రాజెక్టు కింద రూ.4,400 కోట్ల ఆర్థిక సాయం
- రూ.1,270 కోట్ల అదనపు నిధులు,
- 11 జెఎన్‌విలు మంజూరు చేయండి
- కేంద్ర మంత్రులతో మంత్రి లోకేష్ భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో విద్యా ప్రమాణాల పెంపునకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. నైపుణ్య గణనకు సహకారం అందించాలని, విశాఖలో జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం నాడిక్కడ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఐటి మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి జయంత్ చౌదరితో మంత్రి నారా లోకేష్ వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యా ప్రమాణాల పెంపు కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను మంత్రికి వివరించారు. 'రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 11 జవహర్ నవోదయ విద్యాలయాలు (జెఎన్‌వి) మంజూరుతోపాటు, రాష్ట్రానికి ఇటీవల కాలంలో కేంద్రం కేటాయించిన 12 కేంద్రీయ విద్యాలయాల (కెవి) ఏర్పాటు, కార్యాచరణకు చర్యలు తీసుకోవాలి. సమగ్ర శిక్ష సంస్కరణల్లో భాగంగా స్టార్స్ ప్రాజెక్టు కింద రాష్ట్రానికి రూ.4,400 కోట్ల ఆర్థిక సాయం అందించి మద్దతుగా నిలవాలి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించిన రూ.1,270 కోట్ల అదనపు నిధుల మంజూరుకు ఆమోదం తెలిపాలి. పిఎం పోషణ్ పథకం కింద పైలట్ ప్రాతిపదికన రాష్ట్రంలో 155 స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు అనుమతివ్వాలి' అని కోరారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో గుంటూరు జిల్లా చినకాకానిలో అభివృద్ధి చేసిన మోడల్ ఆటిజం సపోర్ట్ సెంటర్‌ను ప్రారంభించాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి లోకేష్ ఆహ్వానించారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సహకారం అందించాలి

రాష్ట్రంలో నిర్వహించనున్న నైపుణ్య గణనకు సహకారం అందించాలని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కోరారు. రాష్ట్రంలో యువ పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక వ్యవస్థాప కులకు అద్భుతమైన వేదికగా ఏర్పాటుచేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ మిగతా 7లో

జిఆర్‌ఎంజి బిల్లును ఉపసంహరించాలి

- ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి
- సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని భావిస్తున్న వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) బిల్లు, 2025 (విబి-జిఆర్‌ఎఎంజి)ను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించింది. పని చేసే హక్కును కల్పించాలన్న సార్వత్రిక డిమాండ్ ఆధారిత చట్టమైన ఎంఎన్‌ఆర్‌ఇజిఎ మౌలిక స్వభావం ఈ ప్రతిపాదిత బిల్లులో పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ బిల్లు, డిమాండ్‌కు తగినట్లుగా నిధులను కేటాయించాల్సిన బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వాన్ని చట్టపరంగా తప్పించేస్తోంది. హామీతో కూడిన ఉపాధిని 100 నుండి 125రోజులకు పెంచుతామన్న ప్రభుత్వ వాదన కేవలం పై మెరుగు చర్య మాత్రమేనని పేర్కొంది. వాస్తవానికి, ఉపాధి కార్డులను హేతుబద్ధీకరిస్తున్నామన్న పేరుతో పెద్ద సంఖ్యలో గ్రామీణ కుటుంబాలను మినహాయించడానికి ఈ బిల్లు ద్వారాలు తెరుస్తోంది. వ్యవసాయ పనులు ఉధృతంగా వున్న సమయంలో 60 రోజుల వరకు ఉపాధిని సస్పెండ్ చేసేందుకు ప్రభుత్వాలను అనుమతిస్తున్న నిబంధన వల్ల అత్యంత అవసరమైన కాలంలో గ్రామీణ కుటుంబాలకు పనులను నిరాకరిస్తూ, వారు భూస్వాములపై ఆధారపడాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. పని ప్రదేశాల్లో డిజిటల్ హాజరును తప్పనిసరి చేయడం వల్ల పని నష్టం, వారి హక్కులు తిరస్కరించడం వంటి అనేక ఇబ్బందులు కార్మికులకు తలెత్తుతున్నాయి. నిధులను అందచేసే విధానంలో ప్రతిపాదిత మార్పును తీసుకురావడం ప్రధానంగా ఆందోళన కలిగిస్తోంది. వేతనాల చెల్లింపుల విషయంలో ప్రధాన రాష్ట్రాలతో 60:40 నిష్పత్తిలో పంచుకోవాలన్న ఏర్పాటును తీసుకురావడం ద్వారా ఈ బిల్లు కేంద్రం బాధ్యతను తగ్గిస్తోంది. నిరుద్యోగ భృతిని, అలాగే రాష్ట్రాలకు ఆలస్యమైనందుకు నష్టపరిహారం ఇవ్వాల్సిన బాధ్యతను రాష్ట్రాలకు బదిలీ చేస్తోంది. దీనివల్ల నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి పాత్ర ఇవ్వకపోగా వాటిపై మిగతా 7లో

భావితరాలకు గుర్తుండేలా..

పొట్టి శ్రీరాములు స్మృతి వనం

- మెమోరియల్‌గా నెల్లూరులోని ఆయన నివాసం
- ఆత్మార్పణ దినోత్సవం సభలో సిఎం చంద్రబాబు

పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవ సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో భావితరాలకు గుర్తుండేలా అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహంతోపాటు స్మృతి వనాన్ని తమ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల గౌరవం కోసం ఆత్మార్పణగావించారని, స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారితో, ఆ తర్వాత తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పోరాడారన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం ప్రభుత్వం పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కోసం 58 రోజుల పాటు నిరవధిక నిరాహార దీక్ష చేసి, రాష్ట్రాన్ని సాధించారన్నారు.

ఆయన ఆత్మార్పణ చేసిన దినాన్ని 'డే ఆఫ్ శాక్రిఫైజ్' కింద డిసెంబరు 15ను జరుపుతున్నామన్నారు. వచ్చే ఏడాది మార్చి 16 వరకు ఆయన శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. చెన్నైలోని ఆయన ఆత్మార్పణ చేసిన భవనాన్ని సంరక్షించాలని తాము నిర్ణయించామన్నారు. నెల్లూరులో ఆయన నివాసం ఉన్న భవనాన్ని మెమోరియల్‌గా మారుస్తామన్నారు. రకరకాల ప్రాంతాల్లో వేర్వేరుగా కులధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని, అలాకాకుండా ఇక మీదట రాష్ట్రమంతా అందరికీ 'ఆర్యవైశ్య' పేరుతో సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. అమరావతిలో ఆయన విగ్రహాన్ని స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్‌గా నిర్మిస్తున్నామని, వచ్చే మార్చి 16న ఆయన 125వ జయంతి సందర్భంగా ప్రారంభిస్తామన్నారు. ఇందుకోసం 6.8 ఎకరాల భూమిని కేటాయించినట్లు సిఎం వెల్లడించారు. తెలుగు వాళ్లం ఓ శాశ్వత చిరునామా లేకుండా కొన్ని రోజులు చెన్నై కింద, మరికొన్ని రోజులు కర్నూలులో, మిగతా 7లో

నేటి నుంచి పాఠశాలల్లో

ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాఠశాలల్లోని విద్యార్థుల కోసం ఆధార్ స్పెషల్ క్యాంపులను మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ పేర్కొంది. ఈ మేరకు ఆ శాఖ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నవంబరులో నిర్వహించిన క్యాంపులు కొనసాగింపుగా ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు, 22 నుంచి 24వ తేదీ వరకు క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు బయోమెట్రిక్ అప్‌డేట్ మిగిలి ఉన్నవారు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆ శాఖ విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 16,51,271 మంది విద్యార్థులుండగా, గత క్యాంపులో 3,34,599 మంది విద్యార్థులు ఆధార్ నమోదు చేసుకోగా, నమోదు చేసుకోవాల్సిన వారు 13,16,672 మంది ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

గంజాయి రహిత సమాజం నిర్మించాలి

- మాఫియాను రాజకీయాలకు దూరం పెట్టండి
- పెంచలయ్య సంతాప సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు వాసుకి

పెంచలయ్య సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు యు వాసుకి

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

గంజాయి రహిత సమాజాన్ని నిర్మించడానికి యువత, విద్యార్థులు ముందుకురావాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు యు.వాసుకి పిలుపునిచ్చారు. ఇటీవల గంజాయి ముఠా చేతిలో దారుణ హత్యకు గురైన కె పెంచలయ్య సంతాప సభ సిపిఎం నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. నెల్లూరు టౌన్ హాల్లో నిర్వహించిన ఈ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అధ్యక్షత వహించారు. తొలుత పెంచలయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వాసుకి మాట్లాడుతూ పెంచలయ్య కుటుంబం వెంట పార్టీ ఉంటుందని అన్నారు. తన జీవితాన్ని సమాజ మార్పు కోసం త్యాగం చేసిన పెంచలయ్య లాంటి కార్యకర్తలను కాపాడుకోవాల్సి ఉందని తెలిపారు. సమాజ మార్పు కోసం ఆయన తన కళ ద్వారా ప్రచారం చేశారని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సాంస్కృతిక పోరాటంలో నిమగ్నమై పనిచేశారని వివరించారు. గంజాయి మాఫియాకు వ్యతిరేకంగా పనిచేసినందునే ఆయనను పొట్టన పెట్టుకుందని తెలిపారు. రాజకీయాల్లో గంజాయి, డ్రగ్స్ మాఫియాలకు అవకాశాలు ఇవ్వకూడదన్నారు. సిపిఎం అలాంటి వ్యక్తులకు ఎక్కడా స్థానం ఇవ్వదని, మాఫియా, గుండాలు, అరాచక శక్తులకు తమ పార్టీలో స్థానం ఉండదని రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు. మిగిలిన పార్టీలూ ఈ పద్ధతి పాటిస్తే మాఫియాను పూర్తిగా దూరం పెట్టొచ్చన్నారు. శత్రువులు సిపిఎం నాయకులు, మిగతా 7లో

పెంచలయ్య కుటుంబానికి రూ.7.20 లక్షలు ఆర్థిక సాయం

సిపిఎం నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి సేకరించిన రూ.7.20 లక్షలు ఆర్థిక సాయాన్ని పెంచలయ్య భార్య దుర్గకు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు యు.వాసుకి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అందజేశారు. ఇది తొలి విడత సాయమని, మళ్లీ సాయం అందిస్తామని తెలిపారు. నెల్లూరు సిటీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.లక్ష అందజేస్తామని హామీ ఇచ్చారు.

సెకి ఒప్పందాన్ని రద్దు చేయండి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

2

జీతం.. కార్మికుల కష్టార్జితం

- ఉత్పత్తితో ముడిపెడుతూ వేతనాల్లో కోత పెట్టడం దారుణం
- స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట సిఐటియు ధర్నా

2

తిరువనంతపురం కార్పొరేషన్‌లో కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కు!

- సర్దుబాటు చేసుకున్న ఇరు పార్టీలు

7

ఎస్‌పి బాలు విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- కల్చరల్ (హైదరాబాద్)

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ప్రాంగణంలో గాన గంధర్వుడు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం గాత్రం అక్షయపాత్ర వంటిదని, ఎవరికి ఏం కావాలో దాన్ని ఆయన తన స్వరంతో పలికించేవారని, ఆయన స్వర మాధుర్యాన్ని ఆస్వాదించని కుటుంబం తెలుగు రాష్ట్రాల్లో లేదని, అందుకే ఆయన తెలుగింటి మనిషిగా చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. పాడుతా తీయగా కార్యక్రమం ద్వారా భవిష్యత్ సంగీత కళాకారులను ఆయన ముందే నిర్ణయించేశారని పేర్కొన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే బాలసుబ్రహ్మణ్యంకు తెలుగువారు ఇచ్చే అతి పెద్ద నివాళని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సంగీత ప్రపంచంలో రారాజుగా వెలుగొంది, కోట్లాదిమంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప వ్యక్తి ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం అని పేర్కొన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బాలసుబ్రహ్మణ్యం బాల్య స్నేహితులు జివి మురళి, విగ్రహ శిల్పి వడయార్, ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం సతీమణి సావిత్రి, కుటుంబసభ్యులు పార్వతి, శైలజ, శుభలేఖ సుధాకర్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

జీతం.. కార్మికుల కష్టార్జితం

- ఉత్పత్తితో ముడిపెడుతూ వేతనాల్లో కోత పెట్టడం దారుణం
- స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట సిఐటియు ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

జీతం.. కార్మికుల కష్టార్జితమని, ఉత్పత్తితో ముడిపెడుతూ వేతనాలు చెల్లిస్తుండడాన్ని నిరసిస్తూ స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట ఉక్కు కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ... ఉత్పత్తి ఆధారంగా జీతాలు చెల్లిస్తామని యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని, హెచ్‌ఆర్‌ఎ చెల్లించాలని, ఉక్కు నగరంలో నివసిస్తున్న కార్మికులకు విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, సిఎమ్‌డిపై సిబిఐ విచారణ జరపాలని, ఉత్పత్తికి అవసరమైన రా మెటీరియల్‌ను సక్రమంగా అందించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ దిశగా కేంద్ర ప్రభుత్వం నడిపిస్తుంటే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అందుకు సహకరిస్తోందని అన్నారు. రా మెటీరియల్ నాణ్యతా లోపాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తి ఆధారంగా జీతాలు చెల్లిస్తామన్న సర్క్యులర్‌ను ఉపసంహరించుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ... యాజమాన్యం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాల వల్ల గడచిన నెలలో సుమారు రూ.240 కోట్ల నష్టం వాటిల్లిందని, ఇందుకు కార్మికులను బాధ్యులను చేయడం అన్యాయమని అన్నారు.

ఆర్‌ఎల్‌సి ఆదేశాలను కూడా యాజమాన్యం పట్టించుకోవడం లేదని తెలిపారు. యూనియన్ అధ్యక్షులు యు.రామస్వామి మాట్లాడుతూ... ప్లాంట్ ప్రైవేటీకరణ లేదని చెబుతూనే కీలక విభాగాల్లో టెండర్లను పిలవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. సరైన సమయంలో రా మెటీరియల్ అందిస్తే ఉత్పత్తికి కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, జిల్లా నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి సొంత గనులు లేకపోవడమే ప్రధాన అడ్డంకిగా ఉందన్నారు. ధర్నాలో యూనియన్ వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, పెద్ద సంఖ్యలో యువ కార్మికులు పాల్గొన్నారు. తొలుత ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వరకూ ర్యాలీ చేపట్టారు.

స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం వద్దకు ర్యాలీగా వెళ్తున్న నాయకులు, కార్మికులు

ఎస్‌టియు కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌టియు నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మల్లు రఘునాథ రెడ్డి, ఎల్ సాయిశ్రీనివాస్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయారు. ఈ నెల 13, 14 తేదీల్లో జరిగిన యూనియన్ 79వ వార్షిక కౌన్సిల్ సమావేశాల్లో ఈ ఎన్నిక జరిగినట్లు రఘునాథరెడ్డి, సాయి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారిగా పిఎస్ ప్రతాప్‌రాజు, పరిశీలకులుగా ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు కత్తి నరసింహారెడ్డి వ్యవహరించారని వెల్లడించారు. ఆర్థిక కార్యదర్శిగా కె కోటేశ్వరరావు, ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులుగా కెవి శేఖర్, సంయుక్త అధ్యక్షులుగా గాజుల నాగేశ్వరరావు, వెంగళరెడ్డి, బి అరుణ కిషోర్, ఇలియాస్ బాషా, జె గంగాధర్ బాబు, పెదబాబు తదితరులు ఎన్నికయ్యారని తెలిపారు.

యుఎస్ కాన్సులేట్ జనరల్‌ను కలిసిన రెహానా బేగం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యుఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్‌ను రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ డాక్టర్ రెహానా బేగం కలిశారు. 4 రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా యుఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్ సోమవారం విజయవాడకు చేరుకున్నారు. ఆమెను సోమవారం కలిసిన బేగం వివిధ అంశాలపై చర్చించారు. మంగళవారం నాడు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో భేటీ కానున్న విలియమ్స్ అనంతరం విశాఖపట్నం వెళ్లనున్నారు.

పండ్లు, ఆక్వా ఉత్పత్తుల్లో రాష్ట్రం తొలి స్థానం

- టిడిపి మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వ చర్యల వల్ల పండ్లు, ఆక్వా ఉత్పత్తుల్లో దేశంలోనే రాష్ట్రం తొలి స్థానంలో నిలిచిందని మాజీ ఎమ్మెల్సీ పి అశోక్ బాబు తెలిపారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయనడానికి ఆర్‌బిఐ నివేదికే నిదర్శనమని తెలిపారు. 193 లక్షల టన్నుల పండ్ల ఉత్పత్తిలో దేశంలోనే రాష్ట్రం తొలి స్థానంలో నిలిచిందన్నారు. పరిశ్రమల వృద్ధి, పవర్ ప్రొడక్షన్, ఆక్వా, పర్ క్యాపిటా ఇన్‌కమ్, జిఎస్‌డిపిలో రాష్ట్రం మెరుగ్గా కనిపించిందని చెప్పారు. ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కనీసం అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

అందుబాటులోకి వైద్య విద్య

వైద్య విద్య ఖర్చు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎక్కువ మందికి చదువు అందాలంటే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ (పిపిపి) తప్పనిసరి అని రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాన్నే కేంద్ర ప్రభుత్వం కూడా ఆమోదించి, అదే మార్గంలో ముందుకెళ్లాలని స్పష్టంగా చెప్పిందన్నారు. వైసిపి ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను ప్రారంభించి వాటిల్లో నాలుగింటిని కూడా పూర్తి చేయకుండా రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టిందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే కోటి సంతకాల డ్రామాలు మానుకోవాలన్నారు. చంద్రాబు విజన్ కలిగిన నాయకుడైతే జగన్ విధ్వంసానికి మారుపేరని గుంటూరు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు.

వైవి సుబ్బారెడ్డి మాజీ పిఎకు బెయిల్ నిరాకరణ

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారనే కేసులో టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి మాజీ పిఎ చిన్న అప్పన్నకు బెయిల్ మంజూరు చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. అప్పన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు సోమవారం తీర్పు చెప్పారు. నెయ్యి సరఫరాదారుల నుంచి కమీషన్ తీసుకున్నారన్న అభియోగాల నేపథ్యంలో అప్పన్నను సిబిఐ అరెస్టు చేయడంతో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా ఎదురుదెబ్బ తగిలింది.

హైకోర్టుకు హాజరైన సిఎస్

ప్రజాశక్తి-అమరావతి

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్ల కల్పనకు సంబంధించిన పిటిషన్ల విచారణకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఎంఎం నాయక్ సోమవారం హైకోర్టు విచారణకు హాజరయ్యారు. తదుపరి విచారణకు వారిద్దరికీ హైకోర్టు మినహాయింపునిచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్ల కల్పనకు ప్రభుత్వం నాన్చుడు వైఖరిని అవలభిస్తోందని తప్పుబట్టింది. ప్రభుత్వ సాచివేత ధోరణిని అవలంబించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయడాన్ని ఆక్షేపించింది. ఉద్యోగోన్నతుల కల్పనకు నిర్ణయం తీసుకునేందుకు ఎంత సమయం కావాలని ప్రశ్నించింది. ఈ పిటిషన్‌పై ఐదేళ్లుగా విచారణ కొనసాగుతూనే ఉందంది. ఈ వ్యవహారం మంత్రివర్గ ఉపసంఘం పరిశీలనలో ఉందని ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పడంతో 4 వారాల గడువు ఇచ్చింది. విచారణను జనవరి 20కు వాయిదా వేస్తూ జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్‌తో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఆదేశించింది. ఉద్యోగోన్నతుల్లో తమకు అన్యాయం జరిగిందంటూ పలువురు ఉద్యోగులు ఉమ్మడి రాష్ట్ర హైకోర్టులో పిటిషన్లు వేశారు. రిజర్వు కేటగిరి ఉద్యోగులు నిర్దేశిత పరిమితికి మించి ఉద్యోగోన్నతులు పొందనట్లయితే, రిజర్వేషన్ పరిధిలోకి రాని ఉద్యోగులకు ఉద్యోగోన్నతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని 2018లో తీర్పు వెలువరించింది. ఈ తీర్పును ప్రభుత్వం అమలు చేయలేదంటూ ది సెక్రటేరియట్ బిసి అండ్ ఒసి ఎంప్లాయీస్ అసోసియేషన్, ఇతరులు వేసిన వ్యాజ్యాలపై ఈ విచారణ వాయిదా పడింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- ఆటో, బైక్ ఢీకొని భార్యాభర్తలు
- అంబులెన్స్, బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం/జంగారెడ్డిగూడెం

ఆటో బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. ఈ ఘటన కొయ్యలగూడెం గ్రామ శివారులోని కొత్తూరు క్రాస్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాడాల గ్రామానికి చెందిన ప్రత్తి జయరాజు (50) ఆయన భార్య సత్య (42)లు సోమవారం బైక్‌పై జంగారెడ్డిగూడెంలోని తమ కుమార్తె ఇంటికి బయలుదేరారు. వీరు కొయ్యలగూడెం శివారులోని కొత్తూరు క్రాస్ రోడ్డు వద్దకు వచ్చేసరికి జంగారెడ్డిగూడెం నుంచి కొయ్యలగూడెం వైపు వస్తున్న ట్రక్ ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న భార్యాభర్తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

అంబులెన్స్, బైక్ ఢీకొని వ్యక్తి మృతి

అంబులెన్స్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామ శివారులో దేవరపల్లి-తల్లాడ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న చింతలపాటి శంకర్ (40) అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై తాడువాయి వెళ్లాడు. అక్కడ పని చూసుకుని తిరిగి జంగారెడ్డిగూడెం బయలుదేరాడు. ఈ క్రమంలో వేగవరం గ్రామ శివారులోకి వచ్చేసరికి విజయవాడ నుంచి వేలేరుపాడుకు మృతదేహాన్ని తీసుకొస్తున్న ప్రభుత్వ అంబులెన్స్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జంగారెడ్డిగూడెం పోలీసులు తెలిపారు.

పొట్టి శ్రీరాములు విగ్రహం పెట్టలేరా?

- వర్థంతి కార్యక్రమంలో వైసిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేసే స్తోమత ప్రభుత్వానికి లేకపోవడం విచారకరమని వైసిపి నాయకులు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు వర్థంతి సందర్భంగా తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసిపి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. అమరజీవి విగ్రహ ఏర్పాటుకు చందాలు వసూలు చేసుకోవాలని చెప్పడం ఆయన్ను అవమానించడమేనని పేర్కొన్నారు. జగన్ నాయకత్వంలో పొట్టి శ్రీరాములు ఆశయాలు కొనసాగిస్తామని, నవంబరు 1వ తేదీనే రాష్ట్ర అవతరణ దినం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి చేరుకున్న కోటి సంతకాల వాహనాలు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల పత్రాలు సోమవారం సాయంత్రం తాడేపల్లికి చేరుకున్నాయి. సంతకాలతో కూడిన పత్రాలను తీసుకుని వివిధ జిల్లాల నుంచి బయలుదేరిన వాహనాలు సాయంత్రానికి రాగా, మరికొన్ని రాత్రికి చేరుకున్నాయి. వీటిని ఈ నెల 18న గవర్నరుకు అందజేయనున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

17న నాట్స్ జానపద సాంస్కృతిక సంబరాలు

ప్రజాశక్తి - గుంటూరు

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) జానపద సాంస్కృతిక సంబరాలు ఈనెల 17న గుంటూరు వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు మందాడి శ్రీహరి తెలిపారు. సోమవారం గుంటూరులోని ఓ హోటల్లో మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావుతో కలిసి సంబరాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ 2009లో భాషే రమ్యం, సేవే గమ్యం లక్ష్యంతో నాట్స్ ఏర్పడిందని అప్పటి నుండి అమెరికాతో పాటు, మాతృభూమిలోనూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సాంస్కృతిక సంబరాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన తప్పెటగూళ్లు, కొమ్ము కోయ డప్పు, కోలాటం, డప్పు నృత్యాలు తదితర ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

అనంతరం ఎంపికైన 30 మంది ఉపాధ్యాయులు, కవులకు పురస్కారాలు అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం డిసెంబర్ 1 నుండి నాట్స్ ప్రతినిధుల పర్యటనలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లో విద్యా, వైద్యం, తదితర రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ నాట్స్ వారు చేపడుతున్న విద్యా, వైద్య సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. జిల్లాలో అనేక చోట్ల మెడికల్ క్యాంప్‌లు, కంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గత నెల 17 వేల మందికి ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు నాట్స్ సౌజన్యంతో అందజేశామని తెలిపారు. నాట్స్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కిరణ్ మాట్లాడుతూ అంతరిస్తున్న జానపద కళలను కాపాడాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న సాంస్కృతిక సంబరాలను ప్రజలు పెద్ద ఎత్తున హాజరై తిలకించాలని కోరారు. సంబరాల సమన్వయ కమిటీ సభ్యులు కాకుమాను నాగేశ్వరరావు, పి.వి.రమణ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మందాడి శ్రీహరి, కెఎస్ లక్ష్మణరావు, తదితరులు

వైద్య రంగంలో ఎఐ సేవలు

- ఫిబ్రవరిలో జాతీయస్థాయిలో ముసాయిదా ఖరారు
- వైద్యారోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య రంగంలో విస్తృతంగా కృత్రిమ మేధ (ఎఐ) సేవలను ఉపయోగించనున్నట్లు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ తెలిపారు. వైద్యారోగ్యశాఖ వద్ద ఉన్న హెల్త్ డేటా ఆధారంగా ఎఐను అనుసంధానం చేయబోతున్నట్లు వెల్లడించారు. 'ఎఐ స్ట్రాటజీ ఫర్ హెల్త్'పై రీజనల్ మల్టీ స్టేక్ హోల్డర్స్ కన్వర్జన్స్ వర్క్‌షాప్ సోమవారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగింది. ఈ కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎఐ వినియోగంలో జాతీయస్థాయిలో ఓ ముసాయిదా (డ్రాఫ్ట్)ను తయారు చేసేందుకు దేశవ్యాప్తంగా జోనల్ స్థాయిల్లో కార్యశాలలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ క్రమంలోనే విజయవాడలో నిర్వహించామని చెప్పారు. ఈ సదస్సులో చర్చించిన అంశాలను నివేదిక రూపంలో కేంద్రప్రభుత్వానికి సమర్పిస్తామని వెల్లడించారు. ఫిబ్రవరిలో ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ ద్వారా డ్రాఫ్ట్ ఖరారవుతుందని తెలిపారు. ఈ డ్రాఫ్ట్ ఆధారంగా రాష్ట్రాల స్థాయిలో విడిగా ఆరోగ్య రంగంలో ఎఐ అమలు వ్యూహాన్ని ఖరారు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే అమల్లో ఉన్న డేటా ఆధారిత సేవలను కూడా కేంద్రం పరిగణనలోకి తీసుకుని జాతీయస్థాయిలో ఎఐ వినియోగం ఎలా ఉండాలన్న దానిపై ముసాయిదా తయారవుతుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఖాతాలను వ్యక్తిగతంగా తెలుసుకోవడానికి, జనరేట్ చేసుకోవడంపై మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్)లో అనుసంధానం చేయబోతున్నామని చెప్పారు. ఆరోగ్య సేవల్లో తీసుకున్న డిజిటలైజేషన్ చర్యల వల్ల రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీలో ముందుండాలనే లక్ష్యంతో వైద్యారోగ్యశాఖ తరపున తాము అవసరమైన చర్యలు తీసుకోబోతున్నామని తెలిపారు. ఎమర్జింగ్ టెక్నాలజీ వినియోగించి కంటిన్యూస్ కేర్ 'సంజీవిని' ద్వారా ప్రజలు, రోగులకు సేవలు అందించబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో గుర్తించిన 10 ప్రధాన వ్యాధుల భారం, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అంతర్జాతీయ స్థాయిలో నిపుణులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్ మాట్లాడుతూ.. స్క్రబ్ టైఫస్ జ్వరాల కేసుల గుర్తింపునకు ఆర్‌టిజిఎస్ అవేర్‌తో అనుసంధానం చేస్తూ డిసీజ్ సర్వైలెన్స్, ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాల ద్వారా అవసరమైన చర్యలు, వ్యాధి మూలాలు తెలుసుకునేందుకు వైద్య రంగ నిపుణులతో చర్చించామని పేర్కొన్నారు. మెలియోడయెసిస్ వ్యాప్తి కారణంగానే గుంటూరు జిల్లా తురకపాలెంలో మరణాలు చోటుచేసుకున్నాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధర్ బాబు, వైద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎమ్‌డి గిరీషా, ఆయుష్ కమిషనర్ దినేష్ కుమార్, ఆర్‌టిజిఎస్ అడిషనల్ సిఇఒ శౌర్యమన్ పటేల్ పాల్గొన్నారు.

రేపటి నుంచి కలెక్టర్ల సదస్సు

- భారీ ఎజెండా సిద్ధం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మరోసారి కలెక్టర్ల సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 17, 18 తేదీల్లో ఈ సదస్సును నిర్వహించనుంది. బుధవారం ఉదయం 10 గంటలకు భూ పరిపాలన ముఖ్య కమిషనర్ ఉపన్యాసంతో సదస్సు ప్రారంభం కానుంది. అనంతరం అధికారులకు చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ, ఆర్థికశాఖల మంత్రులు, ఉప ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేస్తారు. ఈ సదస్సులో ముందుగా జిఎస్‌డిపి, కెపిఐ, అభివృద్ధి లక్ష్యాలపై చర్చ జరగనుంది. అలాగే పథకాలకు సంబంధించి ప్రజల్లో ఉన్న విశ్వాసంపై, ఇ-ఆఫీస్, ఫైళ్ల పరిష్కారం, కేంద్ర పథకాల అమలు, శాఖల వారీ పెట్టుబడులు, పలు సంక్షేమ పథకాలపై చర్చిస్తారు. రెండో రోజు సదస్సులో పి-4, నైపుణ్యాభివృద్ధి, జనాభా నిర్వహణ, జల సంరక్షణ, స్వచ్ఛాంధ్ర వంటి అంశాలపై చర్చ జరగనుంది. ఆదాయ వనరులశాఖ, జిల్లాల ర్యాంకులు, జాబ్ మేళా వంటి అంశాలపై చర్చ జరగనుంది. చివరిగా శాంతిభద్రతలపై సమీక్ష ఉంటుంది. సంబంధిత శాఖల అధికారులంతా తమ శాఖల వివరాలతో సిద్ధంగా రావాలని ప్రభుత్వం ఆదేశించింది.

నరసాపురం - చెన్నై వందేభారత్ రైలు

- ప్రారంభించిన కేంద్ర మంత్రి వర్మ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నుంచి చెన్నై వందేభారత్ రైలు వ్యాపారులకు, తీర ప్రాంత మత్స్య పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం రైల్వే స్టేషన్ నుండి చెన్నై వందేభారత్ రైలు ప్రయాణాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, రాష్ట్ర మహిళా ఆర్థిక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పీతల సుజాత, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ షరీఫ్, విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాక్య, ఏ.డి.ఆర్.ఎం ఆపరేషన్స్ కొండా శ్రీనివాసరావు, చీఫ్ పిఆర్ఒ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారంతా మాట్లాడారు. తొలుత నరసాపురం జనసేన పార్టీ కార్యాలయం నుండి మంత్రి శ్రీనివాస వర్మ, ఎంఎల్ఎ నాయకర్ కూటమి నాయకులతో కలిసి పట్టణంలోని పలు వీధుల గుండా ర్యాలీగా రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు.

సెకి ఒప్పందాన్ని రద్దు చేయండి సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజలపై లక్ష కోట్ల రూపాయలకు పైగా భారంపడే ఏడువేల మెగావాట్ల అదానీ సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్ల మేరకు గత వైసిపి ప్రభుత్వం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి) ద్వారా అదానీ సంస్థతో అవినీతికర, అక్రమ ఒప్పందాలను చేసుకుందని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ తప్పులను సరిదిద్ది ఒప్పందాలను రద్దుచేస్తామని ప్రతిపక్షంలో వుండగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారని పేర్కొన్నారు. హైకోర్టులో తెలుగుదేశం పార్టీ తరపున పయ్యావుల కేశవ్ కేసు కూడా వేశారని గుర్తు చేశారు. అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత వారు మాట తప్పి ఒప్పందాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. అదానీ కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టడం సరికాదని, ఈ ఒప్పందం వల్ల లక్షకోట్ల రూపాయలు పైగా 25 సంవత్సరాల కాలంలో ప్రజలపై అదనపు భారం పడుతుందని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని వెల్లడించారు. గత ప్రభుత్వ పెద్దలకు ముడుపులిచ్చి ఈ ఒప్పందం చేసుకున్నట్లు అమెరికా కోర్టుల్లో ఆ దేశ ప్రభుత్వమే కేసు నమోదు చేసిందని వివరించారు. సోలార్ విద్యుత్ యూనిట్ రెండు రూపాయల కంటే తక్కువగానే లభిస్తున్నప్పటికీ రూ.2.49పైసల చొప్పున ఒప్పందం చేసుకోవడం గర్హనీయమని పేర్కొన్నారు. ఇప్పటికే 23 వేల మెగావాట్లకు పైగా సోలార్, పవన ఇతర రకాల విద్యుత్ అందించే ఒప్పందాలు పలు సంస్థలతో జరిగాయని వివరించారు. జనవరి నుండి అదానీ సంస్థ అందించే విద్యుత్ దశలవారీగా అందుబాటులోకి వస్తుందని, దీంతో మిగులు ఏర్పడి ప్రభుత్వ థర్మల్, ఇతర కేంద్రాల్లో విద్యుత్ సరఫరా ఉత్పత్తి నిలిపివేయవలసి వస్తుందని తెలిపారు. ఇప్పటికే పలు సందర్భాల్లో ఈ విధంగా విద్యుత్ ఉత్పత్తి నిలిపివేస్తున్నారని, ఉత్పత్తి నిలిపినా ఫిక్స్‌డ్ చార్జీల భారం మాత్రం వినియోగదారులపై పడుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గత 18 నెలల్లో రూ.15,485 కోట్లు ఎఫ్‌పిపిసిఎ (సర్దుబాటు ఛార్జీలు) ప్రజలపై మోపిందని, మరో రూ.12,717 కోట్లు ట్రూ అప్‌ఛార్జీల భారం వేయడానికి రంగం సిద్ధమైందని తెలిపారు. ఈ స్థితిలో అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందం మరింత ప్రమాదకరంగా మారనుందని, రాష్ట్ర ప్రజలకు, విద్యుత్ సంస్థలకు హానికరంగా మారిన ఏడువేల మెగావాట్ల అదానీ, సెకి ఒప్పందం తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈ అక్రమ, ప్రజా వ్యతిరేక ఒప్పందంపై విచారణ జరపడానికి కూడా ప్రభుత్వం సిద్ధం కావడం లేదని, కూటమి ప్రభుత్వం మాట తప్పి అదానీ, వైసిపి అవినీతి ఒప్పందాన్ని రక్షిస్తోందని, ప్రజల నెత్తిన భారం వేస్తోందని తెలిపారు. ఇప్పటికైనా ప్రజలకిచ్చిన మాట ప్రకారం ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరారు. ఒప్పందం రద్దు కోసం ప్రభుత్వంపై ప్రజలు ఒత్తిడి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు 'టెట్' మినహాయింపునకు కృషి చేయాలి

- ముఖ్యమంత్రికి వి శ్రీనివాసరావు విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపునకు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి సోమవారం లేఖ రాశారు. 2025 సెప్టెంబరు ఒకటిన సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు 'టెట్' అర్హత పొందాలని, లేని పక్షంలో ఉద్యోగాల నుండి తొలగించాలని ఇచ్చిన తీర్పు దేశంలో 25 లక్షల మంది, రాష్ట్రంలో లక్ష మంది ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేసిందని తెలిపారు. దీనిపై ఎస్‌టిఎఫ్‌ఐతో సహా అనేక ఉపాధ్యాయ సంఘాలు, తమిళనాడు, బెంగాల్‌లో రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో 27 రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయని పేర్కొన్నారు. యుటిఎఫ్ సహా అనేక ఉపాధ్యాయ సంఘాలు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇంతవరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయలేదని పేర్కొన్నారు. దీనికి పరిష్కారం జాతీయ విద్యా హక్కు చట్టంలో సెక్షన్ 23 (2) సవరణ చేయడమేనని, దీనిపై ముఖ్యమంత్రిగా చొరవ తీసుకొని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 23 (2)కి చట్ట సవరణ గానీ, ఆర్డినెన్సు గానీ జారీ చేయించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల ప్రయోజనాలు కాపాడాలని కోరారు.

30 నుంచి వైకుంఠద్వార దర్శనాలు

- ఏడు రోజుల పాటు సర్వదర్శనం
- 50 అజెండాలపై నేడు పాలకమండలి సమావేశం
- తిరుమలలో టిటిడి ఛైర్మన్ తనిఖీలు

ప్రజాశక్తి- తిరుమల

శ్రీవారి ఆలయంలో ఈ నెల 30వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు వైకుంఠద్వార దర్శనాలు జరగనున్నాయని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. మొదటి మూడురోజులకు ఎలక్ట్రానిక్ లక్కీడిప్ ద్వారా టోకన్లు కేటాయించామని, మిగతా ఏడు రోజులు సామాన్యులు ఎలాంటి టోకన్లు లేకపోయినా సర్వదర్శనం ద్వారా వైకుంఠద్వార దర్శనం కల్పిస్తామన్నారు. తిరుమలలో సోమవారం పలు ప్రాంతాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. సామాన్య యాత్రికులు ఉచిత వసతి పొందే పిఎసిలు, లాకర్లు, కల్యాణకట్ట, ఉచిత భోజనశాలలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సౌకర్యాలపై యాత్రికుల అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దాత మంతెన రామలింగరాజు సహకారంతో త్వరలో మరింత అత్యాధునిక సౌకర్యాలతో టిటిడి పిఎసిలను తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో బిఆర్ నాయుడు మాట్లాడారు. గత అనుభవాల దృష్ట్యా వైకుంఠద్వార దర్శనాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. మంగళవారం 50 అజెండా అంశాలపై పాలకమండలి సమావేశం జరగనుందని తెలిపారు. యాత్రికుల రద్దీ ఉన్న ప్రదేశాలలో ఏర్పాట్లు, సదుపాయాలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు. ఇటీవల తొమ్మిది కోట్ల రూపాయలు ఓ దాత విరాళంగా అందజేశారని తెలిపారు. ఆలయ ధ్వజస్తంభాల కోసం వంద ఎకరాల్లో టిటిడి స్వయంగా దివ్యవృక్షాలని పెంచాలను భావిస్తుందని, పలమనేరులోని టిటిడి గోశాల ఆవరణ వృక్షాల పెంపుదలకు అనువైన స్థలంగా గుర్తించామని తెలిపారు. దివ్యవృక్షాల ప్రాజెక్టుపై పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు. కల్యాణ కట్టకు ఏడు నెలల అవసరాలకు సరిపడా బ్లేడులను ప్రముఖ బ్లేడు తయారీ సంస్థ 17వ తేదీ విరాళంగా అందజేసిందని తెలిపారు

పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి : మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు రాబట్టాలని, ఇందుకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని అధికారులను బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత ఆదేశించారు. ఫలితాలతోపాటు, విద్యార్థులు ఆరోగ్యం, సంరక్షణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థుల సంరక్షణపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత వసతి గృహాల సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి ఎబిసిడబ్ల్యుఇఒలు, డిబిసిడబ్ల్యుఇఒలు, ఎంజెపి కన్వీనర్లు, ప్రిన్సిపల్స్‌తో మంత్రి సోమవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షల నేపథ్యంలో జిల్లాల వారీ వసతి గృహాలు, గురుకులాల్లో తీసుకుంటున్న చర్యల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. గత విద్యా సంవత్సరంలో వచ్చిన ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలించి, వచ్చే పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. ఫలితాలతోపాటు విద్యార్థులంతా ఎ-గ్రేడ్‌లో ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. చలి తీవ్రత దృష్టిలో ఉంచుకుని వసతి గృహాల్లో వార్డెన్లు భోజనాన్ని ముందుగా రుచి చూసి, అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు. బయట ఆహారం వసతి గృహాల్లోకి తీసుకురావొద్దని సూచించారు. ఎబిసిడబ్ల్యుఇఒలు, డిబిసిడబ్ల్యుఇఒలు, ఎంజెపి కన్వీనర్లు తరచూ వారి పరిధిలోని వసతి గృహాలు, గురుకులాలను సందర్శించాలని ఆదేశించారు. వార్డెన్‌లు రాత్రి వేళల్లో వసతి గృహాల్లోనే ఉండాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో బిసి సంక్షేమశాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఎంజెపి కార్యదర్శి మాదవీలత తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్థంతి సందర్భంగా సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన చిత్రపటానికి మంత్రి సవిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. జూమ్ కాన్ఫరెన్స్‌కు ముందు జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే దీక్ష చేపట్టి ఆత్మార్పణ చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. అమరజీవి పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఎంతో ఆదర్శమని తెలిపారు. ఆయన లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

కార్మిక కర్షక ఐక్యతకు తొలి పిలుపు

> భారత కార్మికవర్గం 1920వ సంవత్సరం తరువాత ఎదుర్కొన్న జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులకు అత్యంత ప్రాముఖ్యత వున్నది. భారత స్వాతంత్ర్యోద్యమంలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొనివున్న సమయంలో, కొద్దిమంది భారత యువతలో నూతన రాజకీయ ఆలోచనలు ప్రారంభమయ్యాయి. అప్పుడే ప్రప్రథమ మార్క్సిస్టు బందాలు ఏర్పడ్డాయి. ఇవి చాలా పరిమిత స్థాయితో వున్నప్పటికి భారత రాజకీయాల్లోను, ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోను మార్క్సిస్టు అంతర్జాతీయ అవగాహన ఛాయలు పడసాగాయి. ఇదిలా వుండగా, 1920 అక్టోబర్ 17న సోవియట్ యూనియన్‌లోని తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు ప్రవాసంలో ఏర్పాటైంది. 1921లో మొట్టమొదటిగా కార్మిక, కర్షక ఐక్యతకు పిలుపునిచ్చింది

'కార్మిక, కర్షక ఐక్యత' ... ఈ నినాదానికి ఉన్న ప్రాధాన్యతను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఉధృతంగా సాగుతున్న జాతీయ విముక్తి ఉద్యమంలో నాయకత్వాన్ని బూర్జువా వర్గం చేతిలో ఉంచడానికి ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో ఈ నినాదం మొట్టమొదటిసారి వినిపించింది! అహ్మదాబాద్‌లో జరుగుతున్న కాంగ్రెస్ సమావేశంలో జాతీయ విముక్తి ఉద్యమ నాయకత్వం విషయమై తీవ్ర స్థాయిలో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ప్రవాసం నుండే భారత కమ్యూనిస్టు పార్టీ (1921 డిసెంబర్1) ఒక ప్రణాళికను విడుదల చేసింది. ఆ ప్రణాళికలో కార్మిక, కర్షక ఐక్యత, దాని ఆవశ్యకత గురించి మొదటిసారి ఎత్తిచూపింది. భారత రాజకీయ చరిత్రలోనే కార్మిక, కర్షక ఐక్యత గురించి మాట్లాడటం అదే మొదటిసారి! అనంతర కాలంలో ఆ నినాదానికి

ఎం.ఎన్. రాయ్ (మధ్యలో), వ్లదిమిర్ లెనిన్ (ఎడమవైపు), మాగ్జిమ్ గోర్కీ (లెనిన్ వెనుక నిలబడి) -1920 అక్టోబర్ 17న తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపన సందర్భంగా.

లభించిన ప్రాధాన్యత గురించి ప్రత్యేకంగా వివరించాల్సిన అవసరం లేదు. దేశ రాజకీయ వ్యవస్థను మార్చగల్గిన శక్తి కార్మిక, కర్షక వర్గాలకు మాత్రమే వున్నది. కాన్పూరు కార్మికులు కోరినట్లుగా ట్రేడ్ యూనియన్ల తక్షణ కోర్కెలను కాంగ్రెస్ తన కోర్కెలుగా స్వీకరించాలి. విదేశీ దోపిడీని అంతం చేయాలనీ, దేశంలోని ధనిక వర్గాలకు గుత్తాధిపత్యం సంక్రమించరాదని, భారత ప్రజానీకాన్ని రాజకీయ, ఆర్థిక సామాజిక దోపిడీ నుండి విముక్తి చేయాలని కోరుతున్నట్లు కాంగ్రెసు చేతల్లో చూపించాలని కాన్పూర్ కార్మికులు కోరారు. కార్మిక, కర్షక ఐక్య పోరాటాల ప్రాధాన్యతను సరియైన దృక్పథంతో చెప్పడం ఇదే ప్రప్రథమం. ప్రజలు రాజకీయంగానూ, ఆర్థికంగానూ, సామాజికపరంగానూ విముక్తి పొందాలన్న విషయాన్ని కమ్యూనిస్టు పార్టీ మానిఫెస్టో ప్రజల ముందుంచింది. కాని బూర్జువా వర్గ నాయకత్వానికి, దాని సిద్ధాంతాలకు కట్టుబడివున్న జాతీయ కాంగ్రెస్‌ను కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక ఏమాత్రం ప్రభావితం చేయలేకపోయింది. అయినప్పటికి తరువాత కాలంలో కాంగ్రెస్‌కు వెలుపల వున్న అనేక మందిని ఆకర్షించింది.

భారతదేశ వాస్తవ పరిస్థితుల ప్రాతిపదికగా పరిపూర్ణమైన కార్యక్రమాన్ని కాంగ్రెస్ ఇవ్వలేదు. అంతేగాక సంపూర్ణ స్వాతంత్ర్యం విషయం కూడా ప్రస్తావించలేదు. స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహిస్తున్న వారికి లక్ష్యం గురించి ఏ మాత్రం స్పష్టత లేని కారణంగా భారత జాతీయోద్యమం పెడదారులు పెట్టింది. ఈ తరుణంలో భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ స్వాతంత్ర్య లక్ష్యసాధనకు ఒక స్పష్టమైన కార్యక్రమాన్ని గయలో జరిగిన కాంగ్రెస్ సమావేశం (1922) ముందు వుంచింది. కాని కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ఈ కార్యక్రమాన్ని కనీసం మహాసభ ప్రతినిధుల పరిశీలనకు కూడా పెట్టలేదు. అయినప్పటికీ ఈ కార్యక్రమం విశేష ప్రచారం పొందింది. కార్మికుల్లో పెంపొందుతున్న చైతన్యం, వారు సాగిస్తున్న సమరశీల ఆర్థిక పోరాటాలు చూసిన సామ్రాజ్యవాద ప్రభుత్వం కలవరపడింది. భారత కార్మిక వర్గ రాజకీయోద్యమాన్ని మొగ్గలోనే తుంచి వేయడానికి 'కమ్యూనిస్టు కాన్పూరు కుట్ర కేసు' (1924) బనాయించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య కార్మికవర్గ రాజకీయ పోరాటం మరింత ఉధృతం కావడానికి, కార్మికవర్గ సిద్ధాంతం మరింత త్వరగా దేశంలో వ్యాప్తి చెందడానికి తోడ్పడింది.

అంతర్జాతీయ కార్మిక పోరాటాలు

లెనిన్ 1919లో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (మూడవ ఇంటర్నేషనల్)ను స్థాపించిన తరువాత 1921 జూన్‌లో మాస్కోలో ఈ ఇంటర్నేషనల్ మూడవ కాంగ్రెస్ (సమావేశం) జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గ విప్లవ పోరాటాలకిది ఎంతగానో సహాయపడింది. వలస, అర్ధవలస దేశాలలో జాతీయ విముక్తి ఉద్యమాలు విప్లవాలుగా పెల్లుబికాయి. 1920-21 మధ్య కాలంలో పెట్టుబడిదారీ దేశాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకొని పోయినప్పటికీ, ఆ దేశాలలోని కార్మికవర్గం ఆత్మరక్షణ (తమ హక్కుల పరిరక్షణ) పోరాటాలు చేశాయి. ఇవి కూడా బూర్జువా వర్గ తీవ్ర దాడులకు గురై చాలా వరకు విఫలమయ్యాయి. మరోవైపు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్న అనేక సంస్థల ప్రతినిధులు బెర్లిన్‌లో (1926 ఫిబ్రవరి) సమావేశమై 'వలస దోపిడికి వ్యతిరేక సమితి'ని ఏర్పరచారు. ఈ శతాబ్దపు మూడవ దశకం (1920-1930)లో ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గం, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు అంతర్జాతీయ స్థాయిలో రాజీ లేని పోరాటానికి సన్నద్ధమయ్యాయి. కాని భారతదేశంలో ఇందుకు భిన్నంగా జరిగింది. జాతీయ విముక్తి ఉద్యమంలో తమకు ధైర్యంగా నాయకత్వం వహించే వారి కోసం సామాన్య ప్రజానీకం ఆతృతగా ఎదురు చూస్తున్న ఈ తరుణంలో ... జాతీయోద్యమ నాయకత్వం బుద్ధిపూర్వకంగానే ఉద్యమ ఉధృతిని తగ్గించింది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

ముంగిట్లో బాధలు

పైసలతో పంటలు పండవు
నోట్లతోనె సరుకులు పుట్టవు
రెక్కల కష్టం రక్తం స్వేదం
కాల్వలు గడితే మీ వైభోగం
పెత్తనాలు మీ గుప్పిట్లో..
బాధలన్ని మా ముంగిట్లో

కార్మికోద్యమ యోధులు

ఎన్‌వి భాస్కరరావు

జననం : 1931 - మరణం : 1984

ఎన్‌వి భాస్కరరావు సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. విద్యార్థిదశలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. అప్పుడే వామపక్ష భావాల వైపు ఆకర్షితులయ్యారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్యమైన నాయకులకు కొరియర్‌గా పనిచేశారు. 1970లో సిఐటియు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1964-66 మధ్య ఒకసారి, 1974 రైల్వే సమ్మె సందర్భంగా మరోసారి ఆయన్ను పోలీసులు నిర్బంధించారు. 1977 అత్యవసర పరిస్థితి కాలంలో అజ్ఞాత జీవితం గడిపారు. 1980లో సిఐటియు ప్రతినిధి వర్గ సభ్యునిగా సోవియట్ రష్యాను సందర్శించారు.

'కూలీ సమితి'లతో కదలిక

కార్మికోద్యమం తొలినాళ్లలో రాష్ట్రంలో విస్తృతంగా కూలీ రక్షణ సమితులను ఏర్పాటు చేయడం ద్వారా కార్మికులను కదలించే ప్రయత్నం జరిగింది. ఈ ప్రయత్నానికి మంచి స్పందన కూడా లభించింది. 1934 జులై నెలలో కమ్యూనిస్టు పార్టీతో పాటు దాని శాఖలపై కూడా అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో కార్మికుల మధ్య పనిచేయడం కోసం కూలీ రక్షణ సమితులను ఏర్పాటు చేశారు. 1935వ సంవత్సరంలో ఏలూరు, విజయవాడ పట్టణాల్లో ఈ సమితులు మొదట ఏర్పడ్డాయి. ఆ వెంటనే,గుంటూరు, నెల్లూరు, బందరులో ఏర్పాటు చేశారు. 1936లో ఏలూరు, భీమవరంలోనూ ఈ సమితులు



ఏర్పాటయ్యాయి. ఈ సమితులను ఆధారంగా చేసుకుని వివిధ రంగాలకు చెందిన కార్మికులలో పనిచేసేవారు. 1935లో గుంటూరులో ఏర్పాటైన కూలీ రక్షణ సమితి అదే ఏడాది ప్రెస్ వర్కర్స్ యూనియన్, జట్కా బండివాళ్ల సంఘాలను స్థాపించింది. జూట్‌మిల్లులో కార్మికుల సమ్మెను బలపరిచి, యూనియన్‌ను ఏర్పాటు చేసింది. ఎంపిక చేసిన కొందరికి అధ్యయన తరగతులను కూడా నిర్వహించింది. బెజవాడ, భీమవరంతో పాటు మరికొన్ని చోట్ల రైల్వే ఉద్యోగులను, గ్యాంగ్‌మెన్లను సంఘటితం చేసే ప్రయత్నం జరిగింది. ఏలూరు కూలి రక్షణ సమితి రైసు మిల్లు కార్మికులను కదలించింది. ఈ క్రమంలో ప్రెస్ వర్కర్స్ ఉద్యమం కీలకంగా మారింది. కాకినాడ మున్సిపాల్టీ రెండెడ్ల బండిపై అదనపు పన్ను వేయడం కలకలం రేపింది. ఈ పన్నును చెల్లించ నిరాకరించిన వారిపై పోలీసులు దౌర్జన్యానికి దిగారు. దీంతో 1938 అక్టోబర్ ఒకటి నుండి సమె చేపట్టారు. చివరకు మున్సిపల్ అధికారులు దిగిరావడంతో సమ్మె విరమణ జరిగింది. ఈ సమ్మె విజయవంతం కావడం కాకినాడ పట్టణంలో స్టీవ్‌డార్, ఉప్పు, పీచు కార్మికుల సమ్మెకు మార్గదర్శకంగా మారింది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

నాటి డిమాండ్లు!

1. 8గంటల పని దినం అమలు చేయాలి
2. నిరుద్యోగ బీమా, ముసలి తనంలో పెంచన్లు
3. సంవత్సరానికి ఒక నెల జీతంతో సెలవు
4. ఉచిత గృహం, ఉచిత వైద్యం
5. గర్భిణీ స్త్రీలకు జీతంతో రెండు నెలల సెలవు
6. సమ్మె, పికెటింగ్‌లు చేయడానికి హక్కు
7. యూనియన్లను గుర్తించాలి.
8. వాక్, పత్రికా, సమావేశ స్వాతంత్ర్యాలను అమలు చేయాలి
9. కార్మికుల పిల్లలకు ఉచిత విద్యా సౌకర్యం
10. ఐదుగురు కార్మికులు పనిచేసే ప్రతిచోటా ఫ్యాక్టరీ యాక్ట్‌ను అమలుచేయాలి

కార్మికుల హక్కులను కార్మికవర్గానికి చెందని, ఇతర ప్రజానీకంలో కూడా ప్రచారం చేయాలని నిర్ణయించారు. అదే విధంగా కార్మికపోరాటాలను ఇతర సామాన్య ప్రజా పోరాటాలతో సమన్వయం చేసుకోవాలని, తద్వారా జాతీయ ఐక్య సంఘటనను నిర్మించడానికి కృషి చేయాలని భావించారు.

27 నుంచి జనవరి 2 వరకు

శ్రామిక ఉత్సవ్

- బుక్ ఫెస్టివల్, సైన్స్, ఆర్ట్ ఎగ్జిబిషన్లు సహా సాంస్కృతిక ప్రదర్శనలు
- ప్రతి రోజూ సినీ ప్రముఖులు హాజరు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

సిఐటియు అఖిల భారత మహాసభ ఈ నెల 31 నుంచి జనవరి నాలుగు వరకు విశాఖలో జరుగుతున్న నేపథ్యంలో బహుముఖ కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 27 నుంచి జనవరి రెండు వరకు బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ హాల్ వెనుక ఉన్న మేళా గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ నిర్వహిస్తున్నట్టు సిఐటియు జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ తెలిపారు. కార్మిక వర్గంలో వర్గ దృక్పథాన్ని, ప్రత్యామ్నాయ సంస్కృతిని పెంపొందించే విధంగా వారం రోజుల పాటు ఈ ఉత్సవాన్ని చేపడుతున్నట్టు వెల్లడించారు. విశాఖలో సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రామిక ఉత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా బుక్ ఫెస్టివల్, సైన్స్ ఎగ్జిబిషన్, ఆర్ట్ ఎగ్జిబిషన్, కార్టూన్ ప్రదర్శన, సాహితీ వేదిక, షార్ట్ ఫిలిం ప్రదర్శనతో పాటుగా సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. ఈ నెల 27న ప్రకాష్ రాజ్, 28న గోరేటి వెంకన్న, 29న సుద్దాల అశోక్ తేజ, 30న సినీ నటులు మాదాల రవి, రోహిణి, 31న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, సినీ దర్శకులు బాబ్జి, జనవరి 2న సినీ దర్శకులు రాజ మురుగన్‌తో పాటు స్థానిక ప్రముఖులు, జిల్లా అధికారులు, కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొంటారన్నారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు జరుగుతాయన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మంగరాజు, అనిల్ కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ప్రముఖ కార్టూనిస్ట్ జి.హరి వెంకటరమణ పాల్గొన్నారు.

జగదాంబ జంక్షన్‌లో ఆకట్టుకున్న ఎగ్జిబిషన్

మహాసభను పురస్కరించుకుని విశాఖ నగరంలోని జగదాంబ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన

విశాఖ జగదాంబ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ నెల 27 వరకు విశాఖలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, ముఖ్యమైన కార్మిక కూడళ్ల వద్ద కార్మిక పోరాటాలను, ఉద్యమ ప్రస్థానాన్ని తెలియచేసే విధంగా అనేక విషయాలను పొందుపరుస్తూ ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

వాడవాడలా సిఐటియు జెండా ఆవిష్కరణలు

'వాడవాడలా ఎగరాలి ఎర్రజెండా' కార్యక్రమంలో భాగంగా కార్మికవర్గమంతా తమ ఐక్యతను చాటుతూ సిఐటియు జెండాలను ఆవిష్కరించింది. విశాఖలో వడ్లపూడి రైల్వే వేగన్ వర్క్‌షాపు వద్ద రైల్వే వ్యాగన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సంఘం రాష్ట్ర నాయకులు కె.లోకనాథం హాజరయ్యారు. నండూరి ప్రసాదరావు భవనం వద్ద జెండాను సీనియర్ నాయకులు వై.రాజు ఆవిష్కరించారు. పిఠాపురం కాలనీలో ఉన్న సీతారాం ఏచూరి భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పాల్గొన్నారు. అనకాపల్లి పరవాడ మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు హాజరయ్యారు. అల్లూరి జిల్లాలో అరకులోయ మండల కేంద్రం నాలుగు రోడ్ల జంక్షన్‌లో, గిరిజన మ్యూజియం వద్ద పతాకాన్ని ఆవిష్కరించారు. పాడేరు, రంపచోడవరం ఏజెన్సీల్లో పతాకావిష్కరణలు జరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కాకినాడ, అంబేద్కర్, తూర్పుగోదావరి, ఉమ్మడి అనంతపురం, కడప,చిత్తూరు, విజయవాడ కర్నూలు, చిత్తూరు, ఒంగోలు, కృష్ణా, చిత్తూరు, గుంటూరులో వాడవాడలా సంఘం జెండాలను ఆవిష్కరించారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయులపై అదనపు పనుల భారం రోజురోజుకూ పెరుగుతోందని, వారిపై ఒత్తిడి తగ్గించి స్వేచ్ఛగా విద్యార్థులకు బోధన చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి గోపిమూర్తి కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు సోమవారం లేఖ రాశారు. 10వ తరగతి పరీక్షల కోసం నిర్వహిస్తున్న 100 రోజులు ప్రణాళిక కార్యక్రమం ఉపాధ్యాయులనే కాకుండా విద్యార్థులను కూడా తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోందని పేర్కొన్నారు. ఆది వారాలు, పండగ సెలవుల్లోనూ తరగతులు నిర్వహించాలని ఆదేశాలిచ్చారని తెలిపారు. దీనివల్ల ఒక్కరోజు కూడా విశ్రాంతి లేని పరిస్థితి ఏర్పడిందని, దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. మహాశివరాత్రి కూడా తరగతులు నిర్వహించాలనడం సరికాదని తెలిపారు. 100 రోజుల ప్రణాళిక పబ్లిక్ హాలిడేస్‌లో నిర్వహణ చేయకుండా సవరణ చేయాలని కోరారు. ఏ రోజు నిర్వహించిన స్లిప్ టెస్టులను ఆ రోజే మూల్యాంకనం చేసి మరుసటి రోజు లీప్ యాప్‌లో మార్కులు నమోదు చేయమనడం సాధ్యం కాని పనిగా వివరించారు. స్లిప్ టెస్టల మార్కులు ఆన్‌లైన్ లేకుండా చూడాలని కోరారు.

సైన్స్ ప్రదర్శన తేదీలు మార్చాలి

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనల తేదీలను మార్పు చేయాలని ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్‌కు పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి మరో లేఖ రాశారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఈ ప్రదర్శనలు నిర్వహించాలని ఆదేశాలిచ్చారని తెలిపారు. డిసెంబర్ 24న క్రిస్మస్ లీవ్ అని, కావున రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శన తేదీలు మార్పు చేయాలని కోరారు.

పిపిపితో విప్లవాత్మక మార్పులు : మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) మోడల్‌తో వైద్య విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. పేద ప్రజలకు, విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా కూటమి ప్రభుత్వం ఈ విధానం రూపొందించినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలను వైసిపి తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తుందన్నారు. పిపిపి విధానంలో రెండేళ్లలోనే అన్ని వైద్య కళాశాలల నిర్మాణం పూర్తవుతుందని, వైద్య విద్య సీట్లు పెరుగుతాయని తెలిపారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం 850 సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. అదనంగా 220 సీట్లు పెరుగుతాయని, ఆస్పత్రుల్లో అంతర్జాతీయస్థాయి వసతులు కల్పిస్తారని తెలిపారు.

పిఒ ఆదేశాలను నిరసిస్తూ

ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల ధర్నా

- నేటి నుంచి నల్ల బ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి - సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా ఐటిడిఎ పరిధిలోగల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులను రాత్రి బస చేయాలని పిఒ ఇచ్చిన ఆదేశాలు విరమించుకోవాలని ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. సోమవారం ఐటిడిఎ ముఖద్వారం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.మురళీమోహనరావు, ఎస్.కిశోర్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులు రాత్రి తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు ఉండేలా ఫొటోలు పెట్టమనడం సరికాదన్నారు. పిఒ రాత్రి 11 గంటలకు తనిఖీ చేసే సమయంలో ఉపాధ్యాయులు బస చేయలేదని తెలిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామనడం దారుణమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను నైట్ వాచ్‌మెన్లుగా చిత్రీకరిస్తూ, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

వెంటనే ఈ చర్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న హెచ్.కస్తూరి సస్పెన్షన్ తక్షణమే ఎత్తివేసి రీ ఇన్‌స్టేట్ చేయాలని, జయపురంలోని పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (గణితం)గా

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు

పనిచేస్తున్న శ్యామలరావుకు రెండు వార్షిక ఇంక్రిమెంట్లు కోత విధిస్తూ ఇచ్చిన మైనర్ పనిష్మెంట్ తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ ఛార్జీలు పెంచి గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని, ప్రతి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎఎన్‌ఎంలను, నైట్ వాచ్‌మెన్లను నియమించాలని కోరారు. ఉపాధ్యాయుల ధర్నాకు డిటిఎఫ్, ఎస్‌టియు, బిటిఎ ఉపాధ్యాయ సంఘాలు మద్దతు పలికాయి. అనంతరం ఎపిఒ వెంకట గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, బాబూరావు, శ్రీరామ్మూర్తి, భాస్కరరావు, యుటిఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.భాస్కరరావు, కార్యదర్శి కె.కృష్ణారావు, రాష్ట్ర నాయకులు దండు ప్రకాష్, మండల అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్‌రావు, ఫకీరు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రాజేశ్వరరావుకు మాతృవియోగం

- వి. శ్రీనివాసరావు సంతాపం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరరావుకు మాతృవియోగం కలిగింది. వయోభారం సమస్యలతో ఆదివారం రాత్రి బృంగి కాంతమ్మ (90) మరణించారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం వింజమూరులో కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కాంతమ్మ మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ప్రజా

ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనే వారని, సారా వ్యతిరేక ఉద్యమంలో కేసులను సైతం ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, గోగుల శ్రీనివాసులు,కె. అజయ్‌కుమార్, మంగళ పుల్లయ్య, ఎం.వెంగయ్య, టి,గోపాల్, రెహానాబేగం, సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ సంతాపం ప్రకటించారు.

ఆశయపథం ...అపూర్వ విజయం
రూ. 150/-
అభద్ర మరి కొన్నికథలు
రూ. 150/-
సజీవం కవిత్వం
రూ. 125/-
ప్రజా గానం సామాజిక ఉద్యమ గీతాలు
రూ. 125/-
మీరే ప్రేరణ మీదే సాధన విలువలతో వినూత్న వికాసం
రూ. 180/-
నేనెప్పుడూ కమ్యూనిజానికే సొంతం ఆరుద్ర
రూ. 175/-

వెలువడినవి

ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్
డోరు నెం.27-1-54, కారల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ - 2
ఫోన్ : 9490099061, 9490099057

బ్రాంచీలు విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు
visit : www.psbh.in

సంపాదకీయం

రాజధాని విన్యాసాలు

రాజధాని అమరావతి విషయంలో పదకొండేళ్లుగా కేంద్రంలో పాలన వెలగబెడుతున్న మోడీ ప్రభుత్వం కప్పగంతుల వైఖరి తీసుకోవడం రాజకీయ దివాళాకోరుతనమే! తాజాగా అమరావతికి చట్టబద్ధత కల్పనపై తీవ్ర గందరగోళం సృష్టించి రాష్ట్ర ప్రజలను, రాజధాని కోసం భూములిచ్చిన రైతులను అయోమయంలోకి నెట్టి చోద్యం చూడటం క్షమించరానిది. రాజధాని విస్తరణకు రెండవ దశ ల్యాండ్ పూలింగ్‌నకు టిడిపి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తుండగా, అమరావతే రాష్ట్ర రాజధానిగా చట్టబద్ధత కల్పించాలని పదేళ్ల క్రితం భూములిచ్చిన రైతుల నుంచి డిమాండ్ బలంగా ముందుకొచ్చింది. భవిష్యత్తులో ప్రభుత్వం మారితే తమ గతేమిటన్న నిలదీతలను కూటమి నేతలు ఎదుర్కొంటున్నారు. సమస్య నుంచి బయటపడటానికి చట్టబద్ధతను తెరమీదికి తెచ్చారు. న్యాయశాఖ అమోదంతో సహా చట్టబద్ధత బిల్లునకు అన్ని చర్యలూ కేంద్రంలో స్పీడుగా సాగుతున్నాయని, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు వస్తుందని కూటమి అనుకూల మీడియా విస్తృత ప్రచారం లంకించుకోగా, రాష్ట్ర సర్కార్ ఆ ప్రతిపాదనను లీగల్ బూచితో కేంద్రం తిప్పిపంపిందని వ్యతిరేక మీడియా కౌంటర్ ప్రచారం ఎత్తుకుంది. ఈ సమావేశాల్లో బిల్లు రాదన్న కబురు కేంద్ర మంత్రి పెమ్మసాని చల్లగా చెప్పారు.

యుపిఎ-2 ప్రభుత్వం పార్లమెంట్‌లో తెచ్చిన ఎ.పి. పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని బిజెపి రెండు చేతులా ఆహ్వానించడంతోపాటు ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని హామీ ఇచ్చింది. 2015 దసరా రోజున ప్రధాని మోడీ అమరావతికి శంకుస్థాపన చేశారు. అప్పుడు ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా ఉంది. రాజధాని నిర్మాణానికి రూ.2 లక్షల కోట్లు కావాలని రిపోర్టులు పంపగా కేంద్రం రూ.1,500 కోట్లు విదిల్చింది. 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసిపి మూడు రాజధానుల ఆటతో గందరగోళం సృష్టించగా, కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం నిలువరించకపోగా, రాజధాని అంశం తమ పరిధిలో లేదని, రాష్ట్రం ఇష్టమని న్యాయస్థానాల్లో అఫిడవిట్లు ఇచ్చి అయోమయానికి ఆజ్యం పోసింది. మోడీ శంకుస్థాపన చేసిన విషయాన్ని కూడా మర్చిపోయి మూడు కాకపోతే ముప్పై పెట్టుకోమని బిజెపి పెద్దలు గేలిచేసి రాష్ట్ర ప్రజలకు ద్రోహం తలపెట్టారు. మరలా 2024 ఎన్నికల్లో టిడిపిని అక్కున చేర్చుకొని కేపిటల్ గేమ్ ఆడుతున్నారు. రెండవ తడవ ప్రధాని అమరావతి పనులకు శంకుస్థాపన సమయంలో రాజధాని రైతులు చట్టబద్ధతపై పట్టుబట్టగా సభా వేదిక నుంచి ప్రధానితో ఆ విషయాన్ని చెప్పిస్తామని కూటమి పెద్దలు హామీ ఇచ్చినా అది జరగలేదు. దాంతో అమరావతి కథకు ముగింపు లేకుండా పోయింది.

అమరావతికి టిడిపి సర్కార్ తొలుత 33 వేల ఎకరాలను సమీకరించింది. భూములిచ్చిన రైతులకు హామీ ఇచ్చిన మేరకు ఇప్పటి వరకు అభివృద్ధి పర్చిన ప్లాట్లు ఇవ్వలేదు. ప్రభుత్వం మారిన ఐదేళ్లల్లో వారి పరిస్థితి అగమ్యగోచరమైంది. వ్యవహారం ఒక కొలిక్కి రాకముందే, మరోసారి 20 వేల ఎకరాల సమీకరణకు సర్కార్ నోటిఫికేషన్ ఇచ్చేసింది. మరో 20 వేల ఎకరాలంటోంది. భూములివ్వకపోతే అమరావతి మున్సిపాలిటీగా మిగులుతుందని ముఖ్యమంత్రి అన్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. ప్రభుత్వ పెద్దల బెదిరింపులు రైతుల్లో మరింత గుబులు రేపుతున్నాయి. అటు కేంద్ర ప్రభుత్వమేమో చట్ట ప్రకారం రాజధానికి బడ్జెట్ నుంచి నిధులివ్వకుండా అప్పులు చేయమంటోంది. స్వయం పోషక రాజధానని చెప్పిన టిడిపి రుణాల బాట పట్టింది. ఈ పూర్వరంగంలో చట్టబద్ధత కల్పిస్తేనే తమకు నమ్మకం కుదురుతుందన్న రైతుల డిమాండ్ సహేతుకమైనది. అమరావతికి రెండుసార్లు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవలనే అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థల, బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అటువంటి అమరావతికి చట్టబద్ధత కల్పనకు కేంద్రానికి ఏం ఇబ్బందొచ్చిందో అంతుబట్టదు. కేంద్రం తమ ప్రతిపాదనకు కొర్రీలేసి తిరస్కరించినా టిడిపి-జనసేన ఎందుకు మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి చేయట్లేదో తెలీదు. అమరావతిపై వీళ్ల విన్యాసాలు ఇంకెన్నేళ్లు రాష్ట్ర ప్రజలు భరించాలి? నాలుగు పార్టీల తొండాటపై ఇకనైనా రాజధాని రైతులు, యావత్ రాష్ట్ర ప్రజానీకం అప్రమత్తం కావాల్సిన సమయం ఆసన్నమైంది.

మహనీయుల మాట

మనిషిని మనిషి, దేశాన్ని ఇంకో దేశం దోచే విధానం అంతం కానిదే...సామ్రాజ్యవాదం పేర చలాయిస్తున్న పెత్తనాన్ని అంతం చేయనిదే... మానవజాతి అనుభవిస్తున్న బాధలు, దోపిడీ నివారింపబడవు. దీనిని అంతం చేయకుండా యుద్ధాలు వద్దని, శాంతి కావాలని చెప్పే కబుర్లు ఒట్టి నయవంచనే.

- భగత్‌సింగ్

ఆర్థిక శాస్త్రం-పెట్టుబడిదారీ విధానం



ప్రభాత్ పట్నాయక్

ప్రస్తుతం ప్రపంచం అంతటా దాదాపుగా అన్ని చోట్లా విద్యార్థులకు ఒకే తరహా ఆర్థిక శాస్త్రాన్ని బోధిస్తున్నారు. దానినే "ప్రధాన స్రవంతి" ఆర్థిక శాస్త్రంగా పరిగణిస్తున్నారు. ఈ "ప్రధాన స్రవంతి" ఆర్థిక శాస్త్రం పెట్టుబడిదారీ విధానపు వాస్తవికతను గ్రహించదు. దాని ప్రస్తుత అవతారంలో గాని, రానున్న రోజుల్లో దాల్చనున్న "కొత్త" అవతారాల్లో గాని అది ఎన్నటికీ పెట్టుబడిదారీ విధానపు వాస్తవికతను గ్రహించలేదు. దానికి అది సాధ్యం కాదు. ఎందువల్లనో చూద్దాం.

ఏ ఉత్పత్తికైనా అందులో నిమగ్నమైన వ్యక్తుల నడుమ సమన్వయం అవసరం. అది ఆటవిక సమాజంలో అడవి పందిని వేటాడడం వంటిది కానీండి లేదా ఆధునిక సమాజంలో కారు ఉత్పత్తి చేయడం వంటిది కానీయండి. ఆ ఉత్పత్తిలో పాల్గొనే వ్యక్తులు ఒక ప్లాను ప్రకారం పని చేస్తేనే వాళ్ళ లక్ష్యం నెరవేరుతుంది. అలా జరగాలంటే వారి మధ్య పరస్పరం సమన్వయం తప్పనిసరి. అటువంటి సమన్వయం ఉండాలంటే అందుకు క్రమశిక్షణ ఉండితీరాలి. పాత సమాజాల్లోని ఉత్పత్తి విధానాల్లో ఈ క్రమశిక్షణను బలప్రయోగం ద్వారా నిర్బంధంగా అమలు చేసేవారు. బానిస సమాజంలో కొంతమంది బానిసలు తమ వంతు పని చేయడంలో వెనకబడితే, దాని వలన మొత్తం పనిలో సమన్వయం దెబ్బ తినిపోయేది. అప్పుడు అటువంటి "పని ఎగ్గొట్టిన" బానిసలను శారీరకంగా హింసించడానికి, వారిపై నిర్బంధానికి పాల్పడడానికి యజమానులు కొంతమందిని ప్రత్యేకంగా నియమించేవారు. భూస్వామ్య వ్యవస్థలో సైతం, భూస్వాముల పొలాలమీద పని చేసే భూదాసులలో (వెట్టి చేసేవారిలో) కొంతమంది పనిలో వెనకబడితే (కోతలు, నూర్పిళ్ళ వగైరా పనుల్లో) దాని వలన కొంత పంట నష్టం జరిగేది. అప్పుడు అలా పనిలో వెనకబడ్డ భూదాసులను చితక్కొట్టేవారు.

ఉత్పత్తి సాధనాల మీద ఉమ్మడి యాజమాన్యం లేకుండా, కొందరు యజమానులుగా, మరికొందరు శ్రామికులుగా విభజన ఏర్పడిన సమాజాల్లో శ్రామికులు సమన్వయంతో పని చేయడానికి స్వచ్ఛందంగా స్పందించరు. అటువంటప్పుడు వారిని సమన్వయంతో పనిచేసేలా చేయడానికి ఏదో ఒక విధమైన నిర్బంధ పద్ధతిని అనుసరించడం అవసరమౌతుంది.

పెట్టుబడిదారీ విధానం కూడా ఒక వర్గ సమాజమే. అయినప్పటికీ ఇక్కడ నిర్బంధ విధానం ఏదీ బైటకు కనిపించదు. అంటే ఈ పెట్టుబడిదారీ సమాజంలో ఎక్కడా పెట్టుబడిదారులు భౌతిక నిర్బంధ పద్ధతులను పాటించడం లేదని కాదు. కాని ఈ విధానంలో భౌతిక నిర్బంధం అనేది అనివార్యమైన నియమంగా ఉనికిలో లేదు. మరి అటువంటప్పుడు కార్మికులు పనిలో పరస్పర సమన్వయంతో వ్యవహరించేలా చేయడానికి అనుసరించే మార్గం ఏమిటి? అన్న ప్రశ్న తలెత్తుతుంది. "పని లోంచి గెంటేస్తామని" బెదిరించడం అనేదే ఆ మార్గం అని పోలండ్ కు చెందిన మార్క్సిస్టు ఆర్థికవేత్త మైకేల్ కాలెక్కీ అన్నాడు. ఎవరైనా పనిలో వెనుకబడినా, పని ఎగ్గొట్టినా వాళ్ళని వెంటనే పనిలోంచి తొలగిస్తారు. మరోలా చెప్పాలంటే అటువంటి వ్యక్తి పెట్టుబడిదారీ వ్యవస్థ "లోపల" తనకుగల స్థానాన్ని కోల్పోయి ఆ వ్యవస్థ 'వెలుపలికి' గెంటివేయబడతాడు.

ఇటువంటి విధానం అమలు జరగాలంటే పెట్టుబడిదారీ విధానంలో "వ్యవస్థకు వెలుపల", "వ్యవస్థకు లోపల" అనే రెండు భాగాలు ఉండడం అవశ్యం. అప్పుడే ఉత్పత్తి విధానంలో క్రమశిక్షణను అమలు చేయించడం సాధ్యపడుతుంది. బానిస వ్యవస్థలో మాదిరిగా బైటకు కనిపించే విధంగా ఉండే భౌతిక నిర్బంధం (కొట్టడం లేక తిండి పెట్టకుండా మాడ్చి చంపడం వంటివి) లేకపోయినా, పైకి కనిపించని నిర్బంధం పెట్టుబడిదారీ విధానంలో ఉంటుంది. అది లేకుండా ఇక్కడ ఉత్పత్తి సాధ్యం కాదు. ఇటువంటి పైకి కనిపించని నిర్బంధం అమలు కావాలంటే పెట్టుబడిదారీ విధానంలో ఒక "లోపలి" భాగం, మరొక "వెలుపలి" భాగం అనేవి తప్పనిసరిగా ఉండాల్సిందే. ఈ "వెలుపలి" భాగంలో పరిస్థితులు ఎంత దుర్భరంగా ఉండాలంటే పనుల్లో కుదురుకున్నవాళ్ళు ఎవరైనా సరే, ఆ "వెలుపలి" భాగం లోకి పోవడానికి భయపడి చావాల్సిందే.

ఇలా పెట్టుబడిదారీ విధానంలో "లోపల, వెలుపల" భాగాలు రెండు ఉండడమనేది దాని మొత్తం లక్షణం. ఈ వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకున్నది కేవలం మార్క్సిజం మాత్రమే. "వెలుపల" భాగంలో ఉండే "కార్మికుల రిజర్వు సైన్యం" అనే లక్షణాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థలో తప్పనిసరిగా ఉండే లక్షణంగా గుర్తించింది మార్క్సిజం మాత్రమే.

అయితే, మార్క్సిస్టులలో, మార్క్సిస్టు అభిమానులలో సైతం చాలా మంది ఈ అంశాన్ని చూడడం లేదు. పెట్టుబడిదారీ విధానంలో కార్మికుల నిజ వేతనాలు ఎప్పుడూ కనీస స్థాయిలోనే (పొట్ట పోసుకోడానికి చాలిన మేరకు మాత్రమే) ఎందుకు కొనసాగుతూ వుంటాయన్న అంశాన్ని వివరించేదానికోసం మాత్రమే రిజర్వు కార్మిక సైన్యం గురించి వాళ్ళు ప్రస్తావిస్తూ వుంటారు. మాల్థస్ అనే సామాజికవేత్త ఈ విధంగా వాదించాడు: శ్రామికుల నిజవేతనాలు గనుక కనీస అవసరాల స్థాయిని మించి ఎక్కువగా ఉంటే అప్పుడు కార్మికులు ఎక్కువమంది సంతానాన్ని కనేందుకు తయారౌతారని, దాని వలన పనులు చేయడానికి సిద్ధమయ్యేవారి సంఖ్య స్వల్ప కాలంలోనే బాగా పెరిగిపోతుందని, అప్పుడు తిరిగి కార్మికుల నిజవేతనాల స్థాయి కనీస స్థాయికి పడిపోతుందని మాల్థస్ చెప్పాడు.

> **ఈ వ్యవస్థ కన్నా మానవీయంగా ఉండే వ్యవస్థ కావాలంటే ముందు ఈ పెట్టుబడిదారీ విధానాన్ని అధిగమించి ముందుకు పోవాల్సిందే. అప్పుడు రూపొందే వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలన్నీ సమిష్టి, సామాజిక యాజమాన్యం కింద ఉండాల్సిందే.**

రికార్డో ఈ వాదననే స్వీకరించాడు. కాని మాల్థస్ సిద్ధాంతం "మానవ జాతినే అపఖ్యాతిపాలు చేసేది"గా విమర్శిస్తూ మార్క్స్ దానిని తిరస్కరించాడు. మాల్థస్ సిద్ధాంతానికి బదులు మార్క్స్ తన "రిజర్వు కార్మిక సైన్యం" భావనను ముందుకు తెచ్చాడని సాధారణంగా భావిస్తారు.

అయితే, ఇలా భావించడం అంటే మార్క్స్‌ను అసంపూర్ణంగా అర్థం చేసుకోవడమే. కార్మికుల వేతనాలను చారిత్రికంగా కనీస జీవన భృతి స్థాయికే పరిమితం చేయడంలో "రిజర్వు కార్మిక సైన్యం" పాత్ర పోషిస్తుందన్నది వాస్తవం. కాని దాని పాత్ర అంతవరకే పరిమితం కాదు. ఈ రిజర్వు కార్మిక సైన్యం అనేది లేకపోతే పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తిలో క్రమశిక్షణను అమలు చేయడంగాని, పెట్టుబడిదారీ పద్ధతిలో ఉత్పత్తిని చేపట్టడం కాని సాధ్యం కానేకాదు.

కాని ప్రధాన స్రవంతి ఆర్థిక సిద్ధాంతాలన్నీ పెట్టుబడిదారీ విధానాన్ని ఒక స్వయం సంపూర్ణమైన వ్యవస్థగా పరిగణిస్తాయి. మార్కెట్లు గనుక స్వేచ్ఛగా వ్యవహరించడానికి సాధ్యమైతే అప్పుడు ఉత్పత్తికి సంబంధించిన అన్ని అంశాలూ పూర్తిగా వినియోగంలోకి వస్తాయని ఆ సిద్ధాంతాలు భావిస్తాయి. ఈ ప్రధాన స్రవంతి ఆర్థిక సిద్ధాంతానికి కీన్స్ ప్రతిపాదించినది కొంత భిన్నంగా ఉంటుంది. పెట్టుబడిదారీ విధానాన్ని స్వయం సంపూర్ణమైనదిగానే కీన్స్ కూడా పరిగణిస్తాడు. అయితే, అందులో ఉత్పత్తికి సంబంధించిన అన్ని అంశాలూ పూర్తిగా రంగంలోకి వచ్చి పూర్తి స్థాయిలో ఉపాధి అందరికీ లభించాలంటే మార్కెట్ నడకలో ప్రభుత్వం జోక్యం ఉండాలని కీన్స్ సూచించాడు. మార్క్సిస్టు సిద్ధాంతం మినహా తక్కిన ఆర్థిక సిద్ధాంతాలు రకరకాలుగా ఉన్నా, అవన్నీ పెట్టుబడిదారీ విధానపు "లోపలి" భాగాన్ని మాత్రమే చూస్తాయి తప్ప దాని "వెలుపలి" భాగాన్ని చూడవు. అసలు అటువంటి ఒక "వెలుపలి" భాగం అవసరం ఉందన్న అంశాన్ని కూడా అవి గుర్తించవు. నిరుద్యోగులు, పాక్షిక నిరుద్యోగులు, ప్రచ్ఛన్న నిరుద్యోగులు- ఇలా రకరకాలుగా పోగుబడే "వెలుపలి" భాగం ఉద్యోగాలలో ఉన్న కార్మికులలో తాము గనుక పెట్టుబడిదారీ క్రమశిక్షణకు లోబడి వుండకపోతే ఏ గతి పడుతుందో అన్న భయాన్ని కలిగించి విధేయులుగా వ్యవహరించేట్టు చేస్తుంది. అందుచేత ఈ "వెలుపలి" భాగం అనేది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి అత్యంత అవసరం.

మరి ఇంత ముఖ్యమైన అంశాన్ని "ప్రధాన స్రవంతి" ఆర్థిక సిద్ధాంతవేత్తలు గుర్తించకపోడానికి కారణం ఏమిటి? వాళ్ళు ఉత్పత్తిని ఉత్పత్తిగా, ఒక క్రమంగా చూడకుండా, అది మారకం అనే ప్రక్రియకు ఒక కొనసాగింపుగా మాత్రమే చూస్తారు. మార్కెట్‌లో జరిగే మారకం మీదనే వారి దృష్టి అంతా కేంద్రీకరించబడి వుంటుంది. వారి విశ్లేషణ అక్కడితోనే ఆగిపోతుంది. పెట్టుబడిదారుడు ఆ మార్కెట్‌లో ముడి సరుకులను, శ్రమశక్తిని కొన్న తర్వాత వాటిని వెంట బెట్టుకుని ఫ్యాక్టరీ ఆవరణలోకి ప్రవేశించాక ఏం జరుగుతుంది అన్నది వారి దృష్టిలో ఉండనే వుండదు. అందుచేత వారు ఉత్పత్తి అనేదానిని ఒక ఊహాజనిత ప్రాతిపదికన మాత్రమే అవగాహన చేసుకోగలుగుతారు. ఆ ఫ్యాక్టరీలోని ప్రతీ కార్మికుడూ వారి దృష్టిలో మహా అయితే ఒక్కో చేతివృత్తి నిపుణుడి వంటివాడే అవుతాడు. అందుచేత ఆ కార్మికుడిమీద క్రమశిక్షణ పద్ధతులను రుద్దవలసిన అవసరాన్ని వారు గుర్తించరు. అందుచేత పెట్టుబడిదారీ ఆర్థిక సిద్ధాంతాలన్నీ ఈ విషయంలో లోపభూయిష్టంగానే ఉంటాయి. పెట్టుబడిదారీ విధానంలోని పలు లోపాలను ఎత్తిచూపి సహేతుకమైన విమర్శలు చేసినప్పటికీ, కీన్స్ సిద్ధాంతం కూడా ఈ విషయంలో లోటుగానే ఉంది.

ఈ రిజర్వు కార్మిక సైన్యం ఉండడం అనేదాని పర్యవసానాలు చాలా ఉంటాయి. ఉత్పత్తి క్రమశిక్షణా యుతంగా కొనసాగడానికి తోడ్పడం, నిజవేతనాలను కనీస స్థాయికే పరిమితం చేయడంతోబాటు, మార్కెట్‌లో తమ శ్రమను అమ్ముకునే వారిగా కార్మికులు తమ శ్రమకు తగినంత, ఎక్కువ వేతనాలను డిమాండ్ చేయగల స్థితిలో ఎన్నడూ ఉండకుండా చూస్తుంది. దాంతో వారి నిజవేతనాలు దిగజారిపోతూ వుంటాయి. ఈ రిజర్వు కార్మిక సైన్యం అనేది లేకుండా పోతే అప్పుడు వెంటనే పెట్టుబడిదారీ వ్యవస్థ దానంతట అదే కుప్పకూలుతుందని మాత్రం దీనర్థం కాదు. కాని నిరుద్యోగం అనేది లేకుండాపోతే ఎక్కువ కాలం పాటు ఆ పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగడం మాత్రం సాధ్యం కాదు. దీనిని బట్టి మౌలికంగా మనం గ్రహించాల్సిదేమంటే పెట్టుబడిదారీ విధానం ఉన్నంత కాలమూ పూర్తిస్థాయిలో అందరికీ ఉపాధి కల్పించడం అనేది అసాధ్యం. ప్రభుత్వాల జోక్యంతో మార్కెట్లలో డిమాండ్‌ను తగువిధంగా పెంచడం ద్వారా అందరికీ ఉపాధి కల్పించడం పెట్టుబడిదారీ వ్యవస్థలో సాధ్యమే అని చెప్పిన కీన్స్ సిద్ధాంతం ఒక గారడీ మాత్రమే.

స్థూల డిమాండ్ తగినంతగా లేకపోవడం వల్లనే నిరుద్యోగం ఏర్పడుతుందని కీన్స్ భావించినందువల్లే అతడు డిమాండ్‌ను ప్రభుత్వ జోక్యంతో సర్దుబాటు చేసి నిరుద్యోగాన్ని పెట్టుబడిదారీ విధానం పరిధిలోనే పరిష్కరించవచ్చునని భావించాడు.

కీన్స్ వాదన ఆచరణలో తేలిపోయింది. రెండవ ప్రపంచ యుద్ధం అనంతర కాలంలో కీన్స్ సిద్ధాంతాన్ని అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో ఆచరించారు. కార్మికులకు అక్కడ చెల్లించే జీతాల్లో వచ్చిన పెరుగుదల, దానితోబాటు అక్కడ నిరుద్యోగం నామమాత్రంగా ఆ కాలంలో ఉండడంతో 1968 నాటికి ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. దానికి ముడిసరుకుల ధరల పెరుగుదల తోడైంది. రీగన్, థాచర్ ల హయాం వచ్చాక వాళ్ళు కీన్స్ డిమాండ్ మేనేజిమెంటు విధానాలకు స్వస్తి చెప్పారు. మళ్ళీ భారీగా నిరుద్యోగాన్ని పెంచడానికి దోహదం చేశారు.

> **అంటే పెట్టుబడిదారీ విధానంలో పూర్తి స్థాయి ఉపాధి కల్పన ఏ విధంగా సాధ్యం కాదో, అదే విధంగా పెట్టుబడిదారీ విధానం ఒక సంక్షేమ రాజ్యంగా కొనసాగడమూ అసాధ్యమే.**

అంటే పెట్టుబడిదారీ విధానంలో పూర్తి స్థాయి ఉపాధి కల్పన ఏ విధంగా సాధ్యం కాదో, అదే విధంగా పెట్టుబడిదారీ విధానం ఒక సంక్షేమ రాజ్యంగా కొనసాగడమూ అసాధ్యమే. సంక్షేమ విధానాలు అమలౌతూవుంటే అప్పుడు నిరాధారంగా ఉండే "రిజర్వు సైన్యం" పరిస్థితి మరీ అంత దుర్భరంగా ఉండదు. అందుచేత తన ఉద్యోగం పోతుందన్న భయం కార్మికుడికి కూడా అంత తీవ్రంగా ఉండదు. అందుచేత పని ప్రదేశంలో క్రమశిక్షణ దెబ్బ తింటుంది. దానితోబాటు తమకు హెచ్చు వేతనాలు కావాలని బేరసారాలాడే శక్తి కార్మికులకు సంక్షేమ రాజ్యంలో పెరుగుతుంది. ఇచ్చిన వేతనాన్ని మారుమాట్లాడకుండా అంగీకరించే స్థితిలో వారు అప్పుడు ఉండరు. అందుచేత ఎప్పుడైనా కొంత కాలం పాటు అటువంటి సంక్షేమ విధానాలు కొనసాగవచ్చు తప్ప పెట్టుబడిదారీ వర్గం వాటిని ఎప్పుడూ దెబ్బ తీస్తూనే వుంటుంది.

1950, 1960 దశకాల్లో ఈ సంక్షేమ విధానాలు అమలౌతున్న కాలంలో "పెట్టుబడిదారీ విధానం స్వభావం గాని మారిపోయిందా?" అన్న విధంగా కొంత చర్చ జరుగుతూ వుండేది. అది తన కొల్లగొట్టే స్వభావాన్ని మార్చుకుని సమాజ సంక్షేమం గురించి పాటుపడే లక్షణాన్ని సంతరించుకుందేమోనని కొందరు విశ్వసించారు కూడా. కాని నయా ఉదారవాద విధానాలు అమలులోకి వచ్చాక సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికుల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారింది. పెట్టుబడిదారీ విధానపు స్వభావాన్ని మార్చి దానిని సంస్కరించాలని, దానిని మానవీయంగా తీర్చిదిద్దాలని చేసిన అన్ని రకాల ప్రయత్నాలూ విఫలమయ్యాయి. ఈ వ్యవస్థ కన్నా మానవీయంగా ఉండే వ్యవస్థ కావాలంటే ముందు ఈ పెట్టుబడిదారీ విధానాన్ని అధిగమించి ముందుకు పోవాల్సిందే. అప్పుడు రూపొందే వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలన్నీ సమిష్టి, సామాజిక యాజమాన్యం కింద ఉండాల్సిందే.

(స్వేచ్ఛానుసరణ)

సందర్భం

పెన్షనర్ల భద్రతకు ఎసరు తెస్తున్న కేంద్ర ప్రభుత్వం



> **రిటైర్మెంట్ సమయంలోనే ముఖ్యంగా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. అప్పుడు పెన్షనర్లను ఆర్థికంగా ఆదుకోవటం అనేది ప్రభుత్వాల కనీస సామాజిక బాధ్యత. దానిని విస్మరించటం క్షమించరాని నేరం. నలభయ్యేళ్లు ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ సేవలందించి రిటైర్మెంట్ తర్వాత వారికి చెల్లించే పెన్షన్‌లో పెరుగుదల లేకుండా బిల్లు తీసుకురావడం హేయమైన చర్య. ఉద్యోగ విరమణ పొందిన రోజు ఆ నెలలో పొందే మూలవేతనంలో సగం చెల్లించే పెన్షన్‌తో జీవితాంతం ఎలాంటి పెరుగుదల లేకుండా చేయడం అమానుషం. ఇది ఉద్యోగుల పెన్షన్‌పై 1982లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు పూర్తిగా విరుద్ధం. పాత పెన్షన్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని ఉద్యోగులు, పెన్షనర్లు డిమాండ్ చేసి ఉద్యమిస్తున్న సమయంలో ఇలాంటి తిరోగమన, దుర్మార్గపు చర్యలకు ప్రభుత్వం పాల్పడటం అన్యాయమే కాదు, ఆటవికం కూడా.**

డిసెంబర్ 17 జాతీయ పించనుదారుల దినోత్సవం

వి. రాజగోపాల్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెన్షనర్ల మీద దొడ్డిదారిన దాడికి దిగుతున్నది. అందులో భాగమే ఫైనాన్స్ బిల్లు పేరుతో జనవరి 2025న పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించిన పెన్షన్ చెల్లింపులకు సంబంధించిన నూతన సవరణ బిల్లు. వాస్తవానికి సుప్రీం కోర్టు చెప్పిన తీర్పు ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను సవరించిన ప్రతిసారీ వారితోపాటు ప్రభుత్వ పెన్షనర్ల పెన్షన్‌ను కూడా సవరించి పెరిగిన ధరల భారం నుంచి వారికి ఉపశమనం కలిగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ఇప్పుడు కొత్తగా ఆమోదించిన పెన్షన్ సవరణల చట్టం ప్రకారం ఆ బాధ్యత నుండి ప్రభుత్వం వైదొలగాలని చూస్తున్నది.

పెన్షనర్ల ఐక్యతకు గండి

ఈ సవరణల ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం తాజాగా నియమించిన 8వ పే కమిషన్ సిఫార్సులు, అమలు జరిగే తేదీకి ముందు రిటైర్ అయిన పెన్షనర్లకు వర్తించవు. భవిష్యత్‌లో (8వ పే రివిజన్ కమిషన్ అమలు తేదీ తరువాత) ఎవరైతే రిటైర్ అవుతారో వారికి మాత్రమే వర్తిస్తాయి. సూటిగా చెప్పాలంటే 8వ పే రివిజన్ కమిషన్ సిఫార్సులు అమలు తేదీకి ముందు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు 8వ పే రివిజన్ కమిషన్ పెన్షన్ కోసం చేసిన సిఫార్సుల ప్రకారం పెన్షన్ రివిజన్ కాదు. అంటే ఫైనాన్స్ బిల్లు-2025తో పాటు తీసుకొచ్చిన ఈ పెన్షన్ సవరణ బిల్లు ద్వారా పెన్షనర్ల ఐక్యతకు గండి పడుతుందని అర్థం. అనగా 8వ పే రివిజన్ కమిషన్ సిఫార్సులు అమలైన తేదీ తర్వాత ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లు, 8వ పే రివిజన్ కమిషన్ సిఫార్సులు అమలుకాక ముందు ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లు మధ్య స్పష్టమైన విభజన రేఖ గీస్తున్నారన్నమాట. అంటే ఇది పెన్షనర్లను రెండు ముక్కలుగా చీల్చి వారి ఐక్య పోరాట శక్తిని విచ్ఛిన్నం చేసే చర్య.

సుప్రీం తీర్పునకు తిలోదకాలు

నిజం చెప్పాలంటే 2014 ఎన్నికల్లో నరేంద్ర మోడీ దేశ ప్రజలకు ఇచ్చిన అనేక హామీల్లో విశ్రాంత ఉద్యోగులకు భద్రత ఒకటి. కానీ ఈ రోజు దానిని గంగలో కలిపేసి బడ్జెట్ భారాన్ని సాకుగా చూపిస్తున్నారు. పెరుగుతున్న ధరలను నియంత్రించడం చేతకాక ప్రజల సౌకర్యాలకు ఎసరు పెట్టడం ముఖ్యంగా ప్రజల సామాజిక హక్కులను కాలరాయడం గర్హనీయం. పెన్షనర్ల భద్రతకు కోత విధించే అధికారం ప్రభుత్వానికి లేదని అత్యున్నత న్యాయ స్థానం స్పష్టం చేసినప్పటికీ సదరు ఆదేశాలను లెక్కచేయకపోవడం అన్యాయం. రిటైర్మెంట్ సమయంలోనే ముఖ్యంగా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. అప్పుడు పెన్షనర్లను ఆర్థికంగా ఆదుకోవటం అనేది ప్రభుత్వాల కనీస సామాజిక బాధ్యత. దానిని విస్మరించటం క్షమించరాని నేరం. నలభయ్యేళ్లు ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ సేవలందించి రిటైర్మెంట్ తర్వాత వారికి చెల్లించే పెన్షన్‌లో పెరుగుదల లేకుండా బిల్లు తీసుకురావడం హేయమైన చర్య. ఉద్యోగ విరమణ పొందిన రోజు ఆ నెలలో పొందే మూలవేతనంలో సగం చెల్లించే పెన్షన్‌తో జీవితాంతం ఎలాంటి పెరుగుదల లేకుండా చేయడం అమానుషం. ఇది ఉద్యోగుల పెన్షన్‌పై 1982లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు పూర్తిగా విరుద్ధం. పాత పెన్షన్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని ఉద్యోగులు, పెన్షనర్లు డిమాండ్ చేసి ఉద్యమిస్తున్న సమయంలో ఇలాంటి తిరోగమన, దుర్మార్గపు చర్యలకు ప్రభుత్వం పాల్పడటం అన్యాయమే కాదు, ఆటవికం కూడా.

ఇది కార్పొరేట్ల ప్రభుత్వం

మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనేక రూపాల్లో అధిక రాయితీలు ఇస్తూ ప్రజల సంపదను కారుచౌకగా వారికి దోచిపెడుతున్నది. అందుకు రాజ్యాంగ హక్కులను, సుప్రీంకోర్టు తీర్పులను సైతం ధిక్కరిస్తున్నది. అందులో భాగంగానే 8వ వేతన సవరణ కమిటీ సిఫార్సుల అమలు తర్వాత రిటైర్ అయిన పెన్షనర్లతో సమానంగా అంతకు ముందు రిటైర్ అయిన పెన్షనర్లకు పెన్షన్ రివిజన్ చేయడానికి నిరాకరిస్తున్నది. పైగా సుప్రీంకోర్టు తీర్పులను వమ్ముచేసి, పెన్షనర్లకు న్యాయబద్ధంగా రావలసిన పెన్షన్‌ను చెల్లించటానికి బదులు వర్గీకరణను దొడ్డిదారిన చట్టబద్ధం చేయటానికి పూనుకున్నది. రిటైర్మెంట్ తేదీ ప్రకారం పెన్షనర్లను వర్గీకరించే అధికారం ప్రభుత్వానికి ఉందని అడ్డగోలుగా వాదిస్తూ పెన్షన్ రూల్స్ పేరుతో ఫైనాన్స్ బిల్లు-2025లో కొన్ని నిబంధనలను చేర్చి ఈ వర్గీకరణ చేయడానికి పూనుకున్నది. ప్రతిపక్ష పార్టీల అభ్యంతరాలను సైతం ఖాతరు చేయక ఏకపక్షంగా ఫైనాన్స్ బిల్లు-2025ను చట్టంగా మార్చు చేసి, తనకు గల మంద బలంతో చట్టసభల ఆమోదంతో పాటు రాష్ట్రపతి ఆమోదముద్రను కూడా పొందింది.

వాస్తవానికి పెన్షనర్ల వర్గీకరణకు అనుకూలంగా చట్టం చేయాలనుకుంటే అందుకు విడిగా ఒక బిల్లును ప్రవేశపెట్టి దానిపై చర్చించి పార్లమెంటు ఉభయసభల ఆమోదం పొందాలి. అటువంటి విషయాన్ని బడ్జెట్‌లో భాగమైన ఫైనాన్స్ బిల్లులో ఎలా చేరుస్తారు...? అని ప్రశ్నిస్తే దానికి సమాధానం లేదు. వర్గీకరణ బిల్లును విడిగా పార్లమెంట్‌లో చర్చకు పెడితే దానిపై చర్చించి ప్రతిపక్షాలు ప్రశ్నిస్తాయని, అప్పుడు బిల్లును వాయిదా వేయాల్సి వస్తుందని భావించి ప్రభుత్వం ఈ పన్నాగం పన్నింది. అందుకే ఫైనాన్స్ బిల్లు-2025లో భాగం చేసి దొడ్డి దారిన పార్లమెంట్ ఆమోదం పొందటానికి తెగించింది.

ప్రతిఘటనే పరిష్కారం

1972 పెన్షన్ నిబంధనల ప్రకారం పెన్షన్ తీసుకునే వారందరూ పెన్షనర్లే. ఇది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. దీన్ని ఫైనాన్స్ బిల్లులో పెట్టి పార్లమెంట్ ఆమోదంతో చట్టంగా చేసినా, అది చెల్లుబాటు కాదు. అయినా కూడా కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని దుర్మార్గంగా అమలు చేయడానికి పూనుకున్నది. వక్ర మార్గంలో తీసుకొచ్చిన ఈ పెన్షన్ ధ్రువీకరణ బిల్లు కేవలం నలభై లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 75 లక్షల కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు మాత్రమే పరిమితమైనది కాదు. ఈ సెగ భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కూడా తగలవచ్చు.

ప్రస్తుతానికి, ఈ చట్టాన్ని అమలు చేయబోమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఉద్యోగుల పెన్షనర్ల సంఘాల్లో నెలకొన్న ఆందోళన తొలగిపోదు. ఉద్యోగుల, పెన్షనర్ల నెత్తిన కత్తి వేలాడుతూనే ఉంటుంది. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాపాడుకోవడానికి ప్రమాదకరమైన అతి దుర్మార్గమైన ఈ ఫైనాన్స్ బిల్లు-2025లో పొందుపరిచిన పెన్షన్ సవరణల బిల్లును సంపూర్ణంగా రద్దు చేసేవరకు ఉద్యమించటం తప్ప పెన్షనర్లకు మరో మార్గం లేదు.

/ వ్యాసకర్త ఎ.పి ఎన్జీఓ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు, విజయనగరం, సెల్: 9133084262 /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

నల్లగా ఉందని కోడలిపై వేధింపులు

● మెట్టినింటి మెట్లపై కొత్త కోడలి ఆందోళన

మెట్టినింటి మెట్లపై బైఠాయించిన బాధితురాలు

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

భారీగా కట్నకానుకలు తీసుకున్న వారు ఇప్పుడు శరీరం రంగును కారణంగా చూపుతూ కొత్త కోడలిని పుట్టింటికి పంపించగా బాధిత యువతి మెట్టినింటి వద్ద ఆందోళనకు దిగారు. ఈ సంఘటనపై బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా వినుకొండ మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన గుంతనాల వెంకటనారాయణ, హనుమాయమ్మ దంపతుల కుమార్తె గోపి లక్ష్మిక, వినుకొండ పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డు చౌడమ్మ వీధికి చెందిన వినుకొండ వెంకటేశ్వర్లు, శేషమ్మ కుమారుడు కోటేశ్వరరావుతో ఈ ఏడాది జూన్ 4న వివాహమైంది. పెళ్లి సందర్భంగా రూ.12 లక్షల నగదు, 25 సవర్ల బంగారాన్ని కట్నకానుకలుగా ఇచ్చారు. కొన్నాళ్ల వరకు కాపురం సజావుగానే సాగినా రెండు నెలల క్రితం నుండి గోపిలక్ష్మిని భర్త, అత్తమామలు వేధించడం మొదలుపెట్టారు. నల్లగా ఉన్న ఆమె ఇంట్లోకి వచ్చినప్పటి నుంచి అశుభాలు జరుగుతున్నాయని, అనారోగ్య సమస్యలు కూడా వస్తున్నాయని అత్తమామలు తరచూ తిడుతూ వేధిస్తున్నారు. పుట్టింటికి డబ్బులు తేవాలని ఒత్తిడి చేసి పంపించారు. ఈ విషయంపై బాధితురాలి తల్లిదండ్రులు, మరికొందరు పెద్దలను తీసుకుని వెళ్లి మాట్లాడినా, గోపిలక్ష్మిని నల్లగా ఉందని తనకు వద్దని ఆమె భర్త ఖరాఖండిగా చెప్పారు. ఏం చేసినా భయం లేదని బెదిరింపు ధోరణిలో మాట్లాడుతుండటంతో బాధితురాలు కన్నీరుమున్నీరయ్యారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మెట్టినింటి బయట మెట్లపై ఆదివారం సాయంత్రం నుండి ఆందోళనకు దిగారు. ఆమెకు మద్దతుగా కొంతమంది బంధువులు సైతం వచ్చారు. రెండెకరాల పొలాన్ని తనఖా పెట్టిమరీ వారికి కట్నంగా ఇచ్చామని, డబ్బుకోసం వేధిస్తున్నారని, రాష్ట్ర మహిళా కమిషన్ చర్యలు తీసుకోవాలని బాధితురాలు వేడుకుంటున్నారు. కేసు పెట్టేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా రేపు మాపు అంటూ కేసు తీసుకునేందుకు పోలీసులు వెనకాడుతున్నారని బాధితురాలు వాపోయారు.

బెయిల్ ఇవ్వండి : చెవిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కేసులో 38వ నిందితుడైన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని సిఐడి సిట్‌ను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 22కు వాయిదా వేస్తూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప సోమవారం ఆదేశాలిచ్చారు. గత జూన్ నుంచి పిటిషనర్ జైల్లో ఉన్నారని, బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఎసిబి కోర్టు కొట్టేసిందని, ఆయనను అన్యాయంగా కేసులో ఇరికించారని పిటిషనర్ న్యాయవాది వాదించారు. అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, అత్యవసర వైద్యం చేయించుకోవాల్సి వుందని చెప్పారు. సిఐడి చార్జిషీట్ వేసినందున బెయిల్ ఇవ్వాలని కోరారు.

MANAPPURAM HOME FINANCE LTD.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
సిఐఎన్ : U65923KL2010PLC039179, యూనిట్ నం.301 నుండి 315, 3 వ అంతస్తు, ఎ వింగ్, కనకియ వాల్ స్ట్రీట్, అందేరి-కుర్ల రోడ్, అందేరి తూర్పు, ముంబై- 400093.

డిమాండ్ నోటీసు

ఏదైతే, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకపై "ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్"గా పిలువబడుతుంది) యొక్క అధీకృత అధికారి IV/470A(పాతది)W/638A(కొత్తది) మణప్పురం హౌస్ వలపడ్ (త్రిస్సూర్, కేరళ-680567 మా నమోదిత కార్యాలయం ఉంది మరియు వివిధ ప్రదేశాలలో దీని శాఖా కార్యాలయాలు ఉన్నాయి, కంపెనీల యాక్ట్ 1956 క్రింద నమోదు చేయబడిన కంపెనీ మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 (ఇకపై యాక్ట్ గా సూచించబడుతుంది) యొక్క సెక్షన్ 2 యొక్క సబ్ సెక్షన్ (1) యొక్క క్లాజ్ (ఎమ్) యొక్క సబ్ క్లాజ్ (4) అర్థం ఆర్థిక సంస్థ నం.ఎస్.ఓ.3466 (ఇ)తో చదువుతూ నిర్మాణం మరియు / లేదా నివాస యూనిట్ల కొనుగోలు కోసం అడ్వాన్సింగ్ లోన్‌ల వ్యాపారాన్ని నిర్వహిస్తోంది మరియు దిగువ కాలమ్ నం. 2లో పేర్కొన్న విధంగా రుణగ్రహీత / సహ రుణగ్రహీతలు ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ నుండి రుణం పొందినట్లు పేర్కొన్న చార్ట్ తేది 18 డిసెంబర్, 2015న గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ ద్వారా జారీ చేయబడింది మరియు ఏదైతే సెక్యూర్డ్ క్రెడిటార్ గా ఉన్న ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ సర్ఫేసీ యాక్ట్ క్రింద, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 2తో చదువుతూ సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ నోటీసు తేది నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని దానిపై తదుపరి వడ్డీతో చెల్లించమని రుణగ్రహీత/సహ రుణగ్రహీతలను పిలుస్తూ డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. అయితే వివిధ కారణాల వల్ల కొందరికి నోటీసులు అందజేయలేదు. దానితో పాటు క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతల సమాచారం యొక్క ప్రయోజనాల కొరకు ఈ పబ్లిక్ నోటీసు ద్వారా పేర్కొన్న రుణగ్రహీతలకు తెలియజేయబడుతోంది.

క్ర. సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు/ఎల్ఏఎన్/శాఖ	సృష్టించబడిన వడ్డీ విషయంలో సెక్యూర్డ్ అసెట్ వివరణ	ఎన్‌పిఏ తేది	నోటీసు పంపిన తేది మరియు బకాయి మొత్తం
1	దారవతు పద్మ, దారవతు కుమార్/ MHL00310016648/ విజయవాడ	ఆర్ఎస్ నం 786-2ఇ, డోర్ నం 25-540, మూల్యాంకనం నం 1071004559, విస్తీర్ణత 96.8 చ.గజాలు., నూజివీడు టౌన్, నూజివీడుమండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. పిన్: 521201. తూర్పు-జాయింట్ పాసేజ్, పడమర-పకీరు అహ్మద్ ఇల్లు, దక్షిణం-దారవతు శ్రీనివాస రావు, ఉత్తరం-పంచాయతీ రోడ్డు.	15-11-2025	19-11-2025 & Rs.613809/-
2	అద్దంకి ,చిట్టెమ్మ, అద్దంకి సుబ్బారావు/ MHL00310029099/ విజయవాడ	విస్తీర్ణత 186 చ.గజాలు, ఆర్ఎస్ నం 154-2, డోర్ నం 3-26, మూల్యాంకనం నం 267, బల్లిపర్రు గ్రామం పంచాయతీ ప్రాంతము, బల్లిపర్రు గ్రామం, పెదన మండలం, కృష్ణా జిల్లా., ఆంధ్రప్రదేశ్, పిన్:521366. తూర్పు-అద్దంకి పరమేశ్వర రావు ఇల్లు, పడమర-పంచాయతీ రోడ్డు, దక్షిణం-పంచాయతీ రోడ్డు, ఉత్తరం-అద్దంకి నాగేశ్వర రావు ఇల్లు.	15-11-2025	19-11-2025 & Rs.560649/-
3	గుంటూరు ప్రవల్లికా, గుంటూరు రవి తేజ/ MHL00310042975/ విజయవాడ	ఆర్.ఎస్.నం.444-2, డోర్ నం.2-40, మూల్యాంకనం నం.240, విస్తీర్ణత 145 చ.గజాలు, మోపిదేవి గ్రామ పంచాయతీ మరియు గ్రామం, మోపిదేవి మండలం, కృష్ణా, ఆంధ్రప్రదేశ్, పిన్:521125. తూర్పు-దాసరి అంకమ్మ సైట్, పడమర-దొవ్వారి ఆది లక్ష్మి సైట్, దక్షిణం-పంచాయతీ రోడ్డు, ఉత్తరం-గుంటూరు కళ్యాణ్ ఇల్లు.	15-11-2025	19-11-2025 & Rs.624032/-
4	కట్టుబోయిన హేమావతి, కట్టుబోయిన కొండలరావు/ MHL00310045413/ విజయవాడ	ఆర్.ఎస్.నం.313-13ఎ, డోర్ నం.3-1, మూల్యాంకనం నం.281, విస్తీర్ణత 290.4 చ.గజాలు, పడమర మాధవరం గ్రామం పంచాయతీ ప్రాంతము, పడమర మాధవరం గ్రామం, ఎ కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్: 521227. తూర్పు-కట్టుబోయిన కొండల రావు మిగిలిన సైట్ మరియు 3 గజాల వెడల్పు పాసేజ్, పడమర-నీలపాల రామ స్వామి ఆస్తి, దక్షిణం-కట్టుబోయిన శ్రీనివాస రావు ఆస్తి, ఉత్తరం-కట్టుబోయిన కొండల రావు ఆస్తి	15-11-2025	19-11-2025 & Rs.689754/-
5	దొరెడ్ల సౌభాగ్యలక్ష్మి, దొరెడ్ల కోటేశ్వర రావు/ MHL00310003087/ విజయవాడ	పాత తిరువూరు ఆర్ఎస్ నెం. 166/2బి, డోర్ నెం 3/131 మూల్యాంకనం నం 1146004403, విస్తీర్ణం 217.8 చదరపు గజాలు, తిరువూరు నగర పంచాయతీ, తిరువూరు మండలం, కృష్ణ, ఆంధ్రప్రదేశ్, పిన్: 521235. తూర్పు-రోడ్డు, పడమర-రోడ్డు, దక్షిణం- రామిశెట్టి సత్యనారాయణ ఇల్లు, ఉత్తరం-గుమ్మా నారాయణ తదితరుల సైట్	15-11-2025	20-11-2025 & Rs.515472/-
6	తోట నాగ శ్రావణి, తోట ఆంజనేయులు/ MHL00310044921/ విజయవాడ	ఆర్.ఎస్.నం.210-1, డోర్ నం.1-67, మూల్యాంకనం నం.65, విస్తీర్ణత 314 చ.గజాలు, వనుదుర్రు గ్రామ పంచాయతీ ప్రాంతము, వనుదుర్రు గ్రామం, ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా., ఆంధ్రప్రదేశ్, పిన్:521329. తూర్పు-గుర్రపు నాంచారయ్య ఆస్తి, పడమర-పంచాయతీ రోడ్డు, దక్షిణం-పంటకాని యేసు రాజు ఆస్తి, ఉత్తరం-పంచాయతీ రోడ్డు	15-11-2025	21-11-2025 & Rs.515484/-
7	కుక్కమల్ల భారతి, కుక్కమల్ల సీతారాజు/ MLAP0031046314/ విజయవాడ	ఆర్.ఎస్.నెం. 150-1ఎ, డోర్ నం. 3-16/కె, పన్ను డోర్ నం. 3-122, మూల్యాంకనం నం.558, పన్ను మూల్యాంకనం నం. 522 ప్రకారం, 121 చదరపు గజాలు, విస్తీర్ణం, వెల్లటూరు గ్రామ పంచాయతీ ప్రాంతము, వెల్లటూరు గ్రామం, జి. కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా., ఆంధ్రప్రదేశ్, పిన్: 521229. తూర్పు-అల్లూరి మార్తమ్మ యొక్క ఖాళీ స్థలం, పడమర-పంచాయతీ రోడ్డు, దక్షిణం- మండా నాగేశ్వరరావు యొక్క ఇల్లు మరియు సైట్, ఉత్తరం-పంచాయతీ రోడ్డు	15-11-2025	21-11-2025 & Rs.599443/-
8	కుకటి ప్రమీలారాణి, కుకటి సోమరాజు/ MHL00310014349/ విజయవాడ	ఆర్ఎస్ నం 129, డోర్ నెం 2-64, మూల్యాకనం నం 264, విస్తీర్ణం 206 చదరపు గజాలు జంగగూడం గ్రామం, జంగగూడం గ్రామపంచాయతీ ప్రాంతం, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్: 521201. తూర్పు- తొమ్మండ్రు నాగేశ్వరరావు యొక్క సైట్, పడమర-పంచాయతీ రోడ్డు, దక్షిణం-తొమ్మండ్రుకోటేశ్వరరావు యొక్క సైట్ , ఉత్తరం-తొమ్మండ్రు నాగేశ్వరరావు యొక్క సైట్	16-11-2025	21-11-2025 & Rs.725372/-
9	చెల్లా లక్ష్మయ్య, సిహెచ్ మంగ, భుక్య రమేష్/ NHL00310025467/ విజయవాడ	డోర్ నెం. 35-33, మూల్యాంకనం నం.6273, ఆర్.ఎస్.నం. 88, 80 చదరపు గజాలు విస్తీర్ణం. ఇబ్రహీంపట్నం మండలం, ఎన్టీఆర్ జిల్లా., ఆంధ్రప్రదేశ్, పిన్: 521456. తూర్పు-బండారు లక్ష్మి ఆస్తి, పడమర-పంచాయతీ రోడ్డు, దక్షిణం-చల్లాయేసుపాదం ఆస్తి, ఉత్తరం-మల్లీశ్వరి ఆస్తి	16-11-2025	21-11-2025 & Rs.832726/-
10	దేశావతు వెంకటేశ్వర రావు, దేశావతు లక్ష్మి, దేశావతు నాగరాజు/ NHL00310036629/ విజయవాడ	ఆర్.ఎస్. నెం. 48-1బి, డోర్ నెం. 4-145, మూల్యాంకనం నెం. 624, కనిమెర్ల గ్రామ పంచాయతీ ప్రాంతము, కనిమెర్ల గ్రామం, మైలవరం మండలం, ఎన్టీఆర్, ఆంధ్రప్రదేశ్ పిన్: 521230 193.6 చదరపు గజాల విస్తీర్ణం. తూర్పు-పంచాయతీ రోడ్డు, పడమర-బనవతు వెంకటేశ్వరరావు ఆస్తి, దక్షిణం-కునుసోతు భగవాన్ ఆస్తి, ఉత్తరం-దేశావతు నాగరాజు ఆస్తి	16-11-2025	21-11-2025 & Rs.965373/-
11	మర్రకట్ల రామారావు, మర్రకట్ల సరోజిని, కాకర్ల చంటి బాబు/ NHL00310040353/ విజయవాడ	ఆర్ఎస్ నం 119/6, డోర్ నెం 6-84, మూల్యాంకనం నం 584, విస్తీర్ణం 193.6 చ. గజాలు, పోలిశెట్టిపాడు గ్రామ పంచాయతీ ప్రాంతము, పోలిశెట్టిపాడు రెవెన్యూ గ్రామం, ఎ కొండూరుమండలం, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్: 521227. తూర్పు-గ్రామ పంచాయితీ రోడ్డు, పడమర-మర్రకట్ల సతీష్ యొక్క ఇల్లు, దక్షిణం-మర్రకట్ల మరియమ్మ ఇల్లు, ఉత్తరం- బోండాల వెంకమ్మ ఖాళీ స్థలం	16-11-2025	21-11-2025 & Rs.805949/-

గమనిక, ఈ నోటీసును ప్రచురించిన 60 రోజులలోపు సంబంధిత రుణగ్రహీత / సహ-రుణగ్రహీతకు వ్యతిరేకంగా ఇక్కడ చూపిన మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా వారిని పిలుస్తూ పైన పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలకు నోటీసు ఇవ్వడమైనది. సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీత తదుపరి వడ్డీతో పాటు మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే, పైన వివరించిన విధంగా చట్టం మరియు ఇక్కడ రూపొందించిన నియమాల క్రింద సూచించబడిన ఇతర పద్ధతులలో నోటీసు సర్వీస్ కొరకు ఆస్తులపై సెక్యూరిటీ ఇంట్రెస్ట్ అమలు చేయడం కోసం ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ సెక్షన్13(4) ని తీసుకోవలసి ఉంటుంది. సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13(8)లో వివరించిన విధంగా విక్రయం, పబ్లిక్ వేలం లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా బదిలీ చేయడానికి నోటీసును ప్రచురించే తేదీకి ముందు ఏ సమయంలోనైనా ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ ద్వారా అయ్యే ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు చెల్లించాల్సిన మొత్తం మొత్తాన్ని చెల్లించిన తర్వాత పేర్కొన్న తనఖా రీడీమ్ చేయబడుతుందని మీరు గమనించాలి.
సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ ఎస్-13 (13) ప్రకారం, మీరు సెక్యూర్డ్ అసెట్‌ను ఏ పద్ధతిలోనైనా అమ్మకం, లీజు లేదా మరే ఇతర పద్ధతిలో బదిలీ చేయకుండా మరియు/లేదా వ్యవహరించకుండా నిరోధించబడ్డారని గుర్తుంచుకోగలరు.

ప్రదేశం : విజయవాడ, తేది : 16-12-2025 సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్

IDFC FIRST Bank

(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేరు మార్చబడింది)
సిఐఎన్ : L65110TN2014PLC097792
నమోదిత కార్యాలయం: కెఆర్ఎమ్ టవర్స్, 8వ అంతస్తు, హారింగ్టన్ రోడ్, చేట్‌పేట్, చెన్నై-600031.
టెలి: +91 44 4564 4000, ఫ్యాక్స్: +91 44 4564 4022.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు

[illegible]

క్ర. సం	లోన్ ఖాతా నం.	లోన్	రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతల పేరు	సెక్షన్ 13(2) నోటీసు తేది	సెక్షన్ 13(2) నోటీసు ప్రకారం బకాయి మొత్తం
1	115128430	ఆస్తి పై రుణం	[illegible]	22.11.2025	INR 9,53,484.12/-

[illegible]

సం/- అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
తేది: 16.12.2025
ప్రదేశం: కృష్ణ, ఆంధ్రప్రదేశ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేరు మార్చబడింది)

సోలార్‌కు మరో 8వేల ఎకరాలు

● ఆగని సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల మంజూరు
● మడకశిర ప్రాంతంలో 1700 మెగావాట్లు
● రాయదుర్గం ప్రాంతంలో 300 మెగావాట్లకు అనుమతులు

మడకశిరలో 1700 మెగావాట్ల సోలార్ ప్లాంట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు ఆగడం లేదు. తాజాగా మడకశిర, రాయదుర్గం ప్రారంతంలో రెండు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. ఈ మేరకు రెండు ప్రాజెక్టులకు కలిపి సుమారు ఎనిమిది వేల ఎకరాల వరకు భూమిని సేకరించే అవకాశముంది.

ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంజూరైన సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల అనుమతుల వరకు చూస్తే మొత్తం లక్ష ఎకరాలకు చేరుతోంది. ఇంకా అదనంగా వస్తే జిల్లాలో ఏ మేరకు వ్యవసాయ భూములు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు పోతాయోనన్న చర్చ నడుస్తోంది.

మడకశిర నియోజకవర్గం పరిధిలోని మడకశిర, గుడిబండ మండలాల పరిధిలో 1700 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. చింతా గ్రీన్ ఎనర్జీ అనే సంస్థకు ఈ అనుమతులిచ్చింది. ఇందులో మడకశిర, గుడిబండ మండలాల్లోని పలు గ్రామాలున్నాయి. కేకాతి, చిగతుర్తి, కరికేర, హరేసముద్రం, బుల్లసముద్రం, మానేరు, మేలవోయి, ఊగేపల్లి, పాపసానిపల్లి, చంద్రకచర్ల, గౌడనహళ్లి, ఆర్.అనంతపురం గ్రామాల పరిధిలో ఈ సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు. ఒక్క మెగావాట్‌కు సగటున నాలుగు ఎకరాల వరకు భూసేకరణ జరుగుతోంది. ఈ మేరకు ఈ గ్రామాల పరిధిలో మొత్తం 6800 ఎకరాల వరకు భూమిని చింతాగ్రీన్ ఎనర్జీ సేకరించే అవకాశముంది. ఏడాదికి రూ.31 వేల చొప్పున లీజు పద్ధతిలో ఈ భూమిని సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చి ఉంది.

రాయదుర్గం పరిధిలో 300 మెగావాట్లు

రాయదుర్గం నియోజకవర్గం పరిధిలోని కణేకల్, బొమ్మనహాళ్ మండలాల పరిధిలో 300 మెగవాట్ల విద్యుత్ ఉత్పతికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. గనేకో త్రీ ఎనర్జీ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు ఈ అనుతులిచ్చింది. ఈ సంస్థ హైబ్రీడ్ పద్ధతుల్లో అంటే సోలార్, విండ్ కలగలపి విద్యుత్ ఉత్పత్తిని చేపట్టనుంది. ఈ సంస్థ కణేకల్, బొమ్మనహాళ్ మండలాల్లో ఏర్పాటుకు అనుతులిచ్చింది. అయితే ఏ గ్రామాల్లో అన్నది నిర్ధిష్టంగా తెలుపలేదు. ఏడాదికి రూ.31వేల లీజు పద్ధతుల్లోనే ఈ సంస్థకూ అనుతులిచ్చియున్నారు. ఈ రకంగా రెండు అనుమతుల ప్రకారం చూస్తే సుమారు ఎనిమిది వేల ఎకరాల వరకు వ్యవసాయ భూమి సోలార్ పద్ధతుల్లో తీసుకునేందుకు వీలుంటుంది. ఇంత పెద్దఎత్తున భూములు సోలార్‌కు పోతున్న క్రమంలో గ్రామాల్లో పరిస్థితులు రాబోయే రోజుల్లో ఏ రకంగా ఉండనుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఏడాదికి లీజు రూ.31 వేలు కాకుండా దీన్ని పెంచి ఇవ్వాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

సిఐటియు అఖిల భారత మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కె ఉమా మహేశ్వరరావు, నాయకులు

సిఐటియు అఖిల భారత మహాసభను విజయవంతం చేయాలి

● ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని ఎపి పౌర సరఫరాల సంస్థ హమాలీల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన విజయవాడ దుర్గాపురంలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సిఐటియు అఖిల భారత మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఐక్యత, పోరాటం నినాదంతో 1970లో సిఐటియు ఏర్పడిందని, యూనియన్ అఖిల భారత మహాసభలు రాష్ట్రంలో తొలిసారి ఈ నెల 31 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకూ జరగనున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గానికి ద్రోహం చేసే విధంగా ఆర్థిక, పారిశ్రామిక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ నిరంకుశ పద్ధతుల్లో తెచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేసే వరకూ కార్మికవర్గం సంఘటితంగా పోరాడాలని కోరారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ముఠా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే నెల 4న సిఐటియు అఖిల భారత మహాసభల సందర్భంగా జరగనున్న ప్రదర్శన, బహిరంగ సభలకు ముఠా కార్మికులందరూ పెద్దయెత్తున తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి, సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ కృష్ణ, ఎస్ ఉదయ్ భాస్కరరావు, రాష్ట్ర నాయకులు సుధాకర్, రమేష్, వెంకట్రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిసిసి ప్రతిష్టకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

● సంస్థ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-చింతపల్లి : జిసిసి ప్రతిష్టకు చెడ్డ పేరు తెచ్చే విధంగా వ్యవహరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని అధికారులను జిసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం ఆయన చింతపల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన రైతుల శ్రేయస్సే లక్ష్యంగా కాఫీ కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిసిసి కాఫీ కొనుగోలు ధరలను ప్రకటించిన ఆయన, ఇవి గిరిజన కుటుంబాలకు గణనీయమైన ఊరటనిస్తాయని తెలిపారు. మధ్యవర్తుల దోపిడీని పూర్తిగా అరికట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అరబికా పార్చ్‌మెంట్ కిలోకు రూ.450, అరబికా చెర్రీ కిలోకు రూ.270, రోబస్టా చెర్రీ కిలోకు రూ.170కు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు.

ఆంధ్రా జట్టుకు 32 మంది క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - వీరవాసరం

జాతీయస్థాయిలో సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్రం తరపున ఆడేందుకు 32 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు పిఎస్ఎన్.మల్లేశ్వరరావు, దాసరి సునీత సోమవారం తెలిపారు. దీనిలో బాలుర జట్టుకు 16 మంది, బాలికల జట్టుకు 16 మందిని ఎంపిక చేశారన్నారు. బాలుర జట్టులో జిల్లా నుండి ఉప్పే దుర్గారావు, తెల్లం మన్వత్‌శ్రీనిహార్, నారెడ్ల నవసంపత్, నూకల ప్రేమ్‌సాయిసిద్దు, శ్రీకాకుళం జిల్లా నుండి గేదల నానిబాబు, చింతాడ జస్వంత్, పైడి శరత్, విజయనగరం జిల్లా నుండి ముగిడి శేఖర్, ముచ్చి ఉదయ్‌కిరణ్, ముగడ రంజిత్‌కుమార్, గుంటూరు జిల్లా నుండి ఎం.భూపేంద్రకుమార్, ప్రకాశం జిల్లా నుండి అంగలకుర్తి అరుణ్‌కుమార్, తూర్పుగోదావరి జిల్లా నుండి మాగాపు బాల వీరబాబు, కడప జిల్లా నుండి పసల భవంత్ సాగర్, విశాఖపట్నం జిల్లా నుండి వి.తేజరామ్ ఉన్నారు. బాలికల జట్టుకు విజయనగరం జిల్లా నుండి కొండ్రు స్నేహ, కలిశెట్టి మన్విత, ఆర్.శ్రీవాణి, కొలుసు ఇందు, పశ్చిమగోదావరి జిల్లా నుండి లగు ఐశ్వర్య, ఆర్.రోజ్‌లైన్, బొల్లుబోయిన నాగశ్రావణి, తూర్పుగోదావరి జిల్లా నుండి బుడితి సుష్మ, జిబిఎస్.సలోమణి, వి.రాజశ్రీవల్లీ,కడప జిల్లా నుండి చాగలేటి వైష్ణవి, మళ్ల రమ్యశ్రీ, ప్రకాశం జిల్లా నుండి గుమ్మ కీర్తన, గుంటూరు జిల్లా నుండి బొజ్జా శ్రీలక్ష్మీ, శ్రీకాకుళం జిల్లా నుండి అన్నెపు జోత్స్న, అనంతపురం జిల్లా నుండి బోయ రాధిక ఎంపికైనట్లు తెలిపారు.

మైసూర్ రైలును కడప వరకు నడపాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మైసూర్ నుంచి రేణిగుంట మీదుగా వచ్చే ఎక్స్‌ప్రెస్ రైలును వారానికి ఒకసారి కడప వరకు నడపాలని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను కోరారు. సోమవారం ఢిల్లీలో ఎంపీ రైల్వే మంత్రిని కలిసి లేఖ అందించారు. మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ ముద్దనూరులో ఆపేలా చర్యలు తీసుకోవాలని లేఖలో సూచించారు. రైల్వే అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించాలని ఎంపీ కోరారు.

కొత్త జిల్లాల్లో పోలీస్ కార్యాలయాలు

● హోం మంత్రి వంగలపూడి అనిత
● పోలీస్ గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా కళ్యాణం శ్రీనివాస్ బాధ్యతలు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కళ్యాణం శివ శ్రీనివాసరావు

కొత్త జిల్లాల్లో పోలీస్ కార్యాలయాలను నిర్మించాల్సి ఉందని, రూ.300 కోట్లతో పోలీస్ అకాడమీ నిర్మించుకోవాలని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సోమవారం మంగళగిరి నగర పరిధిలోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాల యంలో ఘనంగా జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కళ్యాణం శివ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో అనిత మాట్లాడుతూ ఎపి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధ్వర్యంలో అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.509 కోట్లతో అనేక భవనాలు నిర్మించామని చెప్పారు. ఉమ్మడి ఎపిలో చర్లపల్లి, విశాఖ జైలు, ఆక్టోపస్, పోలీస్ అకాడమి వంటి నిర్మాణాలు జరిగాయని, ప్రస్తుతం అనేక మోడల్ పోలీస్ స్టేషన్ల నిర్మాణం జరుగుతోందని, కొత్తగా రూ.179 కోట్లతో నిర్మించబోతున్నామని తెలిపారు. రూ.412 కోట్లతో గ్రేహౌండ్స్ నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందని వివరించారు. ఈ నిర్మాణాలను ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు, ఎమ్‌డి రవి ప్రకాష్‌లు విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. 2019 సంవత్సరానికి ముందు చాలా మోడల్ పోలీస్ స్టేషన్లను నిర్మించామన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన కళ్యాణం శివ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ తరపున రూ.1,200 కోట్ల నిర్మాణాలకు సిద్ధంగా ఉన్నాయని, హోంమంత్రి, డిజిపి సహకారంతో ఇతర అధికారులతో సిబ్బందితో నిర్మాణాలు పూర్తి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎమ్‌డి రవి ప్రకాష్, ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్, ఎపి ఎంఎస్ ఐడిసి ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, కార్పొరేషన్ జనరల్ ఫైనాన్స్ మేనేజర్ సీతారామరాజు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ మరియు నమోదిత కార్యాలయం : 6వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, సేనాపతి బాపత్ మార్గ్, లోవర్ ప్యారెల్, ముంబై-400 013.
DCB BANK

సవరణ

ఈ వార్తా పత్రిక (ప్రజాశక్తి (తెలుగు) లో 28.11.2025న ప్రచురించబడిన **ఇ-వేలం విక్రయ నోటీసుకు** ఈ సవరణ సూచన. ఈ నోటీసులో అకౌంట్ యొక్క **1. శ్రీ.అయ్యపురెడ్డి అనిల్, 2. శ్రీమతి. అయ్యపురెడ్డి అరుణ, ఇ వేలం విక్రయ నోటీసు,** రిజర్వు ధర, **రూ.17,40,000/-** కు బదులుగా **17,60,000/-** అని సరిగా చదవగలరు. **ఇ-వేలం అమ్మకపు నోటీసు** యొక్క ఇతర విషయాలు మారవు.
సం/-
తేది : 16.12.2025 అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ డిసిబి బ్యాంక్ లిమిటెడ్

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా / भारत सरकार का उपक्रम / భారత ప్రభుత్వ రంగ సంస్థ

నందిగామ బ్రాంచి-03941
నందిగామ, ఎన్.టి.ఆర్ జిల్లా-521185.

డిమాండ్ నోటీసు

Notice under Sec.13(2) read with Sec.13(3) of Securitization and Reconstruction of Financial Assets and Enforcement of Security Interest Act, 2002.

ఋణగ్రహీతలు: 1. శ్రీమతి వెలది రామ సత్యవతి, భర్త: శ్రీ వి.వి. తిరుపతి రావు, 23-51, నెహ్రూ నగర్, నందిగామ-521185. **2. లేట్ శ్రీ వి.వి. తిరుపతి రావు** గారి ఎస్టేట్, ప్రాతినిధ్యం వహిస్తున్న వారి చట్టపరమైన వారసులు - శ్రీమతి వెలది రామ సత్యవతి (భార్య) మరియు ఇతర చట్టపరమైన వారసులు, 23-51, నెహ్రూ నగర్, నందిగామ - 521185. **3. అనుమోలు వెంకట శ్రీనివాస రావు,** తండ్రి: గురునాధం, ప్రసన్నఆంజనేయ టెక్స్‌టైల్స్, మెయిన్ రోడ్డు, నందిగామ-521185.

టైప్ ఆఫ్ ఫెసిలిటీ	మొత్తం (రూ. లక్షలలో)	బకాయి మొత్తం (రూ.)
Housing Loan 039430100041059	7,50,000.00	Rs.2,09,300.18 ps

గౌరవనీయులైన సర్/మేడమ్,
సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) తో చదవబడే సెక్షన్ 13(3) క్రింద **ది. 05-12-2025**వ తేదీన అధీకృత అధికారి మీకు చెందిన లోన్ ఖాతా/ల లోని బకాయిలను తిరిగి చెల్లించమని మీరు చివరిగా తెలిపిన చిరునామాకు నోటీసును అందించలేకపోయాము. కాబట్టి చెప్పబడిన డిమాండ్ నోటీసులోని విషయాలను ఈ వార్తా పత్రికలో ప్రచురిస్తున్నాము. మీరు పొందిన క్రెడిట్ సౌకర్యాలు / ఋణ సౌకర్యాలను **ది. 29.01.2025**న నిరర్ధక ఆస్తి (**NPA**) గా పరిగణిస్తున్నాము. మీరు ఋణాన్ని పొందినప్పుడు ఋణపత్రాలను అమలు చేసి బ్యాంక్‌కు అనుకూలంగా భద్రతా ఆస్తిని సృష్టించారు. క్రెడిట్ సౌకర్యాలు మరియు సెక్యూర్డ్ ఆస్తుల వివరాలు ఈ క్రింద విధంగా ఉన్నాయి. బకాయి మొత్తం **రూ. 2,09,300.18** పై (అక్షరాలా రెండు లక్షల తొమ్మిది వేల మూడు వందల రూపాయల పద్దెనిమిది పైసలు మాత్రమే) మరియు **ది. 01.11.2024** నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం వడ్డీ.

స్థిరాస్తి వివరములు
నందిగామ, నెహ్రూ నగర్, డి.నెం. 23-51, ఆర్.ఎస్.నెం. 675/1 లో ఉన్న 242.77 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు, రెండవ అంతస్తులలో ఉన్న రెండు గదుల రూఫ్ బిల్డింగ్ శ్రీమతి వెలది రామ సత్యవతి గారి పేరున కలదు. **హద్దులు: తూర్పు:** 66 లింకుల బజారు, **దక్షిణం:** రంగ పుల్లారావు గారి ఇల్లు, **పడమర:** వాసిరెడ్డి వెంకటేశ్వరరావు మరియు ఇతరుల ఆస్తి, మరియు **ఉత్తరం:** పొన్నుగంటి నాగ లక్ష్మి గారి ఆస్తి.

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13 (2) ప్రకారం పైన పేర్కొన్న **రూ. 2,09,300.18** పై (అక్షరాలా రెండు లక్షల తొమ్మిది వేల మూడు వందల రూపాయల పద్దెనిమిది పైసలు మాత్రమే) మొత్తాన్ని భవిష్యత్తు వడ్డీ మరియు ఛార్జీలతో కలిపి ఈ ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోపు చెల్లించవలసి ఉంటుంది. మీరు దానిని పాటించడంలో విఫలమైతే, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద ఉన్న అన్ని లేదా ఏవైనా హక్కులను వినియోగించుకోవడానికి సెక్యూర్డ్ క్రెడిటార్ అయినటువంటి మేము అర్హులము. చట్టంలోని సెక్షన్ 13 (13) ప్రకారం, నోటీసు అందిన తేదీ నుండి మీరు పైన పేర్కొన్న సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు బ్యాంక్ ముందస్తు అనుమతి లేకుండా బదిలీ చేయకూడదు. సెక్యూర్డ్ ఆస్తులను అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) లోని నిబంధనలను దయచేసి గమనించగలరు.

తేది : 05.12.2025 అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఐపిఎస్ అధికారి సునీల్ కుమార్‌ను విచారించిన సిట్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీసు విచారణ పేరుతో మాజీ ఎంపి, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజును గుంటూరులో కస్టోడియల్ టార్చర్‌కు గురి చేశారన్న ఆరోపణలపై నమోదు అయిన కేసులో ఐపిఎస్ అధికారి పి.వి.సునీల్‌కుమార్ సోమవారం సిట్ విచారణకు హాజరయ్యారు. దాదాపు ఐదు గంటల పాటు విచారణాధికారి, విజయనగరం ఎస్‌పి దామోదర్ ఆయనను విచారణ చేశారు. రఘురామ కృష్ణరాజుపై జరిగిన దాడి పూర్వపరాలు, వైద్య పరీక్షల నివేదికల మార్పునకు సంబంధించి సునీల్‌కుమార్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. భౌతిక దాడి చేసిన వారు ఎవ్వరు? ఎవ్వరు చేయించారు? తదితర వివరాల గురించి ఆరా తీసినట్లు సమాచారం. అయితే సునీల్ కుమార్ చాలా ప్రశ్నలకు దాటవేత ధోరణిలో సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. మరోసారి విచారణకు పిలుస్తామని, అప్పుడు రావాలని సునీల్‌కుమార్‌కు చెప్పినట్లు తెలిసింది. విచారణ ముగిసిన తరువాత సునీల్‌కుమార్, దామోదర్ ఇద్దరూ మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.

గెలాక్సీ జెడ్ ట్రైఫోల్డ్ విడుదల

హైదరాబాద్ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కొత్తగా గెలాక్సీ జెడ్ ట్రైఫోల్డ్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. మొబైల్ ఏఐ యుగంలో కొత్త రకం డిజైన్లలో తమ ఆధిపత్యాన్ని విస్తరిస్తోన్నట్లు తెలిపింది. ఇది తమ ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. రెండుసార్లు తెరిచినప్పుడు ఇది 10-అంగుళాల అద్భుతమైన డిస్‌ప్లేను ఆవిష్కరిస్తుందని సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ డివైస్ ఎక్స్‌పీరియన్స్ డివిజన్ ప్రెసిడెంట్, సీఈఓ టిఎమ్ రోహ్ పేర్కొన్నారు. అత్యంత సన్నని కేవలం 3.9 మిల్లీమీటర్ల మందంతో ఉండే గెలాక్సీ జెడ్ ట్రైఫోల్డ్ అత్యున్నత స్థాయి పనితీరును అందిస్తుందన్నారు. ఇందులో 200 మెగాపిక్సెల్ కెమెరాను అమర్చామన్నారు.

ఎస్ బ్యాంక్ రాణా కపూర్‌ను విచారించిన ఇడి

● అనిల్ అంబానీ కేసులో దర్యాప్తు



ముంబయి : అనిల్ అంబానీ గ్రూప్ మనీలాండరింగ్ ఆరోపణల విచారణలో యెస్ బ్యాంక్ సహ వ్యవస్థాపకుడు రాణా కపూర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రశ్నించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (ఫెమా) కింద కపూర్ వాంగ్మూలాన్ని నమోదు చేస్తున్నారు. 2017-2019 మధ్య అనిల్ అంబానీ సంస్థలకు ఎస్ బ్యాంక్ జారీ చేసిన రుణాలు, పెట్టుబడులపై ఇడి దర్యాప్తు చేస్తోంది. రాణా కపూర్ చొరవతోనే రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపునకు 2017లో యెస్ బ్యాంక్ రూ.6,000 కోట్ల అప్పులు ఇచ్చిందనేది ప్రధాన ఆరోపణ. 2018 మార్చి నాటికి ఏకంగా రూ.13,000 కోట్ల రుణాలు ఇచ్చింది. అనంతరం ఇవి మొండి బాకీలుగా మారాయి. ఈ దెబ్బతో ఎస్ బ్యాంక్ రూ.3,300 కోట్ల నికర నష్టాలను చవి చూసింది. ప్రజల డబ్బు ఎస్ బ్యాంక్ ద్వారా పరోక్షంగా మళ్లించబడిందని ఇడి ప్రధాన ఆరోపణ.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్

(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో సమ్మిళితమైంది)
సిఐఎన్ : L65110TN2014PLC097792
సమోదిత కార్యాలయం : కెఆర్ఎమ్ టవర్స్, 8వ అంతస్తు, హారింగ్టన్ రోడ్, చెట్పెట్, చెన్నై-600031.
టెలి : +91 44 4564 4000, ఫ్యాక్స్ : +91 44 4564 4022.
IDFC FIRST Bank

అనుబంధం- IV (రూల్ 8(1) స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువసంతకందారు అయిన **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో సమ్మిళితమైంది)** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క (రూల్ 3) తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. పిలువబడిన రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు చెల్లింపు/ రియలైజేషన్ వరకు డిమాండ్ నోటీసులో తేది నుండి డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి సదరు నోటీసు రసీదు తేది నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించవలసిందిగా కోరడమైనది.
రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని దిగువసంతకందారు స్వాధీనం చేసుకున్నారు.

లోన్ అకౌంట్ నంబరు	రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు మరియు హామీదారుల పేరు	తనఖా ఆస్తుల వివరణ	డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసు బకాయి మొత్తం (రూ.)	స్వాధీనం తీసుకున్న తేది మరియు విధానం
120769112	1. దొడ్డ హరిబాబు, 2. దొడ్డ దివ్య	ఆంధ్రప్రదేశ్-521178, ఎన్‌టిఆర్ జిల్లా, వాత్సవాయి మండలం, ఇందుగపల్లి రెవెన్యూ పరిధి, రామచంద్రాపురం గ్రామం వద్ద ఉన్న ఆర్.ఎస్.నం.78 లో డో.నం.1-146, ఆస్తి మొత్తం ముక్క మరియు పార్శిల్ ఉన్న సైట్ పరిధి ఎ.లు. 0.06 సెంట్లు. 581 చ.లిం.లు. లేదా 318.55 చ.గ.లు. తో ఆర్‌సిసి రూఫ్డ్ ఇంటి ప్లింత్ ఏరియా 831.09 చ.అ.లు. మరియు **హద్దులు మరియు కొలతలు : తూర్పు** : కొమ్మినేని శ్రీనివాసరావు మరియు నరసింహారావు సైట్ 33 అ.లు., **పడమర** : ఆర్ అండ్ బి రోడ్డు 28 అ.లు., **ఉత్తరం** : కొలేటి నాగేశ్వరరావు ఇల్లు 28 అ.లు., **దక్షిణం** : కొమ్మినేని శ్రీనివాసరావు ఇల్లు 95 అ.లు.	23.08.2025	Rs. 10,37,882.45/-	10-12-2025 స్వాధీనత
112404051	1. తాళ్లూరి ఆంజనేయులు, 2. తాళ్లూరి ఈశ్వరమ్మ	ఆంధ్రప్రదేశ్-522529, గుంటూరు జిల్లా, గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ఫిరంగిపురం ఉపజిల్లా, ఫిరంగిపురం మండలం, 113 తాళ్లూరు గ్రామ పంచాయతీ, 113 తాళ్లూరు గ్రామం లో ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.219, డో.నం.4-10, మూల్యాంకనం నం.767 సైట్ విస్తీర్ణం 193.6 చ.గ.లు. ఆ 8 సంవత్సరాల క్రితం నిర్మించబడిన ఆర్‌సిసి రూఫ్డ్ రెసిడెన్షియల్ భవనం 300 చ.అ.లు. మరియు ఎసిసి పంచా 290 చ.అ.లు. మరియు 30 చ.అ.లు. ఎసిసి లెట్రిన్ సైట్. క్రింది విధమైన సరిహద్దులు : తూర్పు : పాలపాటి సాంబయ్య ఇల్లు-66 అ.లు., పడమర : గాలి అనంతయ్య మరియు గాలి లూర్దు రాజు సైట్ 66 అ.లు., ఉత్తరం : పాలపాటి సాంబయ్య సైట్ 26.5 అ.లు., దక్షిణం : పాలపాటి సాంబయ్య ఇల్లు 26.5 అ.లు.	30.08.2025	INR 5,03,448.59/-	10-12-2025 స్వాధీనత
126768836	1. మొవ్వ సూర్యనారాయణ, 2. మొవ్వ సునీత	ఆంధ్రప్రదేశ్-522304, గుంటూరు జిల్లా ఎస్ఆర్ఓ, కొల్లిపర, కొల్లిపర గ్రామ పంచాయతీ మరియు మండలం పరిధిలో డో.నం.9-38/సి వద్ద ఉన్న బేరింగ్ ఆర్.ఎస్.నం.లు. 556-1, 557-8ఎ మరియు 557-8బి స్థలంపై నిర్మించబడిన "అక్షయ హైట్స్" లోని 3వ అంతస్తులో ఫ్లాట్ నం.టిఎఫ్-2 మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ తో విస్తీర్ణం 931.29 చ.అ.లు. ప్లింత్ ఏరియా తో పాటు నిర్మించబడిన ఫ్లాట్, 232.8 చ.అ.లు. సాధారణ ఏరియా మరియు 120.0 చ.అ.లు. కార్ పార్కింగ్ ఏరియా తో పాటు అన్నీ సౌకర్యాలు మరియు ఉమ్మడి హక్కులు. మరియు హద్దులు : ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై మరియు లిఫ్ట్, పడమర : ఓపెన్ టు స్కై, తూర్పు : కామన్ కారిడార్.	14/06/2025	Rs. 37,93,299.55/-	10-12-2025 స్వాధీనత

ప్రత్యేకించి రుణగ్రహీతలు/ సహ రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరిపేందుకు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో సమ్మిళితమైంది)** కు రియలైజేషన్/చెల్లింపు వరకు డిమాండ్ నోటీసు తేది నుండి డిమాండ్ నోటీసులో వివరించబడిన మొత్తం, తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి తిరిగి చెల్లించి జరుపవలెను.

సం/- అధీకృత అధికారి
తేది : 10.12.2025 ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
ప్రదేశం : కృష్ణ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో సమ్మిళితమైంది)

61శాతానికి పైగా తగ్గిన వాణిజ్య లోటు

న్యూఢిల్లీ : దేశ వాణిజ్య లోటు నవంబరు మాసంలో 61శాతానికి పైగా క్షీణించి 660కోట్ల డాలర్లకు చేరుకుంది. వస్తువుల ఎగుమతుల్లో పటిష్టమైన పురోగతి,, దిగుమతుల్లో తగ్గుదల కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. అక్టోబరు మాసం కన్నా నవంబరు మాసంలో అమెరికాకు భారత్ ఎగుమతులు పెరిగాయి. గతేడాది నవంబ రుతో పోల్చుకున్నా కూడా పెరుగుదల నమోదు చేశాయి. ఈ ఏడాది నవంబరులో భారతదేశ మొత్తం ఎగుమతులు 15.5శాతం పెరిగి 740కోట్ల డాలరకు చేరుకున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమ ల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డేటా పేర్కొంది. అదే సమయంలో మొత్తం దిగుమతుల కాస్తంతగా 0.6శాతం తగ్గి 806 కోట్ల డాలర్లకు చేరుకున్నాయ ని తెలిపింది. ఈ కాలంలోనే భారతదేశ వస్తువుల ఎగుమతులు 19.4శాతం పెరిగి 381 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. దిగుమతులు అక్టోబరులో 11.8శాతం తగ్గాయని ఆ డేటా తెలిపింది. మొత్తంగా అక్టోబరు డేటా నేపథ్యంలో తలెత్తిన ఆందోళనలను నవంబరు డేటా తొలగించిందని వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ పత్రికా సమా వేశంలో తెలిపారు. గత పదేళ్ళలో ఏ నవంబరు మాసంలోనూ లేని రీతిలో ఈ ఏడాది నవంబరులో ఎగుమతులు అధికంగా నమోదయ్యాయని చెప్పారు.

వాంగ్‌చుక్ నిర్బంధంపై పిటిషన్

- **జనవరి 7కి విచారణ వాయిదా**

న్యూఢిల్లీ : వాతావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ అతని భార్య గీతాంజలి జె.ఆంగ్మో వేసిన పిటీషన్ విచారణను వచ్చేఏడాది జనవరి7కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ అరవింద్ కమార్, జస్టిస్ ఎన్‌వి అంజరియాలతో కూడిన ధర్మాసనం ముందుకు విచారణ కోసం వచ్చింది. అయితే తగిన సమయం లేకపోవడం వల్ల విచారణను వాయిదా వేసింది. లధక్‌లో ఆందోళనలు జరిగిన రెండు రోజుల తరువాత అంటే సెప్టెంబరు 26న జాతీయ భద్రతా చట్టం (ఎన్‌ఎస్‌ఎ) కింద వాంగ్‌చుక్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ అరెస్టు చట్ట విరుద్ధమని, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే ఏకపక్ష చర్య అని విమర్శిస్తూ గీతాంజలి జె.ఆంగ్మో పిటీషన్ వేశారు. వాంగ్‌చుక్‌పై కేసు అస్పష్టమైన ఆరోపణలు, ఊహాజనిత వాదనలు ఆధారంగా నమోదు చేశారని పిటిషన్‌లో ఖండించారు.

మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించొద్దు

- **పార్లమెంట్లో వైసిపి ఎంపిలు నిరసన**

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించొద్దని వైసిపి ఎంపిలు డిమాండ్ చేశారు. పార్లమెంటు మకరద్వారం వద్ద సోమవారం ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి పార్లమెంటరీ పార్టీ నేత వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలిశామన్నారు. రాష్ట్రంలో కోట్లాది సంతకాలు సేకరించామని, ప్రైవేటీకరణ వెనక్కి తీసుకునేంత వరకూ పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎంపిలు పివి మిథున్ రెడ్డి, అవినాష్ రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, గురుమూర్తి, తనూజ రాణి తదితరులు పాల్గొన్నారు.



ఆలయాల్లో యుపిఐ చెల్లింపులకు క్యూఆర్ కోడ్స్

ప్రజాశక్తి - తిరుమల: దేశవ్యాప్తం ఉన్న 60 టిటిడి ఆలయాల్లో యాత్రికులు సులభతరంగా యుపిఐ చెల్లింపులు చేసేందుకు వీలుగా కియోస్క్ మిషన్లు, క్యూఆర్ కోడ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్ ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని ఆయన కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో టిటిడి నిర్మించదలచిన ఐదువేల ఆలయాలకు గాను అవసరమైన రెండు, మూడు డిజైన్లు సిద్ధం చేయాలని సీఈని ఆదేశించారు. తిరుపతి, వినాయక నగర్ వద్ద ఉన్న టిటిడి స్టాఫ్ క్వార్టర్స్ ఆధునీకరణ పనులను త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జాప్యం లేకుండా చూడాలని తెలిపారు. శ్రీవారి ఆలయంలో ఉన్న కదిలే వంతెన మరమ్మతు పనులను వైకుంఠ ఏకాదశిలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తిరుమల తరహాలో తిరుచానూరు, గోవిందరాజస్వామి ఆలయంలో కూడా టీటీడీ సేవలపై అభిప్రాయ సేకరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో టిటిడి జేఈవో వీరబ్రహ్మం, సీవీ అండ్ ఎస్వో మురళీకృష్ణ, ఎఫ్ఏ.సీఏఓ బాలాజీ, సీఈ సత్యనారాయణ, డిప్యూటీ సీఎఫ్ ఫణి కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారీగా హెచ్-1బి, హెచ్-4 వీసాల రద్దు

- **ప్రారంభమైన వెట్టింగ్**

న్యూఢిల్లీ, వాషింగ్టన్ : భారత్‌లో హెచ్-1బి వీసాల ఇంటర్వ్యూలను వాయిదా వేసిన అమెరికా తాజాగా హెచ్-1బి, హెచ్-4 వీసాలను కూడా భారీగా రద్దు చేసింది. ఈ విషయాన్ని వీసాదారులకు ఇమెయిల్ ద్వారా తెలియచేసింది. హెచ్-1బి వీసా దరఖాస్తుదారులపై 'వెట్టింగ్'ను ప్రారంభించిన అమెరికా ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ వీసాలను 'ప్రుడెన్షియల్ రద్దు' చేసింది. హెచ్-1బి, హెచ్4 వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించే ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అయితే ఈ ప్రుడెన్షియల్ రద్దు తాత్కాలికమేనని అమెరికా అధికారులు తెలిపారు. ఇది శాశ్వత వీసా తిరస్కరణ కిందకు రాదని ఇమిగ్రేషన్ అటార్నీ ఎమిలీ నాయ్‌మెన్ వెల్లడించారు. "ఈ తాత్కాలిక వీసా రద్దు వీసాదారుల చట్టబద్ధ నివాస హక్కును ప్రభావితం చేయదు. కానీ, తదుపరి వీసా అపాయింట్‌మెంట్ సమయంలో దీన్ని పరిగణనలోకి తీసుకుని వారి దరఖాస్తులను మరింత క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం ఉంది" అని సోషల్ మీడియాలో ఎమిలీ తెలిపారు.

ప్రుడెన్షియల్ రద్దు అంటే..

వీసాదారుల చట్టబద్ధ నివాస అర్హతలో ఏదైనా సమస్య ఉందని ప్రభుత్వం అనుమానించిన సందర్భంలో విదేశాంగ శాఖ వీసా రద్దుపై నిర్ణయం తీసుకుంటుంది. దీన్నే ప్రుడెన్షియల్ వీసా రివోకేషన్‌గా పిలుస్తారు. అయితే, ఇలా తాత్కాలికంగా రద్దు చేసినప్పటికీ.. వీసాదారులు తమ గడువు పూర్తయ్యేవరకు అమెరికాలో నివాసం కొనసాగించొచ్చు. అయితే, ఒకసారి అమెరికా నుంచి బయటకు వెళ్తే.. వీసా గడువు ఉన్నప్పటికీ మళ్లీ అమెరికాలోకి ప్రవేశించే అవకాశం ఉండదు. తాత్కాలిక రద్దు సమయంలో వీసాల స్టాంప్ చెల్లుబాటు కాదు.

మొదలైన వెట్టింగ్ ప్రక్రియ

హెచ్-1బి, హెచ్4 వీసా దరఖాస్తుదారుల ఆన్‌లైన్ ఉనికిని సమీక్షించే వెట్టింగ్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. హెచ్1బి, హెచ్4, ఎఫ్, ఎం, జె వీసాలకు దరఖాస్తు చేసినవారంతా వెట్టింగ్‌కు వీలుగా తమ సోషల్‌మీడియా సెట్టింగ్‌లను మార్చుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ కారణంగా ఇప్పటికే భారతీయులు సహా అనేక మంది హెచ్1బి వీసాల ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. డిసెంబర్ 15వ తేదీ నుంచి వీసా దరఖాస్తుదారుల ఆన్‌లైన్ ఖాతాలను సమీక్షించే ప్రక్రియను ప్రారంభిస్తున్నామని పేర్కొంటూ అమెరికా విదేశాంగశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 'వెట్టింగ్‌కు వీలుగా హెచ్1బి, హెచ్4, ఎఫ్, ఎం, జె వీసాలకు దరఖాస్తు చేసిన వారంతా తమ సెట్టింగ్‌లను ప్రైవేటు నుంచి పబ్లిక్‌కు మార్చుకోవాలి' అని సూచించింది. సాధారణంగా ఎఫ్, ఎం, జె వీసాలకు విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు దరఖాస్తు చేసుకుంటారు.

'వీసా దరఖాస్తుదారులందర్నీ క్షుణ్ణంగా వెట్టింగ్ చేస్తాం. వారి ఆన్‌లైన్ ఉనికిని పరిశీలిస్తాం. ప్రతి వీసా నిర్ణయమూ జాతీయ భద్రత కోణంలోనే ఉంటుంది. వీసా జారీ ప్రక్రియలో అమెరికా అత్యంత జాగరూకతతో ఉంటుంది. అమెరికాలోకి ప్రవేశించేవారు అమెరికన్లకు హాని చేయబోరని మేం నిర్ధారించాలి. అలాగే, అమెరికా ప్రయోజనాలకు నష్టం కలిగించరని మేం విశ్వసించాలి. అందుకే వీసా దరఖాస్తుదారులందరూ తమ విశ్వసనీయతను నిరూపించుకోవాలి' అని అమెరికా విదేశాంగశాఖ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

ఢిల్లీలో తీవ్రమైన వాయు కాలుష్యం

- **170 విమానాలు రద్దు... నత్తనడక నడుస్తున్న రైళ్లు**

న్యూఢిల్లీ : దేశ రాజధానిలో వాయు కాలుష్యం గరిష్ట స్థాయికి చేరింది. గాలిలో నాణ్యత పూర్తిగా పడిపోయిం ది. కంటి ముందు ఏమీ కనిపించని విధంగా పరిస్థితి దారుణంగా మారింది. దీంతో ఢిల్లీ విమానాశ్రయం నుంచి బయలుదేరాల్సిన 170 విమా నాలను సోమవారం రద్దు చేశారు. వందలాది విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. మరోవైపు రైళ్లు కూడా నత్తనడక నడుస్తున్నాయి. ఉదయం వేళలో రోడ్లపై వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగాయి. రాజధానిని ఉదయం మంచుపొర పూర్తిగా కప్పేసింది. నగరంలో సగటు వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 498గా నమోదైంది. దీనిని బట్టి వాయు నాణ్యత 'తీవ్రమైన' కేటగిరీలో ఉందని తెలుస్తోంది. న్యూఢిల్లీలో 40 వాయు నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 30 కేంద్రాలు ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా ఉందని తేల్చాయి. రెండు కేంద్రాలు చాలా పేలవమైన స్థాయిని సూచించాయి. జహంగీర్‌పురి ప్రాంతం అత్యంత కాలుష్య ప్రదేశంగా నిర్ధారణ అయింది. అక్కడ ఏక్యూఐ 498గా నమోదైంది. ఇతర కేంద్రాలతో పోలిస్తే ఇదే అత్యధికం . కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) ప్రకారం ఏక్యూఐ 401-500 మధ్య ఉంటే పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు పరిగణించాలి. వాయు కాలుష్యం ఈ స్థాయిలో ఉంటే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. ఆదివారం కూడా ఢిల్లీలో ఏక్యూఐ 461గా నమోదైంది. వాతావరణ పరిస్థితులు సానుకూలంగా లేకపోవడంతో కాలుష్య స్థాయిలు రానున్న రోజుల్లో మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు...

కాన్హా శాంతి వనంలో చంద్రబాబు

- **దాజీతో కలిసి సందర్శన**

ప్రజాశక్తి - హైదంరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కాన్హా శాంతి వనాన్ని ఆంధ్రప్రదేశ్ సిఎం నారా చంద్రబాబు నాయుడు సోమవారం సందర్శించారు. ప్రత్యేక విమానంలో ఆయన కాన్హా శాంతి వనానికి చేరుకున్నారు. దాజీతో కలిసి ఐదు గంటలపాటు కాన్హా శాంతి వనంలో కలియ తిరిగి అక్కడి సౌకర్యాలను ఆయన సందర్శించారు. అతిపెద్ద ధ్యాన కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం, యోగ సౌకర్యం, ఆర్ట్ ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్, ఆర్ట్ ఫుల్ నెస్ గోపీచంద్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ అకాడమీతో పాటు వృక్ష సంరక్షణ, రెయిన్ ఫారెస్ట్, బయోచర్ సౌకర్యాలను పరిశీలించారు. సంరక్షణ కేంద్రంలో కొనసాగుతున్న శాస్త్రీయ వృక్షశాస్త్ర పరిశోధనల గురించి కాన్హా శాంతి వనం ప్రతినిధులు చంద్రబాబుకు వివరించారు. అనంతరం జీవవైవిధ్యం పర్యావరణ కార్యక్రమాలను ప్రదర్శించే రెయిన్ ఫారెస్ట్‌ను సందర్శించారు. ఆధ్యాత్మిక ప్రాముఖ్యత అవలోకనంతో ప్రపంచంలోని అతిపెద్ద ధ్యాన మందిరం సందర్శించి అక్కడి మెడిటేషన్ హాల్ వెలుపల బాబూజీ వనం, బయోచర్ సెంటర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను చంద్రబాబు పరిశీలించారు. అనంతరం గోపీచంద్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ అకాడమీకి చంద్రబాబు వెళ్లారు. అక్కడ క్రీడాకారులకు ఇచ్చే శిక్షణ గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు అధికారులు, కాన్హా శాంతి వనం ప్రతినిధులు ఉన్నారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై బెర్లిన్‌లో చర్చలు : జెలెన్‌స్కీ హాజరు

బెర్లిన్ : ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధాన్ని ముగించడానికి దౌత్యపరమైన ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ , యూరోపియన్ నాయకులు జర్మనీలో ఉన్నత స్థాయి చర్చలకు బెర్లిన్ వేదిక అయింది. అమెరికా శాంతి ప్రణాళికపై ఉక్రెయిన్, అమెరికన్ సంధానకర్తల మధ్య చర్చలు జరిపారు. బెల్జియంలో నిరవధికంగా స్తంభింపజేసిన రష్యన్ ఆస్తుల అంశంతో పాటు వాటిని ఎలా ఉపయోగించాలనే దానిపై సమాలోచనలు జరిగినట్లు తెలుస్తుంది. పాశ్చాత్య భద్రతా హామీలకు బదులుగా ఉక్రెయిన్ నాటోలో చేరాలనే తన ఆశయాన్ని వదులుకోవడానికి సిద్ధంగా ఉందని జెలెన్స్కీ చెప్పారు. అయితే అనేక కీలక అంశాలపై ఎంత పురోగతి సాధించారనేది అస్పష్టంగా ఉంది.దీంతో రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య దాడులు కొనసాగుతున్నాయి. రష్యా 153 డ్రోన్‌లను పేల్చిందని, అలాగే 17 స్థావరాలపై గురిపెట్టగా.. ఛేదించాయని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు.

పప్పు ధాన్యాల నిల్వపద్ధతుల్లో లోపాలు

- **దిగుబడులను హరిస్తున్న తేమ, ఉష్ణోగ్రత, పురుగుల దాడి**
- **ఏకీకృత ప్రమాణాలు అవసరం.**

ఐసిఎఆర్-సిఐపిహెచ్ఇటి అధ్యయనం

న్యూఢిల్లీ : దేశంలో పప్పు ధాన్యాలను నిల్వ చేస్తున్న పద్ధతులలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ప్రభుత్వం నిర్వహించిన ఓ సర్వే తేల్చింది. దీంతో అత్యధిక జనాభాకు మాంసకృత్తులను అందజేస్తున్న పప్పుల లభ్యతపై ఆందోళన అధికమవుతోంది. పప్పుల్ని నిల్వ చేయడం, మర పట్టించడం వంటి విషయాలలో ఏకీకృత శాస్త్రీయ ప్రొటోకాల్స్ అవసరమున్నదని సర్వే నొక్కి చెప్పింది. పప్పు ధాన్యాలను అధికంగా పండిస్తున్న రాష్ట్రాలలోని 101 గిడ్డంగులలో నిల్వ ఉంచిన వందలాది బస్తాలను అధ్యయనకర్తలు పరిశీలించారు. వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తరపున భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ హార్వెస్ట్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఐసిఎఆర్-సిఐపిహెచ్ఇటి) సర్వేను నిర్వహించింది.

ప్రమాణాలు పాటిస్తే...

కందులు, శనగలు, మినుములు, పచ్చి శనగలు వంటి పప్పులను పన్నెండు నెలల పాటు నిల్వ ఉంచితే నాణ్యతలో వచ్చే మార్పులను ఈ సర్వే గుర్తించింది. పప్పు ధాన్యాలను నిల్వ చేసేటప్పుడు మెరుగైన ప్రమాణాలను పాటిస్తే అవి చెడిపోకుండా ఉంటాయని, తద్వారా వృథాను అరికట్టవచ్చునని, అంతేకాక దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించవచ్చునని సర్వేలో పాల్గొన్న ఒక అధికారి చెప్పారు. పంట కోతల అనంతరం ఎదురయ్యే సమస్యలు...ముఖ్యంగా తగిన గిడ్డంగులు అందుబాటులో లేకపోవడం, వాటిలో నిల్వ చేసేటప్పుడు సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల దేశంలో తొమ్మిది శాతం పప్పుధాన్యాలు వృథా అవుతున్నాయి. 'సర్వే ఫలితాలను పరిశీలించడం జరిగింది. దేశీయంగా ఉత్పత్తిని పెంచడంతో పాటు పంటను నిల్వ చేయడంలో ఏకీకృత ప్రమాణాలను అనుసరించాల్సిన అవసరాన్ని గుర్తించాము' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఆ అధికారి తెలిపారు.

పప్పుల కోసం ఆత్మనిర్భరత మిషన్

దేశం పప్పు ధాన్యాల కొరత అధికంగా ఉంది. దీంతో డిమాండ్‌ను తీర్చడానికి దిగుమతులపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వెల్లడైన సర్వే నివేదిక ఫలితాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. పప్పు ధాన్యాల రంగంలో ఆత్మ నిర్భరత మిషన్‌ను కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబరులో ప్రారంభించింది. ఐదు సంవత్సరాలలో రూ.11,440 కోట్లు కేటాయిస్తానని తెలిపింది. 2030-31 నాటికి ఉత్పత్తిని 350 లక్షల టన్నులకు పెంచి స్వయంసమృద్ధి సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. అందుకోసం పంట విస్తీర్ణాన్ని పెంచాలని, మేలైన విత్తనాలు సరఫరా చేయాలని, కనీస మద్దతు ధరకు పప్పులు సేకరించాలని, దిగుమతులను తగ్గించాలని, ధరలను స్థిరంగా ఉంచాలని, రైతుల ఆదాయాన్ని పెంచాలని నిర్ణయించింది.

ఎల్‌డిపిఇ సంచుల్లో నిల్వ చేస్తే...

వ్యవసాయ మంత్రిత్వ శాఖ అందించిన డేటా ప్రకారం 2021-22 ఆర్థిక సంవత్సరంలో 27.3 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరగ్గా 2022-23లో అది 26 మిలియన్ టన్నులకు తగ్గిపోయింది. 2023-24లో మరింత పడిపోయి 24.5 మిలియన్ టన్నులకు చేరింది. అయితే గత ఆర్థిక సంవత్సరంలో దిగుబడి 25.7 మిలియన్ టన్నులకు పెరిగింది. 12 శాతం కంటే ఎక్కువ తేమ కలిగిన మినుములు, పెసలను తక్కువ సాంద్రత కలిగిన పాలిథిన్ (ఎల్‌డిపిఇ) సంచులలో నిల్వ ఉంచినప్పుడు కేవలం మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలోనే వాటిలో శిలీంధ్రాలు పెరగడాన్ని సర్వే సందర్భంగా గుర్తించారు. అంతేకాక అవి ముద్దగా కలిసిపోయాయి. గిడ్డంగులలో పప్పు ధాన్యాలను నిల్వ చేయడానికి 75 మైక్రాన్ల మందం కలిగిన ఎల్‌డీపీఈ సంచులను ఉపయోగించారు. అయితే అవి పప్పు ధాన్యాల నిల్వకు ఏ మాత్రం అనుకూలమైనవి కావు. ఎందుకంటే అవి వాతావరణంలో ఏర్పడే హెచ్చుతగ్గుల నుంచి రక్షణ కల్పించలేవు. వాటికి బదులుగా తగిన మందంతో ఉన్న పాలీప్రొపైలిన్ సంచులను లేదా లామినేటెడ్ ప్లాస్టిక్ ప్యాకేజింగును ఉపయోగించాలని సర్వే సూచించింది. గాలి చొరబడకుండా సంచులకు సీలు వేస్తే కీటకాల బెడద కూడా తగ్గుతుంది.

తేమ, ఉష్ణోగ్రత, కీటకాలే కీలకం

గత ఆరు సంవత్సరాల కాలంలో జరిగిన పప్పు ధాన్యాల ఉత్పత్తిని పరిశీలిస్తే 2021-22 అత్యధికంగా 27.3 మిలియన్ టన్నుల దిగుబడి రాగా 2019-20లో అత్యల్పంగా 23 మిలియన్ టన్నులు మాత్రమే వచ్చిందని వ్యవసాయ మంత్రిత్వ శాఖ డేటా చెబుతోంది. అయితే దిగుమతులకు సంబంధించిన గణాంకాలు దీనికి పూర్తిగా భిన్నమైన సమాచారాన్ని ఇస్తున్నాయి. సుంకాలు అనుకూలంగా ఉండడం, దేశంలో ధరలు తక్కువగా ఉండడంతో 2022-23లో 2.6 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల దిగుమతి జరగ్గా అది 2024-25 నాటికి 6.7 మిలియన్ టన్నులకు పెరిగింది. గడచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో ఇదే గరిష్టం. కేంద్ర రాష్ట్ర గిడ్డంగుల సంస్థల నిర్వహణలోని వేర్‌హౌస్‌లలో నిల్వ ఉంచిన పప్పు ధాన్యాలకు సంబంధించి తేమ స్థాయి, ఉష్ణోగ్రత, కీటకాల దాడి వంటి విషయాలలో వైవిధ్యం ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితులలో దీర్ఘకాలం నిల్వ ఉంచినట్లయితే తృణధాన్యాల కంటే పప్పు ధాన్యాలే ఎక్కువగా దెబ్బతినే అవకాశం ఉన్నదని సర్వే చెప్పింది.

అశాస్త్రీయ నిల్వతో ప్రొటీన్ లోపిస్తుంది

'బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విధానం ప్రకారం పరిశోధకులు దెబ్బతిన్న పప్పు ధాన్యాలు, పురుగు పట్టిన ధాన్యాలు, తేమ శాతం ఉన్న ధాన్యాలు, బరువు తగ్గిన ధాన్యాలు, సూక్ష్మజీవుల దాడికి గురైన ధాన్యాలు... ఇలా వివిధ రకాల ధాన్యాలపై త్రైమాసిక డేటాను నమోదు చేశారు. అధిక తేమ, తగినంత ఆక్సిజన్ సరఫరా లోపించడం వంటి అంశాలు పంట నాణ్యతను, రంగును ప్రభావితం చేస్తాయని, కీటకాల దాడిని పెంచుతాయని వారు గుర్తించారు' అని అధ్యయనం తెలిపింది. పప్పు ధాన్యాలను అశాస్త్రీయంగా, సరైన విధంగా నిల్వ చేయకపోతే వాటిలో అత్యవసర ప్రొటీన్ లోపిస్తుందని చెప్పింది. పోషకాహార లోపాలను నివారించడంలో ప్రొటీన్ కీలక పాత్ర పోషిస్తుందన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం అమలులో ఉన్న గిడ్డంగి పద్ధతులకు ఏనాడో కాలం చెల్లింది. పప్పు ధాన్యాల యాజమాన్యం విషయంలో నిర్దిష్ట నిబంధనలేవీ లేకపోవడం కూడా లోపంగా కన్పిస్తోందని పరిశ్రమకు చెందిన వారు, నిపుణులు అభిప్రాయపడ్డారు.

నిపుణులు ఏమన్నారంటే...

'పంట కోసిన తర్వాత నష్టాలను తగ్గించడానికి, నాణ్యతను కాపాడడానికి, ఆహార భద్రతను మెరుగుపరచడానికి పప్పు ధాన్యాల నిల్వకు సంబంధించి జాతీయ ప్రమాణాలు అవసరం. స్పష్టమైన, ఏకీకృత నిబంధనలు పలు సమస్యలను పరిష్కరిస్తాయి. ఫలితంగా మార్కెట్‌లో విశ్వాసం పెరుగుతుంది' అని ఐసీఏఆర్ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ బీబీ సింగ్ చెప్పారు. గిడ్డంగులలో క్రమం తప్పకుండా భౌతిక తనిఖీలు చేస్తే దొంగతనాలను, కల్తీని నిరోధించవచ్చునని స్టార్ అగ్రి అనే వేర్‌హౌసింగ్ కంపెనీ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు అమిత్ అగర్వాల్ తెలిపారు. సంవత్సరం క్రితం రూపొందించిన నిల్వ ప్రమాణాలు నేటి పరిస్థితులకు అనుగుణంగా లేవని అన్నారు. సర్వే నిర్వహించిన రాష్ట్రాలలో భౌగోళిక, వాతావరణ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. స్థానికంగా ఉండే తేమ, ఉష్ణోగ్రతలను బట్టి గిడ్డంగి పనితీరు మారుతుంటుంది.

పప్పు ధాన్యాలు అన్ని రాష్ట్రాల గిడ్డంగులలో నిల్వ చేయలేదని సర్వే గుర్తించింది. కాయధాన్యాలను ప్రధానంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ గిడ్డంగులలో నిల్వ చేశారు. కందుల్ని కర్నాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ గిడ్డంగులలో నిల్వ చేశారు. మొత్తంగా సర్వేలో 208 శనగ నమూనాలు, 177 కంది నమూనాలు, 72 మినుము నమూనాలు, 42 పచ్చి శనగ నమూనాలు, 30 కాయ ధాన్యాల నమూనాలను విశ్లేషించారు. ప్రపంచవ్యాప్తంగా నిషేధించిన మిథైల్ బ్రోమైడ్‌ను వాడవద్దని సర్వే హెచ్చరించింది. ఓడరేవులలో దిగుమతి చేసుకున్న పప్పు ధాన్యాలను నిల్వ చేయడానికి అల్యూమినియం ఫాస్ఫైడ్‌ను సూచించిన మోతాదులో మాత్రమే వినియోగించాలని చెప్పింది. కీటకాలను గుర్తించిన వెంటనే ఫ్యూమిగేషన్ చేయాలని సూచించింది. లేనిపక్షంలో తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపింది.

ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమలో భారీ పేలుడు

- **కార్మికుడి మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం**
- **పరిశ్రమను మూసేయాలంటూ గ్రామస్తుల ఆందోళన**
- **పరిశీలించిన తూప్రాన్ ఆర్‌డిఒ జయచంద్ర రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి గ్రామంలోని ఎమ్మెస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో సోమవారం భారీ పేలుడు సంభవించింది. ఇనుమును కరిగించే బట్టి పేలడంతో ఒక కార్మికుడు మృతి చెందారు. మరో ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాలకు నిలయంగా మారిన ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమను మూసేయాలంటూ గ్రామ యువకులు, ప్రజలు పరిశ్రమ ముందు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..

రంగయ్యపల్లి గ్రామ శివారులో ఉన్న ఎమ్మెస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో వందలాది మంది కార్మికులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనులు చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం ఇనుమును కరిగించే బట్టీల వద్ద సుమారు 25 నుంచి 30 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. కరిగించిన ఇనుమును క్రేన్ల సహాయంతో తరలిస్తారు. మధ్యాహ్నం సమయంలో అధిక వేడి కావడంతో బట్టి ఒక్కసారిగా పేలిపోయింది. దాంతో క్రేన్ డ్రైవర్ అన్ను విశ్వకర్మ (38) పూర్తిగా కాలిపోయాడు. బట్టీల వద్ద పనిచేస్తున్న మరో ఇద్దరిపై కరిగిన ఇనుము ద్రవం పడింది. దాంతో బీహార్‌కు చెందిన రాజేష్ పాండే, జితేందర్ రాయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పరిశ్రమ ప్రతినిధులు అంబులెన్స్ రప్పించి ఇద్దరు కార్మికులను ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన అన్ను విశ్వకర్మ మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆందోళన చేపట్టిన గ్రామస్తులు

బట్టీలో పేలుడు జరగడంతో పెద్ద ఎత్తున శబ్దం వచ్చి భూమి కంపించినట్టు అయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పేలుడు ధాటికి చుట్టుపక్కల ఉన్న ఇండ్ల కిటికీల అద్దాలు పగిలిపోయాయని, మరో ఇంటి గోడ కూలినందని తెలిపారు. పరిశ్రమను మూసేయాలంటూ గ్రామస్తులు తరలివచ్చి పరిశ్రమ గేటు ముందు బైటాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులకు సమాచారం అందడంతో మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ పరిశ్రమ వద్దకు వచ్చి గ్రామస్తులను సముదాయించారు. అలాగే తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి, మనోహరాబాద్ తహసీల్దార్ ఆంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అంబులెన్స్ గంట ముందు వచ్చి ఉంటే కార్మికుడి ప్రాణం దక్కేది
- తోటి కార్మికుల ఆవేదన

పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే కార్మికుని ప్రాణం పోయిందని, ప్రమాదం జరిగిన వెంటనే పట్టించుకోలేదని, గంట ముందుగా అంబులెన్స్ వచ్చి ఉంటే క్రేన్ డ్రైవర్ ప్రాణం దక్కేదని తోటి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను బానిసలుగా చూస్తున్నారని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరికీ చెప్పనీయకుండా తమపై ఆంక్షలు పెడుతున్నారని, చెబితే వేధిస్తారని తెలిపారు. ఈ రోజు ప్రమాదం జరిగినా.. అక్కడే పనులు చేయాలని ఒత్తిడి చేశారని, తర్వాత గ్రామస్తులు రావడంతో అక్కడి నుంచి పంపించేశారని అన్నారు. రెండు నెలల కిందట పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడిపై నుంచి వాహనం వెళ్లడంతో అతను మృతి చెందారని, ఆ ఘటన కూడా బయటకు రాకుండా అడ్డుకున్నారని వాపోయారు. 12 గంటలు పని చేయించుకుంటూ తమను వేధిస్తున్నారని ఆవేదన చెందారు.

తుది దశలో భారత్-యుఎస్ ఒప్పంద విధానాలు

- **గడువు సమయం ఏది లేదు..! వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వెల్లడి**

న్యూఢిల్లీ : భారత్, అమెరికా మధ్య పరస్పర సుంకాలపై ప్రారంభ విధాన ఒప్పందం తుది దశలో ఉందని వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ తెలిపారు. భేదాభిప్రాయాలు ఉన్న అంశాలు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ.. వాటిని ఇరు పక్షాలు క్రమంగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ ఒప్పందానికి సంబంధించిన గడువును వెల్లడించడానికి రాజేష్ అగర్వాల్ మీడియా సమావేశంలో నిరాకరించారు. "ఇండియా-యుఎస్ వాణిజ్య ఒప్పందంపై ఆరు దఫాలుగా చర్చలు జరిగాయి. పూర్తి స్థాయి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం గురించి, పరస్పర సుంకాల సమస్యను పరిష్కరించగల మధ్యంతర ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం గురించి రెండింటిపైనా చర్చించాము. కనీసం విధాన ఒప్పందంపై మేము చాలా చేరువలో ఉన్నాము. ఇది తక్కువ వ్యవధిలోనే పూర్తి కావొచ్చు. అయితే దానికి మేము ఒక సమయాన్ని నిర్ణయిం చుకోలేదు." అని అగర్వాల్ తెలిపారు. యూరోపియన్ యూనియన్ తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చల విషయంపై అగర్వాల్ మాట్లాడుతూ.. రెండు పక్షాలు తమ భేదాభిప్రాయాలను నిరంతరం తగ్గిస్తున్నాయని తెలిపారు. ప్రతి సమావేశం భేదాభిప్రాయాలను తగ్గించడానికి తమకు సహాయపడుతుందన్నారు. ప్రతి రోజు తమ బృందాలు ఏదో ఒక సమస్యపై నిమగ్నమై ఉంటున్నాయన్నారు. ఇకపై అధికారిక దఫా చర్చలు ఉంటాయని భావించడం లేదని.. కానీ దీనిని ముగింపు దిశగా ముందుకు తీసుకెళ్లడానికి భౌతిక, వర్చువల్ సమావేశాలు కొనసాగుతాయన్నారు. తదుపరి చర్చలు ఫిబ్రవరి 2026లో జరగొచ్చన్నారు.

దేశ భద్రతకు ముప్పు

- అణుశక్తి రంగం ప్రయివేటీకరణ బిల్లుపై ప్రతిపక్షాల ఆగ్రహం
- ఉన్నత విద్యను నియంత్రించే బిల్లునూ వ్యతిరేకించిన విపక్షాలు
- జెపిసికి పంపాలని డిమాండ్.. దిగొచ్చిన కేంద్రం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో రెండు కీలకమైన బిల్లులను ప్రవేశపెట్టింది. అందులో ఒకటి అణుశక్తి రంగం ప్రయివేటీకరణ బిల్లు, ఉన్నత విద్యను నియంత్రించే బిల్లు ఉన్నాయి. ఈ రెండు బిల్లులను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దేశ భద్రతకే ముప్పు అని ఆందోళనను వ్యక్తం చేశాయి. అంతేకాకుండా విస్తృత పరిశీలన కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపాలని డిమాండ్ చేశాయి. దీంతో ప్రభుత్వం దిగొచ్చింది. ఈ రెండు బిల్లులను జెపిసికి పంపింది. సోమవారం పార్లమెంట్ ఉభయ సభలు ప్రారంభం కాగానే గందరగోళం నడుమ నిమిషాల్లోనే వాయిదా పడ్డాయి. లోక్‌సభ రెండు సార్లు వాయిదా పడి, మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి ప్రారంభమైంది. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ పౌర అణుశక్తి రంగాన్ని ప్రయివేటీకరించే, 'సస్టైనబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా' బిల్లు (శాంతి బిల్లు)ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీన్ని సెలెక్ట్ కమిటీకి లేదా జెపిసికి పంపాలని డిమాండ్ చేశాయి. దీంతో ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో ఈ బిల్లును జెపిసికి పంపింది. అనంతరం కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ యుజిసి, ఎఐసిటిఇ, ఎన్‌సిటిఇ వంటి సంస్థలను రద్దు చేసి వాటి స్థానంలో ఒకే కమిషన్‌ను నియమించే వికసిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్ (విబిఎస్‌ఎ) బిల్లును ప్రవేశపెట్టారు. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. కాంగ్రెస్ ఎంపి మనీశ్ తివారీ, టిఎంసి ఎంపి సౌగత రాయ్, సిపిఎం ఎంపి రాధాకృష్ణన్ వికసిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్ బిల్లును వ్యతిరేకించారు.

"వారు (పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ) బిల్లును అధ్యయనం చేయడానికి మాకు అవకాశం ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ బిల్లును జెపిసికి సూచించాలని ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. అలాగే కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పాత చట్టాలను రద్దు చేయడం, లేదా వాటి స్థానంలో మార్పులు చేయడం కోసం రిపలింగ్ అండ్ అమెండింగ్ బిల్లును ప్రవేశపెట్టారు. కొత్త చట్టాలను తీసుకురావడానికి, లేదా పాత చట్టాల్లోని అనవసరమైన, పాత నిబంధనలను తొలగించడానికి దీన్ని ఉపయోగిస్తారు.

బిల్లులకు హిందీ పేర్లను పెట్టడాన్ని వ్యతిరేకించిన ప్రతిపక్ష ఎంపిలు

విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభలో వికసిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్ బిల్లును ప్రవేశపెట్టగా, కీలక చట్టాలకు హిందీ పేర్లను పెట్టడాన్ని ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకించారు. ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్‌ఎస్‌పి ఎంపి ఎన్‌కె ప్రేమచంద్రన్ మాట్లాడారు. బిల్లులకు హిందీలో పేర్లు పెట్టడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 348(బి)ని ఉల్లంఘించడమేనని వాదించారు. కాంగ్రెస్ సభ్యురాలు జోతిమణి, డిఎంకె సభ్యుడు టి.ఎం సెల్వగణపతి, సిపిఎం ఎంపి కె.రాధాకృష్ణన్ కూడా బిల్లు పేరును వ్యతిరేకించారు. "దీనిని నేను హిందీని రుద్దడంగా చూస్తున్నాను. ఇప్పటికే, తమిళనాడు జాతీయ విద్యా విధానం–2020లో త్రిభాషా విధానాన్ని వ్యతిరేకించింది. ఇప్పుడు ఎస్‌ఎస్‌ఎ నిధులను కోల్పోయింది" అని జోతిమణి అన్నారు. దక్షిణాది రాష్ట్రాలపై హిందీని రుద్దడానికి వ్యతిరేకంగా డిఎంకె ఎంపి టిఆర్ బాలు మాట్లాడారు.

కార్మికులకు వ్యతిరేకం

- రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం
- కేంద్రంపై సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్ విమర్శలు

ఉపాధి హామీ పథకం హామీ ఇచ్చిన హక్కులను తొలగించడంతో మోడీ ప్రభుత్వం ఈ పథకాన్ని కార్మికులు, రాష్ట్రాలకు వ్యతిరేకంగా మారుస్తోందని సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. సోమవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ వేతనాలతో సహా కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిధులు సమకూర్చే ఈ పథకం ఆర్థిక భారంలో 40 శాతం రాష్ట్రాలు భరించాల్సి వస్తోందని అన్నారు. రాష్ట్రాలు రూ.50,000 కోట్లకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుందని వివరించారు. దీంతో ఒక్కో రాష్ట్రానికి దాదాపు రూ.2,000–రూ.2,500 కోట్ల అదనపు భారం పడుతోందని విమర్శించారు. కేంద్రం మోసంతో రాష్ట్రాలపై పథకం బాధ్యతను విధించడాన్ని అభివృద్ధి అని చెప్పలేమని అన్నారు. ఒక కార్మికుడు ఉద్యోగం అడిగితే, కేంద్ర ప్రభుత్వం దానిని అందించడానికి బాధ్యత వహిస్తుందని, ఇది ఉపాధి హామీ పథకం ప్రధాన ఆలోచన అని తెలిపారు. అయితే మోడీ ప్రభుత్వం కొత్త బిల్లుతో ఈ పథకం ఈ లక్ష్యాన్ని తారుమారు చేసిందని విమర్శించారు. ముందుగా నిర్ణయించిన షరతుల ఆధారంగా కేంద్రం పంపిణీ చేసే నిధుల చట్రంలోనే ఈ పథకాన్ని అమలు చేయాలని చెబుతున్నారని వివరించారు. నిధులు అయిపోయిన తరువాత ఈ పథకం కూడా రద్దు చేయబడుతుందని, ఉపాధి హామీ పథకం గతంలో గ్రామసభలు, పంచాయతీలపై ఆధారపడి ఉండేదని అన్నారు. అయితే, మోడీ ప్రభుత్వం ఈ వ్యవస్థను సరిదిద్దాలని, బయోమెట్రిక్స్, జియో-ట్యాగింగ్, ఎఐ ఆడిట్ మొదలైన వాటిపై ఆధారపడాలని ప్రతిపాదించిందని తెలిపారు. ఉపాధి హామీ చట్టంలోని సెక్షన్ 10 కింద ఏర్పాటు చేయబోయే కేంద్ర ఉపాధి హామీ మండలిలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, మహిళల ప్రాతినిధ్యం ఉండేలా నిబంధనలు ఉన్నాయనీ, అయితే, కొత్త బిల్లులో రిజర్వేషన్లకు సంబంధించిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని ఆయన చెప్పారు.

తిరువనంతపురం కార్పొరేషన్‌లో కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కు!

- సర్దుబాటు చేసుకున్న ఇరు పార్టీలు



తిరువనంతపురం : కేరళ రాజధాని తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ కుమ్మక్కయినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. అందువల్లే మొట్టమొదటిసారిగా బిజెపి అతి పెద్ద పార్టీగా అవతరించింది. ఇందుకు యుడిఎఫ్ మార్గం సుగమం చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో రహస్య అవగాహనలు జరిగినట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా తిరువనంతపురం కార్పొరేషన్‌లో ఇది చాలా స్పష్టంగా కనిపించింది. బిజెపి గెలుపొందిన 41 డివిజన్లలో గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితమైంది. ఐదు డివిజన్లలో 60 ఓట్ల కన్నా తక్కువ తేడాతో ఎల్‌డిఎఫ్ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఆ ఐదు కంజిరంపారా (39ఓట్లు), పొన్నుమంగళం (14), ఇడవకోడ్ (11), వాలా (12), కుడిలెం(55) డివిజన్లు. బిజెపి గెలిచిన 25 డివిజన్లలో కాంగ్రెస్‌కు కేవలం వెయ్యి కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. ముఖ్యంగా తిరువనంతపురం జిల్లాలో నాలుగు డివిజన్లు అత్తిపా (370), కరుమమ్ (525), ఫోర్ట్ (225), నెడుంగడ్ (395)లలో 400 కంటే తక్కువ ఓట్లు పోలయ్యాయి.

ప్రతి డివిజన్‌లో సగటున నాలుగు వేల నుండి ఆరు వేల ఓట్లు పోలవగా, అనేక వార్డుల్లో కాంగ్రెస్‌కు వెయ్యి ఓట్లు కూడా రాకపోవడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంగ్రెస్ గనక బిజెపికి అతీతంగా సాయపడకుండా వుంటే కౌన్సిల్‌లో ఎల్‌డిఎఫ్ ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించి వుండేదని ఎల్‌డిఎఫ్ పేర్కొంది. వంద మంది సభ్యులు గల గత కౌన్సిల్‌లో ఎల్‌డిఎఫ్ 53మంది కౌన్సిలర్లు ఉండగా, బిజెపికి 35మంది, కాంగ్రెస్‌కు 10మంది సభ్యులు ఉన్నారు. కొన్ని డివిజన్లలో బిజెపి కూడా కాంగ్రెస్‌కు సాయం చేసినట్లు తెలుస్తోంది. ముట్టడ డివిజన్‌లో బిజెపి అభ్యర్థికి 460 ఓట్లు రాగా, కున్నుకుజిలో ఈ సంఖ్య 394గా ఉంది. కార్పొరేషన్‌లో వామపక్షాలను అధికారం నుండి దూరం చేయాలన్నదే బిజెపి, యుడిఎఫ్‌ల ఏకైక లక్ష్యంగా వుందని ఎల్‌డిఎఫ్ విమర్శించింది. అనేక డివిజన్లలో ఓట్లు తారుమారైనా బిజెపి మెజారిటీ సాధించలేకపోయింది. కాంగ్రెస్, బిజెపిల మధ్య పరస్పర మద్దతు, అవగాహన వున్నట్లుగా కనిపిస్తున్న ఇటువంటి ఘటనలు కేవలం తిరువనంతపురంలోనే కాకుండా, కొల్లం, కొట్టాయం, ఇడుక్కి, అలప్పుజ, పతనం తిట్ట, కన్నూర్ వంటి జిల్లాల్లోనూ చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

తిరువనంతపురంలో అసలు లెక్కలివి : జాన్ బ్రిట్టాస్

కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో వామపక్షాలకు జరిగిన నష్టానికి అసలు కారణం బిజెపి, కాంగ్రెస్ కుమ్మక్కు కావడమేనని సిపిఎం నేత జాన్ బ్రిట్టాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. తిరువనంతపురం కార్పొరేషన్‌లో బిజెపి పనితీరుకు సంబంధించి ప్రధాని మోడీ చేసిన 'మలుపు తిప్పే' వ్యాఖ్య, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు శశిథరూర్ చేసిన 'చారిత్రక ప్రదర్శన' వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి 2,13,214 లభించాయి, 2025లో స్థానిక సంస్థల ఎన్నికల్లో 1,65,891 ఓట్లు వచ్చాయి. (అంటే తగ్గాయి). అదే సమయంలో కాంగ్రెస్‌కు వరుసగా 1,84,727 ఓట్లు, 1,25,984 ఓట్లు లభించాయి (తీవ్రంగా పడిపోయాయి). ఇక వామపక్షాలకు వరుసగా 1,29,048 ఓట్లు, 1,67,522 ఓట్లు లభించాయి. (అంటే పెరిగాయి) ఇక్కడ ఈ సమాచారం సందర్భోచితం కాకపోయినా అవగాహన కోసం అందజేసినట్లు బ్రిట్టాస్ ట్వీట్ చేశారు.

మద్యం కేసులో బెయిల్ రద్దు పిటిషన్ల విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ మద్యం కేసులో ముగ్గురు నిందితుల బెయిల్ రద్దు పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ వాయిదా వేసింది. మద్యం కేసులో ధనుంజయ్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప, కృష్ణ మోహన్ రెడ్డిలకు ట్రయల్ కోర్టు ఇచ్చిన డిఫాల్ట్ బెయిల్‌ను హైకోర్టు రద్దు చేసింది. దీంతో హైకోర్టు ఆదేశాలను ముగ్గురు నిందితులు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్లను సోమవారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం, దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన కౌంటర్లపై రిజాయిండర్ దాఖలుకు నిందితుల తరపు న్యాయవాదులు సమయం కోరారు. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్లు దాఖలు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ పరిగణనలోకి తీసుకోలేదని, విచారణ చేపట్టలేదని ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదించారు. ఛార్జిషీట్ పరిగణనలోకి తీసుకుని విచారణ జరపాలని ట్రయల్ కోర్టుకు సిజెఐ సూచించారు.

భావితరాలకు గుర్తుండేలా.. పొట్టి శ్రీరాములు స్మృతి వనం

(మొదటిపేజి తరువాయి)

మరికొంత కాలం హైదరాబాద్‌లో ఉంటూ అభివృద్ధి చేసుకున్నామన్నారు. నేడు అమరావతిని నిర్మించుకుంటూ అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా విశాఖ, తిరుపతి వంటి ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇటీవల ఆర్‌బిఐ ఇచ్చిన నివేదికలో కూడా ఫలాలు, చేపలు పండించే ప్రాంతంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని పేర్కొందన్నారు. 18 నెలల్లో రూ.21 లక్షల కోట్లు పెట్టుబడులు సాధించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కనీసం రాజధాని పేరు కూడా చెప్పుకోలేని స్థితి ఉండేదని, మూడు రాజధానులంటూ మహా కుట్ర చేశారన్నారు. నేడు గర్వంగా మన రాజధాని అమరావతి అని చెప్పుకోగలమన్నారు. మెడికల్ కళాశాలల విషయంలో కొందరు కావాలని రాజకీయం చేస్తున్నారన్నారు. రహదారులైనా పిపిపి మోడ్‌లో నిర్మించి ఆఖరున ప్రభుత్వానికి అప్పజెబుతారని, అదే తరహాలో మెడికల్ కళాశాలలను నిర్మిస్తున్నామన్నారు. కాలేజీలు కట్టినా ప్రభుత్వ అజమాయిషీలోనే ఉంటాయని అన్నారు. పిపిపి విధానం వచ్చిన తర్వాతే రహదారులు, ఎయిర్‌పోర్టులు వంటి మౌలిక సదుపాయాలు అందరికీ అందుబాటులోకి వచ్చాయన్నారు. వాటి వల్ల ఆదాయం పెరిగి ప్రజల సంపద కూడా పెరుగుతుందన్నారు. పేదవారిని ఆదుకోవడానికే పి4 విధానాన్ని కూడా కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చామని, కన్యకాపరమేశ్వరి ఆత్మత్యాగం చేసిన రోజును ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, కందుల దుర్గేష్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), ఆర్యవైశ్య సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులకు సన్మానం

పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులు గునుపూడి హనుమంతరావు, సత్యనారాయణ, కుందా ప్రతిభ, గునుపూడి నరసింహారావు, గునుపూడి సుబ్రహ్మణ్యంలను సిఎం చంద్రబాబు దుశ్శాలువాతో సత్కరించి, వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందించారు.

జిఆర్‌ఎంజి బిల్లును ఉపసంహరించాలి

(మొదటిపేజి తరువాయి)

అసాధారణమైన ఆర్థిక భారాన్ని మోపుతోంది. కేంద్రం రాష్ట్రాల వారీగా వ్యయ పరిమితులను విధిస్తూ 'ప్రామాణిక కేటాయింపు'ను ప్రవేశపెట్టడం, అదనపు వ్యయాలను రాష్ట్రాలే భరించాల్సి రావడం వల్ల ఈ కార్యక్రమం ప్రజల్లోకి వెళ్ళే అవకాశాలు బాగా కుదించబడతాయి, పైగా కేంద్ర జవాబుదారీతనం కూడా నీరు గారుతుంది. పైగా ఈ పథకానికి ఎంఎన్‌ఆర్‌ఇజిఎగా వున్న పేరును జి ఆర్‌ఎం జి (జి రామ్ జి)గా మార్చాలన్న నీచపు ఆలోచన వెనుక బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతిక ధోరణి ప్రతిబింబిస్తోంది. ఈ నేపథ్యంలో విబి–జిఆర్‌ఎంజి బిల్లును తక్షణమే ఉపసంహరించాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. దీనికి బదులుగా ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎను బలోపేతం చేసేందుకు రాజకీయ పార్టీలతో, కార్మిక సంఘాలతో, గ్రామీణ పేదల సంఘాలతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని, సార్వజనీన, హక్కుల ప్రాతిపదిక ఉపాధి హామీగా సమర్థవంతంగా దీన్ని అమలు చేసేలా చూడాలని సిపిఎం కోరుతోంది.

మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం రద్దు తగదు

- దేశవ్యాప్త ఆందోళనలకు ఎఐఎడబ్ల్యుయు పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2005లో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేందుకే కేంద్రం కొత్త బిల్లు తీసుకొచ్చిందని ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ విమర్శించారు. సోమవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ బిల్లు చట్టమైతే ఉపాధి హామీ చట్టం తల లేని మొండెంగా తయారవుతుందన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలోని 'హామీ' అనే పదాన్ని తొలగించడం ద్వారా ఈ చట్టం నిర్వీర్యం అవుతుందన్నారు. గ్రామీణ కూలీలకు కొద్దిమేరకైన అండగా వున్న ఈ చట్టాన్ని కేంద్రం రద్దు చెయ్యబోతుందా? అని ప్రశ్నించారు. కొత్త చట్టం ద్వారా ఏ మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. పనిదినాలు 125 రోజులకు పెంచుతున్నట్లు చెప్పి, 60 రోజులు పని నిషేధం విధించారని విమర్శించారు. ఉపాధి హామీ పనులు ఫిబ్రవరి 20 నుంచి జూన్ 20 వరకు 75 శాతానికి పైగా జరుగుతాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని, ఈ నెలల్లో వ్యవసాయ పనులు పెద్దగా వుండవని అలాంటప్పుడు 60 రోజుల పని కుందింపు ఎందుకన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర, పంట పెట్టుబడి కలిపించడంలో విఫలమైన మోడీ ప్రభుత్వం రైతుల సమస్యలకు ఉపాధి పనులను కారణంగా చూపించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఉపాధి హామీ చట్టం అమలుకు కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 శాతం నిధులు ఇస్తున్నాయని కొత్త బిల్లు ప్రకారం 40 శాతం వాటా రాష్ట్రాలు ఇవ్వాలని పేర్కొనడం దారుణమన్నారు. పనులను నాలుగు రకాలుగా విభజించి యంత్రాలు, కాంట్రాక్టర్లకు ఉపాధి హామీగా మార్చనున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనాల కంటే రాష్ట్రాల్లో ఎక్కువ వేతనాలుంటే, అవే కనీస వేతనాలుగా ఉండాలని గత బిల్లులో పేర్కొన్నారు. ఇప్పుడు కొత్త బిల్లులో దాన్ని రద్దు చేశారన్నారు. ద్రవ్యోల్బణం ఆధారంగా వేతనాలు పెరగాలనే నిబంధన కూడా తొలగించారు. పేర్కొన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కూలీలు, పేదలు మంగళవారం నుండి వారం రోజులు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని, బిల్లు కాగితాలను దగ్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

లేబర్ కోడ్‌లపై 19న కేరళలో రాష్ట్ర సదస్సు

- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ కీలకోపన్యాసం..
- కార్మిక హక్కులపై రాజీపడేది లేదు
- స్పష్టం చేసిన మంత్రి శివన్‌కుట్టీ

తిరువనంతపురం : ప్రస్తుతమున్న 29 కార్మిక చట్టాల స్థానంలో కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఈనెల 19న రాష్ట్ర స్థాయి సదస్సుకు కేరళ ఆతిథ్యం ఇవ్వనుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వి.శివన్‌కుట్టి సోమవారం తెలియచేశారు. లేబర్ కాన్‌క్లేవ్ 2025 పేరుతో జరగనున్న ఈ సదస్సును ముఖ్యమంత్రి పినరయి విజయన్ రాజధాని తిరువనంతపురంలో ప్రారంభిస్తారు. ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ శివన్‌కుట్టి, లేబర్ కోడ్‌లను తీవ్రంగా విమర్శించారు. అవన్నీ కార్మిక వ్యతిరేకమైనవని, ఫెడరల్ వ్యవస్థను ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు. కొత్త చట్టాల్లోని అనేక నిబంధనలు కార్మికుల హక్కులను నీరుగారుస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను తగ్గిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్మికులకు రక్షణ కోసం, అదే సమయంలో రాష్ట్రాల రాజ్యాంగ హక్కులను పరిరక్షించే ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. పంజాబ్, తమిళనాడు, జార్ఖండ్, తెలంగాణాలతో పలు రాష్ట్రాలకు చెందిన కార్మిక శాఖా మంత్రులు ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. కేంద్రం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా స్పందించాలని కోరారు. కేరళ ఆర్థిక, న్యాయ శాఖ మంత్రి కె.ఎన్.బాలగోపాల్, పరిశ్రమల మంత్రి పి.రాజీవ్ ఈ చర్చల్లో పాల్గొంటారు. ఈ సదస్సులో రెండు సాంకేతిక సెషన్లు వుంటాయి.

విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి శివన్‌కుట్టీ

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్, కార్మిక సంఘ నేతలు, న్యాయ నిపుణులు, విద్యావేత్తలు ఈ సమావేశాల్లో పాల్గొంటారు. అడ్వకేట్ జనరల్ కె.గోపాల్‌కృష్ణ కురూప్ అధ్యక్షతన జరిగే మొదటి సమావేశంలో లేబర్ కోడ్‌ల ప్రభావంపై ప్రధానంగా చర్చ జరగనుంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ కీలకోపన్యాసం చేస్తారు. రెండో సెషన్‌లో, కేరళ కార్మిక విధానాన్ని, లేబర్ కోడ్‌లను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పథకాలను, వ్యూహాలను పరిశీలిస్తారు. రాష్ట్రాల వైఖరి, డిమాండ్లను పేర్కొంటూ విధానపరమైన డిక్లరేషన్‌ను ఆమోదించడంతో సదస్సు ముగుస్తుందని భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. లేబర్ కోడ్‌లను వ్యతిరేకించే కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కలిసి విధాన డిక్లరేషన్‌లో లేవనెత్తిన డిమాండ్లు, నిర్ధారణల ప్రాతిపదికన ఒక మెమోరాండాన్ని అందచేసే అవకాశం వుందన్నారు. కార్మికుల ప్రయోజనాల విషయంలో కేరళ రాజీపడేది లేదని శివన్‌కుట్టీ పునరుద్ఘాటించారు. కొత్త లేబర్ కోడ్‌లను అమలు చేస్తూనే కార్మికుల హక్కులకు వ్యతిరేకంగా వుండే ఏ నిబంధననైనా తీవ్రంగా ప్రతిఘటిస్తుందని స్పష్టం చేశారు.

జస్టిస్ వర్మకు ఆరు వారాల గడువు

- ఆరోపణలపై స్పందించేందుకు సమయం
- లోక్‌సభ స్పీకర్ ఏర్పాటు చేసిన విచారణ కమిటీ నిర్ణయం

న్యూఢిల్లీ : లోక్‌సభలో అభిశంసన తీర్మానాన్ని ఎదుర్కొంటున్న న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మకు తనపై వచ్చిన ఆరోపణలపై సమగ్రంగా స్పందించేందుకు ఆరు వారాల గడువు లభించింది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల విచారణ కమిటీ ఈ గడువును ఇచ్చింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్ నేతృత్వంలోని ఈ కమిటీ.. ఈనెల 5న జరిగిన విచారణలో జస్టిస్ వర్మ చేసిన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్నది. ఆయన ఎనిమిది వారాల అదనపు సమయం కోరగా.. కమిటీ ఆరు వారాల సమయాన్ని మాత్రమే మంజూరు చేసింది. ఇకపై మరింత గడువు ఉండదని స్పష్టం చేసింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆగస్టు 12న ఈ కమిటీని నియమించిన విషయం విదితమే. జస్టిస్ వర్మను తొలగించాలంటూ 146 ఎంపీలు సంతకం చేసిన తీర్మానం ఆధారంగా.. న్యాయమూర్తుల (విచారణ) చట్టం కింద ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ విచారణ కమిటీ జస్టిస్ వర్మకు ఆరోపణల మెమోతో పాటు ఆధారాలను అందించింది. ఇందులో మార్చి 14–15 రాత్రి జరిగిన అగ్నిప్రమాద సమయంలో ఢిల్లీ పోలీసులు, ఢిల్లీ ఫైర్ సర్వీస్ సిబ్బంది చిత్రీకరించిన నగదు కాలుతున్న వీడియోలు, ఇన్–హౌజ్ విచారణలో నమోదు చేసిన సాక్షుల వాంగ్మూలాలు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి. ఈ విచారణలో జస్టిస్ వర్మ తన నిర్దోషిత్వాన్ని నిరూపించేందుకు సాక్షులను ప్రవేశపెట్టే, ఆరోపణలకు మద్దతు ఇస్తున్న సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే పూర్తి అవకాశం ఉంటుంది. విచారణ జనవరి చివరి వారంలో మళ్లీ ప్రారంభం కానున్నది. తన అధికారిక నివాసంలో కాలిన స్థితిలో లభించిన లెక్కల్లో లేని నగదు ఘటనకు సంబంధించి లోక్‌సభలో ఆయన తొలగింపు తీర్మానాన్ని ఎదుర్కొంటున్న విషయం విదితమే. ఈ ఘటన జరిగిన వారంలోనే జస్టిస్ వర్మను ఢిల్లీ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. అప్పటి నుంచి ఆయనకు న్యాయపరమైన విధులు కేటాయించలేదు.

ఇండిగో విమానాల రద్దు తీవ్రమైనది : సుప్రీంకోర్టు

- ఢిల్లీ హైకోర్టు విచారణలో జోక్యానికి నిరాకరణ

న్యూఢిల్లీ : భారీ ఎత్తున ఇండిగో విమాన సర్వీసులను రద్దు చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇలా రద్దు చేయడాన్ని తీవ్రమైన, ప్రజా ఆందోళనకు సంబంధించిన విషయంగా సుప్రీంకోర్టు అభివర్ణించింది. అయితే ఈ అంశాన్ని ఢిల్లీ హైకోర్టు విచారణ చేస్తున్న కారణంగా ఈ అంశంలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. అలాగే, ఇండిగో విమానాల రద్దు, తద్వారా వేలాది మంది ప్రయాణీకులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన ఘటనలపై లోపాన్ని పరిశోధించడానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ఒక కమిటీ ఏర్పాటు చేసిన విషయాన్ని కూడా సుప్రీంకోర్టు గుర్తు చేసింది. జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఇండిగో విమానాల రద్దు అంశాన్ని అత్యవసరంగా విచారించాలని గతవారంలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలయింది. నరేంద్ర మిశ్రా అనే వ్యక్తి దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను అత్యవసర విచారణను నిరాకరించిన సుప్రీంకోర్టు సాధారణ పద్ధతిలో విచారణకు అనుమతించింది. దీంతో సోమవారం ఈ పిటిషన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు జడ్జిల ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. ఇండిగో అంశంపై సుప్రీంకోర్టులో సమాంతర విచారణను కోరుకోవడం లేదని ఈ పిటిషన్‌ను ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇక్కడ విచారణ చేస్తే ఢిల్లీ హైకోర్టులో విచారణ ఆగిపోయే ప్రమాదం ఉందని కూడా పేర్కొంది. రద్దు వివరాలను ప్రయాణీకులకు ఇండిగో తెలియచేయలేదని పిటిషనర్ మిశ్రా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

దేశవ్యాప్తంగా 95 విమానాశ్రయాల్లో ప్రయాణీకులు చిక్కుకుపోయారని, అనేక మంది వృద్ధులు, చిన్నారులు నేలపైనే పడుకోవాల్సి వచ్చిందని తెలిపారు. దీనికి సిజెఐ సూర్యకాంత్ స్పందిస్తూ 'ఇది చాలా తీవ్రమైన విషయం. లక్షలాది మంది విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారని మాకు తెలుసు. ప్రజలకు ఆరోగ్య సమస్యలు, ఇతర ముఖ్యమైన సమస్యలు కూడా ఉండవచ్చు' అని తెలిపారు. గతవారం కూడా ఇండిగో విమానాల రద్దు విమానరంగంలో సంక్షోభానికి దారి తీసిందని సుప్రీంకోర్టు ఆంగీకరించింది. సోమవారం ఇండిగో తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. ఈ విషయంపై డిజిసిఎ ఏర్పాటు చేసిన కమిటీ ఇప్పటికే విచారణ ప్రారంభించిందని తెలిపారు. ఈ నెల 2 నుంచి వరుసగా అనేక రోజుల పాటు ఇండిగో తన సర్వీసులను ఆకస్మాత్తుగా రద్దు చేయడంతో దేశీయ విమానయాన రంగంలో సంక్షోభం తలెత్తిన సంగతి తెలిసిందే. రోజుకు సుమారు 2,200 దేశీయ, అంతర్జాతీయ సర్వీసులను నడిపే ఇండిగో ఇందు కనీసం నాలుగో వంతు విమానాలను కూడా నిర్వహించలేదు. దీంతో ప్రయాణీకులు అనేక ఇబ్బందులు పడ్డారు. మరోవైపు ఇతర విమానసంస్థలు తమ ఛార్జీలను భారీగా పెంచాయి. ఇది కూడా ప్రయాణీకుల కష్టాలను రెట్టింపు చేసింది.

విద్యా ప్రమాణాల పెంపునకు కేంద్రం సహకరించాలి

(మొదటిపేజి తరువాయి)

హబ్‌కు మైటివై స్టార్టప్ హబ్ మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఎవిజిసి – ఎక్స్‌ఆర్, డబ్ల్యుఎవిఎక్స్ ఫ్రేమ్‌వర్క్ కింద ఇన్నోఎక్స్‌ఆర్ యానిమేషన్, ఎఆర్/ విఆర్, ఇమ్మేర్సివ్ టెక్నాలజీస్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. ఇండియా ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మిషన్ కింద రాష్ట్రంలో ఎఐ విస్తృతి వేగవంతానికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖలో జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ ఏర్పాటు చేయాలి

విశాఖలో జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ ఏర్పాటు చేయాలని కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి జయంత్ చౌదరిని మంత్రి నారా లోకేష్ కోరారు. విశాఖ జిల్లా పెదగంట్యాడలోని జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ (ఎన్‌ఎస్‌టిఐ) ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం ముందస్తుగా ఐదెకరాల స్థలాన్ని గుర్తించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సంస్థ ఏర్పాటుతో అధ్యాపక అభివృద్ధి, పరిశ్రమ అనుసంధానిత నైపుణ్య శిక్షణ, గ్రీన్ స్కిల్స్, డిజిటల్ రూపాంతరం కోసం ప్రాంతీయ కేంద్రంగా సేవలందించడమే కాకుండా జాతీయ నైపుణ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న పరిమితిని మించి ఎస్‌బిటిఇటి – ఎపితో ఎన్‌సివిఇటి అర్హతలను పెద్దయెత్తున స్వీకరించేందుకు ప్రత్యేక అనుమతి మంజూరు చేయాలని కోరారు. కేంద్ర మంత్రులతో భేటీలో మంత్రి లోకేష్ వెంట కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, టిడిపి ఎంపిలు ఉన్నారు.

పెంచలయ్య భార్యకు పాస్ బుక్ అందజేస్తున్న వాసుకి, శ్రీనివాసరావు

గంజాయి రహిత సమాజం నిర్మించాలి

(మొదటిపేజి తరువాయి)

కార్యకర్తలను చంపినా, వారి గొంతు, ఆశయాన్ని మాత్రం ఏమీ చేయలేరని పేర్కొన్నారు. మతతత్వం, విద్వేష రాజకీయాలు ఎంతో ప్రమాదకరమైనవి, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సమాజ మార్పునకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. అందరూ సంతోషంగా ఉండాలని, అందులో మనం ఉండాలనే భావం కలిగి ఉండాలని, అలా కోరుకొనే కార్యకర్త పెంచలయ్య అని వివరించారు.

యూత్ ఐకాన్ పెంచలయ్య : వి.శ్రీనివాసరావు

నేటి యువతకు కె.పెంచలయ్య ఆదర్శమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పెంచలయ్య లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. యువత ఎలా ఉండాలనే దానికి మార్గదర్శకం చూపారని వివరించారు. గంజాయి రద్దు కోసం యువత పోరాడాలని కోరారు. హత్య చేయించిన అరవ కామాక్షి ఒక్కరే కాదని, రాజకీయ పార్టీలు, కొందరు అధికారుల మద్దతుతోనే ఇది జరిగిందని అన్నారు. పెంచలయ్య కుటుంబానికి సిపిఎం పూర్తి అండగా ఉంటుందని, భవిష్యత్తులో మరింత సాయం చేస్తామని తెలిపారు. కందుకూరులో రాజకీయ గొడవల్లో చనిపోయిన వ్యక్తులకు ప్రభుత్వం సాయం చేసిందని, సమాజం కోసం ప్రాణత్యాగం చేసిన పెంచలయ్య కుటుంబాన్ని కూడా ఆదుకోవాలని కోరారు. ఇటీవల కలెక్టర్‌ను కలిశామని, పెంచలయ్య భార్యకు ఉద్యోగం, నగదు, పొలం, ఇవ్వాలని కోరామని తెలిపారు. అందుకు ఆయన స్పందించారన్నారు. సిఎంను స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. లేడీ డాన్లు విజృంభిస్తున్నారని సిఎం చెబుతున్నారని, అందుకు కారణం ఎవరని ప్రశ్నించారు. సిఎం చెప్పాల్సింది డాన్లు గురించి కాదని, వారిని ఎదుర్కొని ప్రాణత్యాగం చేసిన పెంచలయ్య గురించి అని అన్నారు. యువత స్కూలు, కాలేజీ స్థాయి వరకు గంజాయి మత్తులో తూలుతున్నా ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. మావోయిస్టులను ఏరేస్తున్నామని చెబుతోన్న కేంద్రం... గంజాయిని ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. పెంచలయ్యలా మరొకరికి జరగకుండా చూడాలని, ఆయన స్ఫూర్తితో సామాజిక ఉద్యమాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈ సభలో పెంచలయ్య సతీమణి కె.దుర్గ, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి అరెగెల సాయి, కాంగ్రెస్ పార్టీ సిటీ ఇన్‌ఛార్జి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు రాంబాబు, సిపిఐ ఎంఎల్ నాయకులు లక్ష్మీరెడ్డి, ఎస్‌యుసిఐ నాయకులు బసవరాజు, ఒపిడిఆర్ నాయకులు శివశంకర్, టిడిపి నాయకులు భానుశ్రీ, బిఎస్‌పి నాయకులు జానకీ ప్రసాద్, ఐలు నాయకులు విజయమోహన్‌రెడ్డి, పౌరహక్కుల సంఘం నాయకులు అబ్బయ్‌రెడ్డి, గిరిజన సంఘం నాయకులు కెసి పెంచలయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, గోగుల శ్రీనివాసులు, కె.అజయ్‌కుమార్, ఎం.పుల్లయ్య, టి.గోపాల్, మూలె వెంగయ్య, షేక్ రెహెనా బేగం, సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, కె.పెంచలయ్య పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

జీవన సౌరభం

శ్రమ నీ ఆయుధమైతే.. విజయం నీ బానిస అవుతుంది.

మీకోసం

కుక్కర్‌లో వండేటప్పుడు విజిల్ నుండి నీళ్లు బయటికి రాకుండా ఉండాలంటే కుక్కర్ మూత అడుగుభాగంలో అంటే విజిల్ గొట్టం చివర రెండు చుక్కల నూనె వేయాలి.

దీపం కొండెక్కింది!

వీధి అరుగుపై నారాయణరావు మాస్టారు కూర్చుని దినపత్రిక చదువుకుంటున్నారు. పక్కనే మనవడు రత్నాకర్, మనవరాలు మానస కూర్చుని తాత గారు చెబుతున్న విషయాలు వింటున్నారు. కాఫీ తీసుకువచ్చిన భార్యతో, 'గదిలో దీపం కొండెక్కబోతోంది. ప్రమిదలో కాస్త నూనె పోయి' అన్నారు మాస్టారు. 'అదేమిటి తాతయ్యా? దీపం ఎక్కడైనా కొండెక్కుతుందా?' అన్నాడు మనవడు నవ్వుతూ. ఇంతలో వీధిలోకి యాచకుడు వచ్చి 'ధర్మం చెయ్యండి బాబూ' అని అరిచాడు. మాస్టారు జేబులోంచి ఐదు రూపాయల నాణెం తీసి బిచ్చగానికి ఇచ్చారు. ఎదురుగా ఉన్న ఇంటావిడ ఇంట్లోంచి బయటకు వచ్చి, 'బియ్యం నిండుకున్నాయి. అలా వెళ్లవయ్యా, బాబూ' అంది.

'తాతయ్యా! నిండుగా ఉన్నాయని చెప్పి బిచ్చగాడికి బియ్యం వేయకుండా వెళ్ళిపొమ్మని చెప్పింది ఎందుకు?' అని ఆశ్చర్యంగా అడిగింది మానస. 'తాతయ్యా! ఈ మాటల తికమక మాకు అర్థం కాలేదు. కాస్త అర్థమయ్యేటట్లు చెప్పు' అన్నారు మనవలు.

'అదే మన భాష గొప్పతనం. కొన్ని పదబంధాలు పూర్వకాలం నుంచి అన్యాపదేశంగా ఉంటాయి. ఒక ఇంటి యజమాని చనిపోయినప్పుడు, ఆ ఇంటి దీపం ఆరిపోయిందని అంటారు. అది అశుభ సూచకం అందుకని దీపం ఆరిపోతుందని చెప్పడానికి బదులుగా, దీపం కొండెక్కుతోంది అని చెబుతారు. ఇక బియ్యం ఇంట్లో లేవని చెప్పడం లేమితనాన్ని సూచించినట్లు భావిస్తారు. అందుకని ఇంట్లో ఏవీ లేకపోయినా నిండుకున్నాయి అని అనడం ఆనవాయితీగా వచ్చింది. ఇలా కొన్ని మాటలు వ్యతిరేకంగా అనిపించినా, వాటి అర్థం నిగూఢంగా ఉంటుంది.' అని వివరించాడు తాతయ్య. 'ప్రతి మాట వెనుక ఇంత అర్థం దాగి ఉందా?' అని నోరెళ్ళబెట్టారు మనవలు.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు
94945 24445.

సరైన నీడ ఏది?

పిల్లలూ, పప్పీ మార్కెట్ నుంచి ఇంటికి సైకిల్ తొక్కుకుంటూ వెళుతోంది. దాని పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో దీని సరైన నీడను కనిపెట్టండి.



నేను గీసిన బొమ్మ

పులిపాక ఆకాష్,
3వ తరగతి
ఎం.పి.యు.పి.స్కూలు
పి.నైనవరం, ఎన్టీఆర్ జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

యాంటీ బయోటిక్స్ అవసరానికి మించితే ఆరోగ్యానికి ముప్పు

జలుబు..
దగ్గు.. జ్వరాలు... ఇలా అన్నింటికీ అవసరం ఉన్నా.. లేకపోయినా యాంటీ బయోటిక్స్ వాడడం మంచిది కాదు. సాధారణంగా తగ్గిపోయే వాటికి కూడా మందులు వాడేస్తుండటంతో శరీరం రోగ నిరోధక శక్తిని కోల్పోయి జీవచ్ఛవంలా మారుతోంది. అధిక ఉత్పత్తి కోసం కోళ్లు, చేపలు, రొయ్యలు పెంపకంలో యాంటీ బయోటిక్స్‌ను అధికంగా వినియోగిస్తున్నారు. వీటిని ఆహారంలోకి తీసుకున్నప్పుడు యాంటీబయోటిక్స్ కూడా మన శరీరంలోకి చేరుతున్నాయి. ప్రజారోగ్యం బాగుపడాలన్నా, శరీర రోగాలను తట్టుకుని, ఎదుర్కొనే సామర్థ్యం ఉండాలన్నా యాంటీబయాటిక్స్ వాడకం తగ్గించాలి. యాంటీబయోటిక్స్ రెసిస్టెన్స్ ప్రపంచంలో ఆరోగ్యానికి పెరుగుతున్న పెను ముప్పుగా గుర్తించాలి.

దశాబ్దాలుగా యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్) ప్రపంచ ఆరోగ్యానికి గణనీయమైన ముప్పుగా ఉంది. యాంటీబయాటిక్స్ అనేవి ప్రాణాధార మందులు. అవి ఇన్ఫెక్షన్ కల్గజేసే సూక్ష్మజీవులపై పనిచేస్తేనే ప్రాణాలను కాపాడతాయి. వైద్యచికిత్సలో ఔషధాలు మోతాదు మించి వాడితే అనర్థాలు చోటుచేసుకుంటాయి. యాంటీబయాటిక్ వాళ్లకు తోచిన విధంగా ఉపయోగించడం వల్ల సూక్ష్మక్రిములు నిరోధకతను పెంచుకుని ప్రాణాంతకంగా మారుతుంటాయి. యాంటీబయాటిక్ మందులు వేసినా కూడా సూక్ష్మజీవులు చనిపోవడానికి బదులు ఇంకా పెరుగుతూనే ఉండే పరిస్థితిని ఎఎంఆర్‌గా చెబుతాం. ఎంఆర్‌కి రాజధానిగా మనదేశం ఉందంటే ఆశ్చర్యం కలుగకమానదు.

2019లో ప్రపంచవ్యాప్తంగా 5 మిలియన్లు, మనదేశంలో పది లక్షల మంది వరకూ చనిపోయారు. రోజుకు 3500 మంది మరణిస్తున్నారనేది అంచనా. 2025 నుంచి 2050 నాటికి 40 మిలియన్ల మరణాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. 2050 తర్వాత ఏడాదికి 1.91 మిలియన్ మంది చనిపోయే ప్రమాదం ఉంది. యాంటీబయాటిక్స్ మన ఆరోగ్యానికి అత్యంత ప్రమాదంగా మారుతున్నాయి. కరోనా తర్వాత పరిణామాల్లో ప్రస్తుత సమాజంలో వీటి వినియోగం విపరీతంగా పెరిగింది. జలుబు, దగ్గు, జ్వరం వంటి చిన్న అనారోగ్య సమస్యలకు కూడా వీటిని ఉపయోగిస్తున్నారు. సాధారణంగా వ్యాధికారక బాక్టీరియా, వైరస్‌లు మొదలైన వాటి వల్ల కలిగే వ్యాధుల చికిత్సకు యాంటీబయాటిక్స్ ఉపయోగిస్తారు. 'సూపర్ బగ్స్' యాంటీబయాటిక్స్‌ను నిరోధిస్తాయి. యాంటీ బయాటిక్స్ ఎక్కువగా, అనవసరంగా తీసుకునే వ్యక్తుల శరీరంలో ఈ రకమైన సూపర్‌బగ్స్ కనిపిస్తాయి. ఎందుకంటే శరీరం నిరంతరం యాంటీబయాటిక్స్‌కు గురైనప్పుడు, మన శరీరం క్రమంగా దానితో పోరాడటానికి ఒక రక్షణ యంత్రాంగాన్ని అవలంబిస్తుంది. దీంతో ఎంత యాంటీబయాటిక్స్ వాడినా శరీరం వాటికి సరిగా పనిచేయదు. గ్రామీణ ప్రాంతాల్లో యాంటీబయోటిక్స్ వినియోగం అనేక అనారోగ్య సమస్యలకు, ఆరోగ్య ప్రమాదాలకు కారణంగా మారుతోంది. సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్ కొనుగోలు చేసి, వాటిని ఉపయోగిస్తుండటంతో దుష్పరిణామాలు వస్తున్నాయి. యాంటీబయోటిక్స్ డోసు తెలియకుండా చిన్న అనారోగ్యాలకు సైతం చాలా ఎక్కువగా వాడేస్తుండటం ఏమాత్రం సరికాదు. ఇది కూడా వారిలో రెసిస్టెన్స్‌కు కారణమౌతోంది.

దీనివల్ల భవిష్యత్తులో యాంటీబయాటిక్స్ ఉపయోగిస్తే పనిచేయని పరిస్థితి (ఎఎంఆర్) చోటు చేసుకుంటుంది. మనకు తెలియకుండానే శరీరంలో వివిధ సైడ్ ఎఫెక్ట్‌కు కారణమవుతున్నాయి.

మితిమీరితే ప్రజారోగ్యానికీ ప్రమాదం

యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ అనేది సహజమైన అంశం. మానవులు, జంతువులు, మొక్కల్లో యాంటీబయాటిక్స్ మితిమీరిన వినియోగం, దుర్వినియోగం సమస్యను మరింత తీవ్రతరం చేసింది. వినియోగం వల్ల వచ్చే సమస్యలను క్లిష్టంగా మారిన తర్వాత పరిష్కరించడం కష్టమవుతుంది. యాంటీబయాటిక్ మందులు వేసినా కూడా సూక్ష్మజీవులు చనిపోవడానికి బదులు ఇంకా పెరుగుతూనే ఉండే పరిస్థితి (ఎఎంఆర్) ఉంటుంది. వైద్యులు సరైన యాంటీబయాటిక్, సరైన డోసులో, సరైన కాలం పాటు, సరైన సమయంలో ఇవ్వాలి. వీలైనంత తక్కువకాలం పాటు యాంటీబయాటిక్స్ వాడడమే సరైన వ్యూహం. ఇన్ఫెక్షన్లకు సరైన చికిత్స చేయడం వల్ల యాంటీబయాటిక్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు తగ్గుతాయి, యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ రాదు. మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్, ప్యాన్ డ్రగ్ రెసిస్టెన్స్, ఎక్స్‌టెండెడ్ రెసిస్టెన్స్ వల్ల ఎక్కువ మరణాలు సంభవిస్తాయి.

దుష్పరిణామాలు అనేకం

కొన్ని రకాల యాంటీబయాటిక్స్ సైడ్ ఎఫెక్ట్స్ కారణమవుతాయి. వాంతులు, విరోచనాలు, వికారం, ఎలర్జీ వంటి ఇతర సమస్యలకు కూడా కారణమవుతాయి. ఇక అవసరం లేనప్పుడు యాంటీబయాటిక్స్ వాడడం అనవసరమైన ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. నిజంగా అవసరమైనప్పుడు సరిగ్గా పనిచేయని పరిస్థితి వస్తుంది. ఇది అనవసరమైన వైద్య ఖర్చులకు కారణంగా మారుతుంది.

అవగాహన ముఖ్యం

గ్రామీణ ప్రాంతాల్లో యాంటీబయాటిక్స్ వాడకంపై ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలి. ఆయా ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపరిచి, మెడికల్ షాపుల్లో నేరుగా మందులు ఇచ్చే విధానాన్ని అరికట్టాలి. వైద్య సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడకుండా నిరోధించేలా చర్యలు తీసుకోవాలి.

శృతిమించితే ప్రమాదం

మందులు సమర్థంగా ఇన్ఫెక్షన్లను నియంత్రించలేకపోతే ప్రాణాధార చికిత్సలైన కేన్సర్ చికిత్స, అవయవ మార్పిడి లాంటి వాటిపై ఎఎంఆర్ ప్రభావం చూపుతుంది. చెప్పిన డోస్ కంటే తక్కువ కాలం వాడడం, లేదా తగిన డోసేజిలో వాడకపోవడం ఒక వ్యాధికి సరిపడని మందు వాడడం లాంటివే. వైద్యులు చెప్పినట్లే వీటిని వాడాలి. వేరేవారికి రాసిన మందులు వాడితే నయమైపోతుందని అనుకోకూడదు. ఆయా వ్యక్తులు ఆరోగ్యరీత్యా తగిన మందులను సరైన డోసులోనే తీసుకోవాలి. మన దేశంలో నేరుగా దుకాణాలకు వెళ్లి ఏదిపడితే ఆ యాంటీబయాటిక్ కొనుక్కునే అవకాశం ఉండడం కూడా వీటి దుర్వినియోగానికి కారణం అవుతోంది. కొత్త యాంటీబయాటిక్స్ తయారీ చాలా సమస్యాత్మకం. ఖర్చుతో కూడుకున్నది. మార్కెట్లోకి రావడానికి చాలా సమయం పడుతుంది. దీనివల్ల కొత్త రకాల యాంటీబయాటిక్స్ తగ్గుతున్నాయి. అందుకని ఉన్నవాటినే జాగ్రత్తగా కాపాడుకోవాలి. చాలావరకు టీకాలు బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లను నిరోధిస్తాయి ఎఎంఆర్ సమస్య పరిష్కారానికి పిల్లలు, పెద్దలు, వృద్ధులు టీకాలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఎవరికైనా ఇన్ఫెక్షన్ రాకపోతే యాంటీబయాటిక్స్ వాడాల్సిన అవసరమే ఉండదు.



– డాక్టర్ చలమలశెట్టి మనోజ్‌కుమార్,
ఫిజీషియన్,
మణిపాల్ హాస్పిటల్స్,
తాడేపల్లి, గుంటూరుజిల్లా.

వైభవంగా అంతర్జాతీయ చలన చిత్రోత్సవం



అంతర్జాతీయ చలనచిత్రోత్సవం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లోని ఆడిటోరియంలో ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ (ఐఎఫ్ఎంఎ) ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. అభినయ కృష్ణ (అదిరే అభి) – ఉత్తమ దర్శకుడు– చిరంజీవా, ప్రవీణ్ కాండ్రేగుల – పరదా'– బెస్ట్ కంటెంట్ రైటర్, ఎస్‌జె శివ – ఉత్తమ దర్శకుడు – బకాసుర రెస్టారెంట్, రవితేజ దుగ్గిరాల–ఉత్తమ నటుడు – 8 వసంతాలు, కుషేందర్ రమేష్‌రెడ్డి– బెస్ట్ సినిమాటోగ్రఫీ – త్రిబనధారి బార్బరిక్, జిడి నరసిమ్మల–బెస్ట్ డైరెక్టర్–భవానీ వార్డ్ వంటి సినిమాలకు అవార్డులు దక్కాయి. ఎపి తెలుగు ఫిలిం ఛాంబర్ మాజీ అధ్యక్షులు, ప్రముఖ సినీ నిర్మాత అంబటి మధుమోహనకృష్ణ, ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు పులగం రామచంద్రారెడ్డి, ఐఎఫ్ఎంఎ జాతీయ అధ్యక్షులు దిలీప్ హెచ్ఆర్, ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఛైర్మన్, ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ అక్కమ్మగారి సూర్యనారాయణ, ఎపి తెలుగు ఫిలిం ఛాంబర్ సాంస్కృతిక విభాగం కన్వీనర్, సినీ నిర్మాత రావి సౌజన్య, రాష్ట్ర ఐఎఫ్ఎస్ఇ అధ్యక్షురాలు, ఐఎఫ్ఎం రాష్ట్ర అధ్యక్షురాలు మల్లిపెద్ది రవళి తదితరులు అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గాన్ని సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాష్ట్ర ఐఎఫ్ఎస్ఈ అధ్యక్షురాలు మలిపెద్ది రవళి, కార్యదర్శిగా నేట్టి అనిల్‌బాబు, కోశాధికారిగా మల్లపాటి రామలక్ష్మి, ఉపాధ్యక్షులుగా బిమ్మి బాల, జివిఎల్ లక్ష్మీపద్మ, ఉమామహేశ్వరి, ఎస్.బాదుల్లా, శివకుమార్ ఎన్నికయ్యారు.

అంబటి మధుమోహనకృష్ణ, ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ (ఐఎఫ్ఎంఎ) అధ్యక్షులు, నిర్మాత దిలీప్‌కుమార్, ఐఎంఎ నేషనల్ సెక్రటరీ రామచంద్రారెడ్డి పులగం మాట్లాడుతూ ప్రతిభకు పెద్దపీట వేస్తూ ఐఎఫ్ఎంఎ ఆధ్వర్యంలో ఏటేటా సినీ నటీనటులను ప్రోత్సహిస్తున్నామన్నారు.

'పతంగ్' ట్రైలర్ విడుదల

పతంగుల పోటీ నేపథ్యంతో రూపొందుతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. 'సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్' బ్యానర్‌పై విజయ్ శేఖర్ అన్నే, సంపత్, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహించిన ఈ సినిమాను ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు సమర్పిస్తున్నారు. ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నర్ అప్ ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఎస్.పి.చరణ్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. 'కొత్తవాళ్లతో చేసిన సినిమా అయినప్పటికీ, క్వాలిటీ విషయంలో ఎలాంటి రాజీ లేదు. కలర్‌ఫుల్ విజువల్స్‌తో పాటు ఈ సినిమాకు కథే హీరో. అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ సినిమా తప్పకుండా అలరిస్తుందనే నమ్మకం మాకు ఉంది' అని చిత్రబృందం తెలిపింది.

నేడు 'వెస్టన్ లవ్' ప్రివ్యూ షో

వారాహి ఆర్ట్స్ అండ్ శక్తి క్రియేషన్స్ బ్యానర్‌పై 'కాకర్ల ఎంఆర్' కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'వెస్టన్ లవ్'. వెంకట్ బొబ్బా సమర్పణలో కథానాయకుడిగా రావి రామ్‌చరణ్, కథానాయికగా మాహి నటించారు. విష్ణుశ్రీ, సత్యఈషా, పవన్, సుమన్, అశోక్‌కుమార్, రవిప్రకాష్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ పిఎల్‌కె రెడ్డి. సంగీతం ప్రమోద్ పులిగిల్ల, ఎడిటర్‌గా నందమూరి హరి. నిర్మాతలు రావి సౌజన్య, కాకర్ల ఎంఆర్. ఇటీవల సెన్సార్, ప్రీ ప్రొడక్షన్ పూర్తిచేసుకున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు ప్రివ్యూ షోను చిత్ర యూనిట్ ఏర్పాటుచేసింది.

17న 'రాజా సాబ్' రెండో పాట



ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్' చిత్రం నుండి డిసెంబర్ 17న రెండో పాట విడుదలవుతోంది. ఈ విషయాన్ని తెలుపుతూ తాజాగా 'సహనా సహనా..' అంటూ సాగే ఈ పాట ప్రోమోని చిత్రబృందం విడుదల చేసింది. మారుతీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఈ చిత్రం విడుదలకి సిద్ధమవుతోంది.

77 ఖాళీలు.. రేసులో 359మంది

నేడు అబుదాబి వేదికగా ఐపిఎల్ సీజన్–2026 మినీ వేలం – రూ.64.30కోట్లతో కోల్‌కతా నైట్‌రైడర్స్



దుబాయ్: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్–2026కు సంబంధించి మినీ వేలం మంగళవారం జరగనుంది. అబుదాబిలోని ఎతిహాద్ స్టేడియం వేదికగా జరిగే ఈ వేలంలో 10 ఫ్రాంచైజీలు కలిసి గరిష్టంగా 77మంది ఆటగాళ్లను భర్తీ చేసుకోనున్నాయి. మధ్యాహ్నం 2.00గం॥ల నుంచి జరిగే ఈ వేలంలో 77స్థానాలకు 359మంది ఆటగాళ్లు పోటీపడుతున్నారు. ఇందులో 114మంది అంతర్జాతీయ ఆటగాళ్లు ఉండగా.. వారిలో 31 మందికి మాత్రమే అవకాశం దక్కనుంది. రిటెన్షన్ ప్రక్రియ తర్వాత కోల్‌కతా నైట్‌నైడర్స్ వద్ద అత్యధికంగా రూ.64.3 కోట్లు ఉండగా.. ముంబయి ఇండియన్స్ వద్ద అత్యల్పంగా రూ.2.75 కోట్లు ఉన్నాయి. 10 ఫ్రాంచైజీలు రూ. 237.55 కోట్లు ఖర్చు చేయనున్నాయి. గత వేలంలో లక్నో సూపర్ జెయింట్స్ ఏకంగా రూ.27కోట్లకు రిషబ్ పంత్‌ను, కోల్‌కతా నైట్‌రైడర్ రూ.23.75కోట్లకు వెంకటేశ్ అయ్యర్‌ను కొనుగోలు చేసాయి. ఆ ఫ్రాంచైజీలు ఈసారి వారిద్దరినీ విడుదల చేయడం గమనార్హం. ఈసారి జరిగే మినీ వేలంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కేమరూన్ గ్రీన్ అత్యధిక బేస్ ప్రైజ్ దక్కే ఛాన్స్ ఉంది.

రూ.2 కోట్ల బేస్ ప్రైజ్ ఆటగాళ్లు...

రూ.2 కోట్ల బేస్ ప్రైజ్‌తో మొత్తం 45మంది ఆటగాళ్లు రిజిస్టర్ అయ్యారు. వీరిలో వెంకటేశ్ అయ్యర్, రవి బిష్ణోయ్, కామెరూన్ గ్రీన్, స్టీవ్ స్మిత్, జెమీ స్మిత్, ముజీబ్ ఉర్ రెహ్మాన్, నవీన్ ఉల్ హక్, సీన్ అబాట్, ఆస్టన్ అగర్, కూపర్ కన్నోలీ, జేక్ ఫ్రెజర్–మెక్‌గుర్క్, జోష్ ఇంగ్లిస్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, గస్ అట్కిన్సన్, టామ్ బాంటన్, టామ్ కర్రన్, లియామ్ డాసన్, బెన్ డకెట్, డానియల్ లారెన్స్, లియామ్ లివింగ్‌స్టోన్, డారిల్ మిచెల్, రచిన్ రవీంద్ర, మైఖేల్ బ్రేస్ వెల్, గెరాల్డ్ కొయెట్జీ, లుంగి ఎంగిడి, అన్రిచ్ నోర్జే, పతిరణ, తీక్షణ, హసరంగ, షాయ్ హోప్, అల్జరీ జోసఫ్ ఉన్నారు.

ఫ్రాంచైజీలు కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్లు – నగదు

1.	కోల్‌కతా నైట్‌రైడర్స్	13	రూ.64.30కోట్లు
2.	చెన్నై సూపర్ కింగ్స్	9	రూ.43.40కోట్లు
3.	సన్‌రైజర్స్ హైదరాబాద్	10	రూ.25.50కోట్లు
4.	లక్నో సూపర్ జెయింట్స్	6	రూ.22.95కోట్లు
5.	ఢిల్లీ క్యాపిటల్స్	8	రూ.21.80కోట్లు
6.	రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు	8	రూ.16.40కోట్లు
7.	రాజస్థాన్ రాయల్స్	9	రూ.16.05కోట్లు
8.	గుజరాత్ టైటాన్స్	5	రూ.12.90కోట్లు
9.	పంజాబ్ కింగ్స్	4	రూ.11.50కోట్లు
10.	ముంబయి ఇండియన్స్	5	రూ.2.75కోట్లు

ఐసిసి టి20 ప్రపంచకప్ టికెట్‌ను విడుదల చేస్తున్న లియొనెల్ మెస్సీ

అరుణ్ జైట్లీ స్టేడియంలో మెస్సీ బృందం

ప్రధానితో భేటీ రద్దు

న్యూఢిల్లీ: 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా' ప్రోగ్రాంలో భాగంగా అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ సోమవారం ఢిల్లీలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఢిల్లీలో అడుగుపెట్టిన ఫుట్‌బాల్ దిగ్గజం.. అరుణ్ జైట్లీ స్టేడియంలో అభిమానులు హర్షధ్వానాలతో స్వాగతం పలికారు. తన బృందంతో కలిసి మైదానంలోకి వెళ్లిన మెస్సీ ఐసిసి అధ్యక్షులు జై షాతో కలిసి టి20 ప్రపంచకప్ టికెట్ విడుదల చేశారు. ఆ తర్వాత 'మినెర్వా అకాడమీ'కి చెందిన యువకులతో ఫొటోషూట్‌లో పాల్గొన్నారు. సూరజ్, రొడ్రిగో డీపాల్ పాల్గొన్న ఈ కర్యాక్రమంలో మెస్సీకి జై షా ప్రత్యేక బ్యాట్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఢిల్లీ క్రికెట్ సంఘం(డిసిసిబి) అధ్యక్షుడు రోహన్ జైట్లీ తదితరులు పాల్గొన్నారు. ఢిల్లీ పర్యటనలో అడిడాస్ కంపెనీ కార్యక్రమంలో పాల్గొన్న మెస్సీ టీమ్.. అనంతరం వాంతార వణ్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా చివర్లో భారత ప్రధాని నరేంద్ర మోడీతో మెస్సీ బృందం పాల్గొనాల్సి ఉండగా.. ప్రధాని సోమవారం ఉదయం విదేశీ పర్యటనకు బయల్దేరి వెళ్లడంతో ఆ కార్యక్రమంలో రద్దయ్యింది.

అక్షర్ ఔట్.. షాబాజ్ ఇన్..

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో జరిగే మిగిలిన రెండు టి20లకు ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ దూరమయ్యాడు. లక్నో బయల్దేరిన భారతజట్టు బృందంతో అక్షర్ పటేల్ ఉన్నా.. అతడి ఫిట్‌నెస్‌ను మెడికల్ బృందం పరీక్షించాల్సి ఉంది. దక్షిణాఫ్రికాతో ధర్మశాల వేదికగా జరిగిన మూడో టి20కి ముందు అక్షర్ పటేల్ అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆ మ్యాచ్‌కు దూరంగా ఉండగా.. అతడి స్థానంలో హర్షిత్ రాణా తుదిజట్టులోకి వచ్చాడు. అక్షర్ అస్వస్థతకు గురైన విషయాన్ని జట్టు మేనేజ్‌మెంట్ బిసిసిఐకి తెలయజేసింది. దీంతో అక్షర్ స్థానంలో షాబాజ్ అహ్మద్‌ను మిగిలిన రెండు టి20లకు ఎంపిక చేసినట్లు బిసిసిఐ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

చివరి రెండు టి20లకు టీమిండియా జట్టు : సూర్యకుమార్(కెప్టెన్), శుభ్‌మన్(వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, దూబే, జితేశ్ శర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్లు), బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్, కుల్దీప్, హర్షిత్ రాణా, సుందర్, షాబాజ్ అహ్మద్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68